Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 18.04.2014, శుక్రవారం సంపుటి : 33 సంచిక : 46 పేజీలు : 16, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com

జిల్లాలో ఇక...

- యుద్ధానికి సిద్ధమైన పార్టీల సైన్యం
- నామినేషన్లతో జోరు
- హుషారుగా మొదలైన పోరు

# మహాసంగ్రామమే!

***జిల్లాలో సార్వత్రిక ఎన్నికల కురుక్షేత్రానికి ఆయా పార్టీలు అభ్యర్థులనే సైనికులను సిద్ధం చేసాయి. గత నెల రోజులుగా జిల్లాలో ఎన్నికల జాతర వాతావరణమే వుంది. మొదట మున్సిపల్ ఎన్నికలు, ఆ తర్వాత జడ్పీటీసీలు... ఇప్పుడు సార్వత్రిక ఎన్నికలు. ఆరు నెలలుగా జిల్లాలో ఎవరికీ ఏ పనీ లేదు, ఏ వ్యాపారమూ లేదు. రాజకీయాలే వ్యాపారము, వ్యాపకం అన్నీనూ!***

2014 సార్వత్రిక ఎన్నికలు జిల్లాలో పెనురాజకీయ మార్పులకు సంకేతం కానున్నాయి. సంచలనాలను రేకెత్తించనున్నాయి. పాతవారితో పాటు కొత్తవారిని కూడా మన ప్రజాప్రతినిధులుగా ఆవిష్కరింప చేయనున్నాయి.

జిల్లాలోని నెల్లూరు లోక్‌సభతో పాటు పది అసెంబ్లీ నియోజకవర్గాలలో ఎన్నికల వాతావరణం వేడెక్కివుంది. కాంగ్రెస్, తెలుగుదేశం, వైయస్సార్ కాంగ్రెస్, జైసమైక్యాంధ్ర, సీపీఎం, సీపీఐ, ఆమ్‌ఆద్మీ పార్టీ, బీజేపీ వంటి పార్టీలతో పాటూ ఇండిపెండెంట్లుగా సైతం అన్ని నియోజకవర్గాల నుండి అభ్యర్థులు రంగంలో వున్నారు. ఆయా పార్టీల అభ్యర్థులుగా నేతలు భారీ హంగామాలతో నామినేషన్లు వేసారు. నామినేషన్ల ప్రక్రియ 19వ తేదీకి పూర్తవుతుంది. నామినేషన్లు వేసిన అభ్యర్థులు ప్రచారంలో జోరుగా తిరుగుతున్నారు.

ఈసారి ఎన్నికలు ఎన్నో విచిత్రాలకు అద్దంపట్టాయి. చొక్కాలు మార్చినంత సులభంగా నాయకులు పార్టీలు మార్చుకున్నారు. రాష్ట్ర విభజన అనంతరం కాంగ్రెస్‌పార్టీ ధ్వంసం కావడంతో ఆ పార్టీలో వుంటున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డిలు తెలుగుదేశంలో చేరారు. వారికి సీట్లు దక్కాయి. ఒంగోలు మాజీఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి కూడా తెలుగుదేశంలో చేరారు. ఆయనకు ఒంగోలు లోక్‌సభ టిక్కెట్ ఇచ్చారు. వీళ్లు కాకుండా ఇంకెందరో ద్వితీయశ్రేణి నాయకులు, మాజీఎమ్మెల్యేలు కాంగ్రెస్‌ను వదిలి తెలుగుదేశంలో దూరారు. దీంతో తెలుగుదేశంలో వలస నాయకులకే సీట్ల విషయంలో పెద్దపీట వేయాల్సి వచ్చింది. వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థులు ముందుగానే ఖరారైపోయి ఉండడంతో సీట్ల తగాదాలు లేకుండా పోయాయి. ఒకే జాబితాలో జిల్లాలోని అన్ని సీట్లకు వైకాపా అభ్యర్థులను ఖరారు చేయడం జరిగింది. వైసిపి నుండి 10అసెంబ్లీ స్థానాలకుగాను ఐదు స్థానాలలో అభ్యర్థులు తొలిసారిగా పోటీ చేస్తుండడం విశేషం.

(మిగతా 12వ పేజీలో)

టీడీపీ-బీజేపీ...
## కూలిన కాపురం

(వివరాలు 12వ పేజీలో)



సింగిల్‌షాట్...
## సూపర్ హిట్

### సీట్ల ఖరారులో వై.యస్.ను తలపించిన జగన్

***చంద్రబాబు నాలుగైదు దఫాలుగా సీట్ల జాబితాలను విడుదల చేసాడు. అభ్యర్థుల లిస్టు విడుదల చేసిన ప్రతిసారీ ఎక్కడోచోట గొడవలే! పార్టీ కార్యాలయంలో విధ్వంసాలే...! బీజేపీతో పొత్తు పెట్టుకోవడం తెలుగుదేశం కొంపకే ఎసరుపెట్టింది. బీజేపీకి సీట్లిచ్చిన చోట తెలుగుదేశం కార్యకర్తలు రణరంగం సృష్టించారు. వలస నాయకులకు సీట్లిచ్చిన చోట యుద్ధకాండ జరిగింది.***

కాని వైకాపాలో ఇవేవీ చోటుచేసుకోలేదు. అభ్యర్థులను ప్రకటించే విషయంలో జగన్ తన తండ్రి వై.యస్.రాజశేఖరరెడ్డిని గుర్తుకు తెచ్చారు. 2009 ఎన్నికలప్పుడు రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ స్థానాలకు కూడా వైయస్ ఒకటేసారి అభ్యర్థులను ప్రకటించి సంచలనం సృష్టించారు. కాంగ్రెస్ చరిత్రలో ఎప్పుడూ ఇలా జరగలేదు. నామినేషన్ల ఆఖరిరోజు కూడా అభ్యర్థులను ప్రకటిస్తుండేవాళ్లు. 2009 ఎన్నికల్లో వై.యస్. ఒకేసారి లోక్‌సభ, అసెంబ్లీలకు దాదాపు సిటింగ్‌లను, ఇన్‌ఛార్జిలను అభ్యర్థులుగా ప్రకటించారు.

(మిగతా 12వ పేజీలో)

శాసించిన చోటే...
## శాపగ్రస్థుడిలా...

***జిల్లాలో తెలుగుదేశం పార్టీని ఆయన శాసించారు. ఎన్నికలొస్తే లోక్‌సభకు ఎవరుండాలి, ఏ అసెంబ్లీకి ఎవరిని పెట్టాలనే విషయంలో ఆయన మాటే శిరోధార్యమైంది. తెలుగుదేశం పార్టీకి ఆయన ఓ ఉగ్రవాది నాయకుడిలా తయారయ్యాడు.***

(మిగతా 12వ పేజీలో)



కోరుకున్న సీటును
దక్కించుకోలేకపోయిన సోమిరెడ్డి

'జైసమైక్యాంధ్ర'...
## అట్టర్‌ఫ్లాప్‌షో!

***మాజీముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి స్థాపించిన 'జైసమైక్యాంధ్ర' పార్టీ అట్టర్‌ఫ్లాప్‌షోగానే మిగిలిపోయే సూచనలు దండిగా కనిపిస్తున్నాయి. కిరణ్ నాయకత్వాన్ని ఎక్కువుగా ఊహించి ఈ పార్టీలో చేరినవారికి భవిష్యత్ అగమ్యగోచరంగా మారింది.***

(మిగతా 12వ పేజీలో)



రాష్ట్రం విడిపోయాక
'జైసమైక్యాంధ్ర' అంటే ఏం లాభం





తెలుగుదేశం పార్టీలో టిక్కెట్ల భాగోతం చూస్తూనే వున్నాం. వలసవచ్చినవాళ్లకు పెద్దపీట పడింది. పార్టీ కోసం పనిచేసిన వారి నోళ్లలో మన్నుపడింది. టిక్కెట్ల విషయంలో పార్టీలో గందరగోళం, పార్టీ కార్యాలయంలో ఫర్నీచర్ ధ్వంసం. అటు కాంగ్రెస్‌ను చూస్తే టిక్కెట్లు అడిగే వాళ్లు లేక, టిక్కెట్లను ఎవరెవరికిచ్చారో అర్థంకాక ఆ పార్టీ కార్యకర్తలే బుర్రలు గోక్కుంటున్నారు.

## మాట తప్పలేదు...
# టిక్కెట్ మారలేదు!

జిల్లాలో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ టిక్కెట్ల విషయంలో మాత్రం ఏ మార్పు జరగలేదు. జగన్ మాట తప్పలేదు. టిక్కెట్లు మారలేదు. ఎవరినైతే నియోజకవర్గాలకు సమన్వయకర్తలుగా ప్రకటించి పనిచేయించాడో వారినే అభ్యర్థులుగా ప్రకటించాడు. జిల్లాలో నెల్లూరు లోక్‌సభ స్థానంతో పాటు 10అసెంబ్లీలకు అభ్యర్థులను ఒకే దఫాలో ప్రకటించేసాడు. ఏ స్థానంలోనూ అభ్యర్థుల తారుమారు జరగలేదు. ప్రజల నోళ్లలో ఎవరైతే అభ్యర్థులుగా నానుతున్నారో వాళ్లే అభ్యర్థులయ్యారు. జగన్ ప్రకటించిన జాబితాలో చూస్తే అసెంబ్లీ బరి నుండి ఐదుమంది తొలిసారిగా దిగుతుండడం విశేషం. నెల్లూరు లోక్‌సభకు సిటింగ్ ఎంపీ మేకపాటి రాజమోహన్ రెడ్డినే ప్రకటించారు. కోవూరుకు ఉదయగిరికి సిటింగ్ ఎమ్మెల్యేలు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిలే దిగుతున్నారు. వెంకటగిరికి మాజీఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యే అభ్యర్థి. ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా జగన్ ఇక్కడ అభ్యర్థిని మార్చలేదు. నెల్లూరు నగరం నుండి గత ఎన్నికల్లో వెంట్రుకవాసిలో గెలుపును చేజార్చుకున్న పి.అనిల్‌కుమార్‌యాదవ్‌నే అభ్యర్థిగా ప్రకటించారు. తనతో పాటే కాంగ్రెస్ నుండి బయటకొచ్చి జిల్లాలో తన పార్టీకి మూల స్థంభంలా నిలిచిన కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి నెల్లూరురూరల్ టిక్కెట్ ఖరారు చేసాడు. జిల్లాలో వైకాపా బోణీకొట్టే తొలి సీటుగా పేరున్న సర్వేపల్లి అనుకున్నట్లుగానే కాకాణి గోవర్ధన్‌రెడ్డికి దక్కింది. ఇక కావలి టిక్కెట్‌ను మొదటి నుండి కనిపెట్టుకుని వున్న రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికే కేటాయించారు. సూళ్లూరుపేట ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గంలో మాత్రం (మిగతా 11వ పేజీలో)



# లెజెండ్
## పోటీకి దూరం

దాదాపు రెండు దశాబ్దాల పాటూ నెల్లూరు నగరాన్ని శాసించి, పదేళ్ల పాటూ జిల్లా కాంగ్రెస్ రాజకీయాలనే తన చుట్టూ తిప్పుకుని కంటిచూపుతో కాంగ్రెస్ కేడర్‌ను, చూపుడువేలుతో పార్టీ లీడర్లను శాసించిన సింహపురి లెజెండ్ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి ప్రత్యక్ష పోరాటానికి తెరపడిందా? ఇక ఆయన పాత్ర తెరవెనుకనే పరిమితం కాబోతుందా? ప్రస్తుతం జిల్లాలో ఇదే ప్రధాన చర్చగా వుంది. కొన్నేళ్ల క్రితం నెల్లూరు టిక్కెట్ కోసం అష్టకష్టాలు పడ్డ వివేకాకు ఈరోజు ఈ సీటును బంగారుపళ్లెంలో పెట్టిస్తారు. జిల్లాలో ఒక సీటు కాదు పదిసీట్లను కూడా ఆయన చెప్పినవాళ్లకే ఇచ్చే పరిస్థితి వుంది. ఆయన ప్రత్యేక్షపోరులోకి దిగకపోవడం వెనుక ఓటమి భయమేనని కొందరంటున్నా ప్రధానకారణం మాత్రం అనారోగ్యమేనని తెలుస్తుంది.

ఈ ఎన్నికల్లో తనకు బదులుగా తన తమ్ముడు ఆనం విజయకుమార్‌రెడ్డిని నెల్లూరు రూరల్ నుండి, కొడుకు ఆనం చెంచు సుబ్బారెడ్డిని నెల్లూరు నగరం నుండి పోటీలోకి దింపారు. వివేకా మాత్రం పోటీ చేయడం లేదు. ఎన్నికలన్నాక గెలుపోటములు సహజమే. రాష్ట్ర విభజన మూలంగా ఈ రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ప్రతికూల వాతావరణముంది. ఈ విషయం వివేకాకు తెలుసు. మొన్న కార్పొరేషన్ ఎన్నికల్లో 54డివిజన్‌లకు అభ్యర్థులను నిలబెడితే గట్టిగా నాలుగు చోట్ల కాంగ్రెస్ అభ్యర్థులు గెలుస్తారనే నమ్మకం లేదు. ఇలాంటి వాతావరణంలో కాంగ్రెస్ అభ్యర్థులుగా గెలవడం సాధ్యమయ్యేపనేనా? అయినా తన తమ్ముడు, కొడుకును బరిలోకి దింపారు. వీళ్ళిద్దరూ గెలుస్తారా? ఓడుతారా అనే విషయం పక్కనపెడితే వివేకా మాత్రం తన రాజకీయ కెరీర్‌ను ఓటమి అనేదే లేకుండా ముగించాడు. కౌన్సిలర్‌గా రాజకీయ జీవితాన్ని మొదలుపెట్టి ఎమ్మెల్యేగా రిటైర్మెంట్ తీసుకున్నాడు. ప్రత్యక్ష రాజకీయాలలోకి రావాలని వివేకా 1983 నుండి పోరాడాడు. 1995కి గాని ఆయన ప్రయత్నం ఫలించలేదు. 1995 మున్సిపల్ ఎన్నికల్లో నెల్లూరు మున్సిపల్ ఛైర్మెన్ అభ్యర్థిగా 36ఓట్ల తేడాతో విజయం సాధించారు. అప్పటినుండే రాజకీయ చక్రం తిప్పడం మొదలుపెట్టారు. నెల్లూరును తన చుట్టూ తిప్పుకోసాగారు. 1999 సార్వత్రిక ఎన్నికల్లో నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డిని ఢీకొని నెల్లూరు అసెంబ్లీ సీటును తెచ్చుకున్నాడు. బీజేపీ అభ్యర్థి దేగా నరసింహారెడ్డి మీద గెలిచాడు. తర్వాత ఐదేళ్లు వివేకాదే రాజ్యం. 2004లో తెలుగుదేశం వ్యతిరేక గాలి... వివేకా ఈసారి భారీ మెజార్టీతోనే గెలిచాడు. వై.యస్. ముఖ్యమంత్రి అయ్యాడు. ఆయన వద్ద వివేకాకు ఎనలేని ప్రాధాన్యత ఏర్పడింది. జిల్లాలో సైతం వివేకా మాటకే చెల్లుబాటు. 2009 ఎన్నికల్లో వివేకా సీటు మార్చాడు. కొత్తగా ఏర్పడ్డ నెల్లూరురూరల్ నియోజకవర్గం నుండి పోటీ చేసారు. ఇక్కడ ప్రజారాజ్యం నుండి తీవ్రమైన పోటీ... ఒక దశలో భారీమెజార్టీతో ఓడిపోతాడనే ప్రచారం. కాని 3131ఓట్ల తేడాతో వివేకా విజయం. మనిషిలో ఇంకా హుషారొచ్చింది. నెల్లూరు నగరం, రూరల్... రెండింటిని శాసించాడు. తమ్ముడు ఆనం రామనారాయణరెడ్డి ఆర్థిక మంత్రయ్యాడు. నెల్లూరుకు నిధులు పారించాడు. ఎక్కడచూసినా రోడ్లు, డ్రైనేజీలు, సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకు, బ్యారేజీ పనులు... నెల్లూరు కార్పొరేషన్ సైతం వివేకా ఆదేశాలతోనే పనిచేసింది. అయితే రాజకీయాలలోని శత్రువులను సైతం మిత్రులుగా మలచుకున్న ఆయనకు అసలు శత్రువు తన ఒంట్లోనే వుందన్న విషయం ఆలస్యంగా తెలిసింది. రాజకీయ ప్రత్యర్థులను ఒంటిచేత్తో మట్టికరిపించిన ఆయన తన ఒంట్లోని అనారోగ్యమనే ప్రత్యర్థిని మాత్రం జయించలేకపోయారు. ఎంత మేకప్ చేసుకుంటున్నా పెరిగే వయసును ఆపలేరు కదా! మనసు 20లో వున్నా మనిషికి 60దాటాయి. దీనికితోడు అనారోగ్యం... ఎన్నికలంటే పడుతూ లేస్తూ పరుగెత్తాలి. ఏ ఎన్నికల్లోనైనా నిద్రలేకుండా పనిచేసిన రాక్షసుడు వివేకా. కాని ఈసారి అలా పడుతూ లేవలేకే ఈ లెజెండ్ ప్రత్యక్ష ఎన్నికలబరి నుండి తప్పుకున్నారు.



# ఎన్నో కొత్తముఖాలు

2013ఎన్నికలు కొత్తవారినెందరినో తెరమీదకు తెచ్చాయి. పాతవారిని కొంతమందిని తెరవెనక్కు పంపించాయి. కొత్త తరానికి ప్రాతినిధ్యం కల్పించడంలో కాంగ్రెస్ వైయస్సార్ కాంగ్రెస్‌లు ముందు వరుసలో నిలిచాయి. తెలుగుదేశం పార్టీ నుండి మాత్రం ఇద్దరు ముగ్గురు తప్పితే మిగతా వాళ్లంతా పాతవాళ్లే కావడం విశేషం.

వైయస్సార్ కాంగ్రెస్‌లో కొత్త తరానికే పెద్దపీట పడింది. కాకాణి గోవర్ధన్‌రెడ్డి (సర్వేపల్లి), కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి(నెల్లూరు రూరల్), మేకపాటి గౌతమ్‌రెడ్డి(ఆత్మకూరు), కిలివేటి సంజీవయ్య (సూళ్లూరుపేట), పాశం సునీల్‌కుమార్(గూడూరు) తొలిసారిగా అసెంబ్లీ ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. పి.అనిల్‌కుమార్‌యాదవ్ (నెల్లూరుసిటీ), రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి(కావలి)లు గత సార్వత్రిక ఎన్నికల్లో తొలిసారి పోటీ చేసి ఓడిపోయారు. ఇప్పుడు రెండోసారి వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ వారికి అవకాశమిచ్చింది.

కాంగ్రెస్‌లో చూస్తే ఎప్పుడు చూసినా సిటింగ్‌లకే అవకాశం వుండేది. ఈసారి ఎలాగూ గెలిచేది లేదనుకున్నారో ఏమో కొత్తవారికి ప్రాధాన్యతనిచ్చారు. ఆనం రామనారాయణరెడ్డి ఒక్కడే పాతనాయకుడు. మిగతా అంతా కొత్తోళ్లే! ఆనం విజయకుమార్‌రెడ్డి(నెల్లూరు రూరల్), ఆనం చెంచుసుబ్బారెడ్డి(నెల్లూరు నగరం), డి.మధుసూదన్‌రావు (సూళ్లూరుపేట), పట్టాభిరామయ్య(సర్వేపల్లి), వెంకటరమణ(కోవూరు), చింతాల వెంకటరావు(కావలి), నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి(వెంకటగిరి), పి.చెంచలబాబుయాదవ్(ఉదయగిరి)లు కొత్తగా అసెంబ్లీ బరిలోకి దిగారు.

తెలుగుదేశం నుండి గూటూరు కన్నబాబు(ఆత్మకూరు) మాత్రమే కొత్తగా అసెంబ్లీ గోదాలోకి దిగారు. ఇక కిరణ్ నాయకత్వంలోని 'జైసమైక్యాంధ్ర' పార్టీ నుండి చూస్తే ఆనం జయకుమార్‌రెడ్డితో సహా మిగిలిన అభ్యర్థులందరూ అసెంబ్లీకి తొలిసారే పోటీ పడుతుండడం విశేషం.

## ఆనం ఫ్యామిలీ నుండి...
# ఆ నలుగురు






గడచిన మూడు, నాలుగు దశాబ్దాల కాలంగా చూస్తే ఒకట్రెండుసార్లు తప్పితే ఏ ఎన్నికలలో చూసినా ఆనం కుటుంబం నుండి ఇద్దరు పోటీలో వుంటుండేవాళ్లు. ఏ.సి.సుబ్బారెడ్డి, ఆనం వెంకటరెడ్డి... ఆనం వెంకటరెడ్డి, ఆనం సంజీవరెడ్డి... ఆనం వెంకటరెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి... ఆనం వివేకానందరెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి... ఇలా కాంబినేషన్‌లు నడిచాయి. ఈసారి ఎన్నికల్లో మాత్రం ఇద్దరికి బదులు నలుగురయ్యారు. నలుగురూ అసెంబ్లీ ఎన్నికల బరిలోనే దిగుతుండడం విశేషం. ఆత్మకూరు అసెంబ్లీ నుండి ఆనం రామనారాయణరెడ్డి మళ్ళీ పోటీ చేస్తున్నారు. ఇక నెల్లూరురూరల్ నుండి ఆనం విజయకుమార్‌రెడ్డి తొలిసారిగా అసెంబ్లీ ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. నెల్లూరు నగరం నుండి ఆనం వివేకాకు బదులుగా ఆయన కొడుకు ఏ.సి.సుబ్బారెడ్డి దిగారు. వీళ్లు ముగ్గురు కాంగ్రెస్ అభ్యర్థులే! కాని ఆనం వివేకానందరెడ్డితో విభేదించి వారికి దూరంగా వుంటున్న ఆనం జయకుమార్‌రెడ్డి మాత్రం నెల్లూరు నగరం నుండి జైసమైక్యాంధ్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఆనం వెంకటరెడ్డి కుటుంబంలో ఒకరి మీద ఒకరు పోటీ పడడం ఇదే మొదటిసారు. నెల్లూరు నగరంలో బాబాయ్ – అబ్బాయ్‌ల మధ్య పోటీ చర్చనీయాంశంగా మారింది.

## మహిళలకు...
# మొండిహస్తం






ఈ ఎన్నికలలోనూ కాంగ్రెస్‌పార్టీ మహిళలకు టిక్కెట్లు ఇవ్వలేదంటే ఇంతకంటే అధ్వాన్నపు పరిస్థితి ఇంకోటి వుండదు. ఎందుకంటే కాంగ్రెస్ టిక్కెట్లను ఈసారి పిలిచిపిలిచి ఇచ్చారు. అసలు కాంగ్రెస్‌తో సంబంధంలేని వాళ్లకు, అడ్రస్ లేని అనామకులకు ఈసారి కాంగ్రెస్ సీట్లు దక్కాయి. జనరల్ సీట్లలో దళితులకు సీట్లిచ్చేంత వెసలుబాటు ఈసారి కాంగ్రెస్‌లో వచ్చింది. కాని సీట్లు ఇంత ఫ్రీగా వున్నా ఒక్క మహిళా నాయకురాలికి కూడా కాంగ్రెస్ టిక్కెట్ దక్కకపోవడం విశేషం. జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలుగా పందిళ్ళపల్లి అరుణమ్మ 15ఏళ్ల నుండి పోరాడుతుంది. ప్రతి ఎన్నికల్లోనూ టిక్కెట్‌ను ఆశిస్తూనే వుంది. ఎప్పుడూ మొండిచేయి చూపినా నిరాశ చెందక పార్టీ కోసం పనిచేస్తూనే వుంది. ఈ ఎన్నికల్లో ఇచ్చే అవకాశం వున్నా ఆమెకు మొండిచేయి చూపారు. ఇంతకుముందు ఎన్నికల్లోనే నయం. 1999లో వెంకటగిరి నుండి రాజ్యలక్ష్మికి సీటిచ్చారు. 2004లో అయితే వెంకటగిరి నుండి రాజ్యలక్ష్మితో పాటు కావలి నుండి మాగుంట పార్వతమ్మకు సీటిచ్చారు. 2009లో వెంకటగిరిలో రాజ్యలక్ష్మికి, సూళ్లూరుపేటలో విన్నమాల సర్వసతికి సీటిచ్చారు. కాని ఈ ఎన్నికల్లోనే ఘోరం. మహిళలకు ఏ పార్టీ ఒక్క సీటు కూడా ఇవ్వలేదు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# తెదేపాలోకి దూకిన నెలవల



సూళ్ళూరుపేట మాజీ శాసనసభ్యులు నెలవల సుబ్రహ్మణ్యం ఈనెల 14న వైఎస్సార్సీపీలో నుంచి తెదేపాలోకి దూకారు. వైఎస్సార్సీపీ కేంద్ర పాలక కమిటీ సభ్యులుగా వున్న నెలవలకు సూళ్ళూరుపేట టిక్కెట్టు దక్కకపోవడంతో ఆ పార్టీకి రాజీనామా చేసి తెదేపాలో చేరారు. హైదరాబాదులో చంద్రబాబు నాయుడు సమక్షంలో తెదేపాలో చేరిన సందర్భంగా నెవల మాట్లాడుతూ రాష్ట్రాన్ని చక్కదిద్ది గాడిన పెట్టగలిగే వ్యక్తి, శక్తి చంద్రబాబేనని భావించి తాను తెదేపాలో చేరినట్టు తెలిపారు.

# ఆరు స్థానాల్లో సిపిఎం

జిల్లాలో ఆరు అసెంబ్లీస్థానాలకు సీపీఎం పోటీచేస్తుంది. నెల్లూరు రూరల్ నుండి మాదాల వెంకటేశ్వర్లు, వెంకటగిరి నుండి కటికాల వెంకటేశ్వర్లు, సూళ్లూరుపేట నుండి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ, గూడూరు నుండి నెల్లూరు యాదగిరి, సర్వేపల్లి నుండి మావిళ్లపల్లి మోహన్‌రావు, కోవూరు నుండి జొన్నలగడ్డ వెంకమరాజులు పోటీ చేస్తున్నారు.

# 'దేశం' ఇంట 'మాగుంట'



రాష్ట్ర రాజకీయాలలో చాలాకొద్ది కాలం మాత్రమే వున్నా తరతరాలకు తనను మరచిపోలేనంతటి కీర్తిని ప్రోది చేసుకున్న మహానాయకుడు స్వర్గీయ మాగుంట సుబ్బరామరెడ్డి. ఆయనే ఉం డుంటే మాగుంట ఇంటి రాజకీయాలలో రాజసం ఉట్టిపడుతుండేది. రాజకీయం ఆయన కాళ్ల వద్దకే వచ్చేది కాని రాజ కీయాల కోసం ఆయన పరుగులు తీసేవాడు కాదు. ఆయన రాజకీయ వారసుడిగా వచ్చిన ఆయన సోదరుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి ఈరోజు టిక్కెట్ కోసం ఇంకొకరి ముందు చేతులు చాచాల్సిన పరిస్థితిని తెచ్చుకున్నాడు.

రాష్ట్ర విభజన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన మాగుంట శ్రీనివాసులురెడ్డి ఎట్టకేలకు తెలుగుదేశం తీర్థం తీసుకున్నారు. ఈ నెల 14వ తేదీన హైదరాబాద్‌లో పార్టీ అధ్యక్షుడు చంద్ర బాబునాయుడు సమక్షంలో ఆయన తెలుగుదేశంలో చేరారు. ఒంగోలు లోక్‌సభ సీటును కూడా మాగుంట శ్రీనివాసులురెడ్డికే కేటాయించారు. వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీకి ప్రకాశం జిల్లా కంచుకోటలా వుంది. ఇలాంటి నియోజకవర్గంలో మాగుంట తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేయడం పెద్ద సాహసమే అవుతుంది.

తెలుగుదేశం పార్టీలో చేరే విష యంలో మాగుంట శ్రీనివాసులురెడ్డి చాలా ఆలస్యం చేసాడు. తెలుగుదేశంలో చేరా లనుకున్న నిర్ణయాన్ని ఆయన కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన వెనువెంటనే తీసుకుని వుంటే ఈరోజు రాజకీయ పరిస్థితి వేరే విధంగా ఉండేది. ఆరోజు నెల్లూరు పార్ల మెంటుకు అభ్యర్థిని ఖరారు చేయలేదు. ఆదాల ప్రభాకర్‌రెడ్డి కూడా లోక్‌సభకు పోటీ చేయాలా లేక నెల్లూరు రూరల్‌కు పోటీ చేయాలా అనే సందిగ్ధంలో ఉండి నారు. మాగుంట శీనయ్య ఆరోజే పార్టీలో చేరివుంటే నెల్లూరు లోక్‌సభ అభ్యర్థిగా ఆయననే పెట్టేవాళ్లు. నెల్లూరురూరల్‌లో ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఉండేవాడు. లోక్‌సభ పరిధిలోని 7సెగ్మెంట్లలో గట్టి అభ్యర్థులే ఉండేవాళ్లు. మాగుంట కుటుంబం నెల్లూరు లోక్‌సభకు తొలిసారిగా పోటీ చేస్తుంది కాబట్టి సానుభూతి ఓటింగ్ కొంత ఉండేది. అన్ని నియోజకవర్గాలలో కాంగ్రెస్ కేడర్ పార్లమెంట్ కొచ్చేసరికి మాగుంట వాళ్లకే పనిచేసేది. కందుకూరు, కావలి, ఉదయగిరి అసెంబ్లీలు ఇంతకుముందు ఒంగోలు లోక్‌సభలో ఉన్నవి కాబట్టి అక్క డున్న పాతపరిచయాలు కూడా ఎన్నికల్లో బాగా ఉపయోగపడేవి. అదీగాక సిటింగ్ ఎంపీగా మేకపాటి రాజమోహన్‌రెడ్డి మీద వ్యతిరేకత వుంది. మాగుంటకు అది కూడా కలిసొచ్చేది.

ఇన్ని ఉపయోగాలున్న నెల్లూరును ఆలస్యం మూలంగా వదులుకుని ఇప్పుడు నమ్మకం లేని ఒంగోలు లోక్‌సభకు పోవాల్సి వచ్చింది.

# నెల్లూరులో వై.వి.సుబ్బారెడ్డి



నెల్లూరులో వై.వి.సుబ్బారెడ్డిని కలిసిన తుంగా శివప్రభాత్‌రెడ్డి

వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు, ఒంగోలు లోక్‌సభ అభ్యర్థి వై.వి.సుబ్బారెడ్డి 15వ తేదీ తిరుపతి నుండి ఒంగోలు వెళుతూ కొద్దిసేపు నెల్లూరులో ఆగారు. తిరుమలలో శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శనం చేసుకున్న అనంతరం సుబ్బారెడ్డి, స్వర్ణమ్మ దంపతులు రోడ్డు మార్గాన ఒంగోలుకు బయల్దేరారు. కనుపర్తిపాడు క్రాస్‌రోడ్డు వద్ద వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘనస్వాగతం పలికారు. నెల్లూరు నగర అభ్యర్థి పి.అనిల్‌కుమార్‌యాదవ్, రూరల్ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వైకాపా నాయకులు మేకల నరేంద్ర కుమారుడు, ఆర్.శ్రీనివాసులు (ఆర్ఎస్ఆర్), భరత్, శివపురం సుభాషిణి, సురేష్, కిషోర్, విజయ్ తదితరులు సుబ్బారెడ్డిని కలిసి అభినందనలు తెలిపారు.

## కాంగ్రెస్‌కు అభ్యర్థుల కరువు
# దేశంలో తగవుల దరువు



ఈ ఎన్నికల్లో పోటీ చేసేందుకు కాంగ్రెస్‌కు అభ్యర్థుల కరువు వచ్చింది. కాంగ్రెస్ నుండి వచ్చిన వాళ్లకు టిక్కెట్లివ్వ డంతో తెలుగుదేశంలో గందరగోళం నెలకొందని సర్వేపల్లి వైకాపా అభ్యర్థి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఎద్దేవా చేసారు. మంగళవారం నెల్లూరులోని తన ఇంట్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌ను పదేపదే ఆలీబాబా దొంగల పార్టీగా అభివర్ణించిన చంద్ర బాబు ఈ రోజు అదే దొంగలకు టిక్కెట్లిచ్చి తనది పెద్ద దొంగలపార్టీ అని నిరూపించుకున్నాడని విమర్శించారు. 125సంవత్సరాల చరిత్ర కలిగిన కాంగ్రెస్‌కు, 30ఏళ్ల చరిత్రగల తెలుగుదేశంకు ఈ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులు దొరకని పరిస్థితి ఏర్పడిందన్నారు. సర్వేపల్లిలో తెలుగుదేశం తరపున పోటీ చేయడానికి ఎవరూ ముందుకు రాకపోవడం ఆ పార్టీ దుస్థితికి అద్దం పడుతుందన్నారు. కాంగ్రెస్‌వాళ్లు తెలుగుదేశంలోకి రావడంతో ప్రతిరోజూ ఎక్కడోచోట ఆ పార్టీ కార్యాల యాలలో కుర్చీలు విరుగుతూనే ఉన్నాయ న్నారు. ఆర్థికంగా బలవంతులు చేరినంత మాత్రాన తెలుగుదేశం పుంజుకునేదేమీలేద న్నారు. టీడీపీ బలపడుతుందన్న ప్రచారం ఆ పార్టీ నాయకులు ఆడిస్తున్న మైండ్‌గేమ్‌గా పేర్కొన్నారు. చంద్రబాబు ఈ జన్మకు ఇక రాష్ట్ర ప్రజల నమ్మకాన్ని పొందలేడని చెప్పారు. తెలుగుదేశంలోకి వెళుతున్న వాళ్లంతా మొదట వైకాపా వైపు చూసి ఇక్కడ ఖాళీలేక వెళుతున్నవారేనన్నారు. 1994లో ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన సంపూర్ణ మద్యపాన నిషేధం, రెండురూపాయల కిలోబియ్యం వంటి పథకాలను సైతం తుంగలో తొక్కిన చంద్రబాబు ప్రజలను ఏ ముఖం పెట్టుకుని ఓట్లడుగుతారని ఆయన ప్రశ్నించారు. 2004లో ఉచిత విద్యుత్ ఇస్తే కరెంట్ తీగలమీద బట్టలు ఆరేసుకోవాల్సి వస్తుందని చెప్పిన చంద్రబాబు, ఇప్పుడు ఉచిత విద్యుత్ ఇస్తానని చెప్పడం శోచనీయమన్నారు. జడ్పీ ఛైర్మెన్‌గా జిల్లాలో అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి చేసానని, సర్వేపల్లి ప్రజలు ఆదరించి ఆశీర్వదించాలని ఆయన కోరారు. జిల్లాలో తిరుపతి, నెల్లూరు లోక్‌సభలతో పాటు 10అసెంబ్లీ స్థానాలలో కూడా వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థులే ఘనవిజయం సాధిస్తారన్నారు.

## అవినీతిని కాదు...
# అనుభవాన్ని చూడండి



తెలుగుదేశంపార్టీ యువనేత నారా లోకేష్‌బాబు ఈ నెల 15వ తేదీన జిల్లాలో గూడూరు, వెంకటగిరి, నెల్లూరులలో తెలుగుదేశం అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ రోడ్‌షోలు నిర్వహించారు. ఆరోజు సాయంత్రం నెల్లూరులోని విఆర్‌సి సెంటర్ నుండి నర్తకి సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నర్తకి సెంటర్‌లో జరిగిన సభలో లోకేష్ మాట్లాడుతూ అవినీతికి పెద్దపీట వేసే వారిని కాదని, అభివృద్ధికి పెద్దపీట వేసే అనుభవమున్న చంద్రబాబునాయుడు నాయకత్వం ఈ రాష్ట్రానికి ఎంతో అవసర మని అన్నారు. సీమాంధ్ర ప్రజలు చంద్ర బాబు పాలన కోసం ఎదురుచూస్తున్నారని, ఆయనతోనే సీమాంధ్ర స్వర్ణాంధ్రగా మారు తుందన్నారు. తెలుగుదేశంపార్టీకి కార్య కర్తలే పునాదులని, 30ఏళ్లుగా పార్టీని కాపాడుకుంటూ వస్తున్నది వారేనని, ఎన్ని జన్మలెత్తినా వారి ఋణం తీర్చుకోలేమ న్నారు. తన తాత నందమూరి తారక రామారావు, తండ్రి నారా చంద్రబాబు నాయుడులు ముఖ్యమంత్రులుగా ఈ రాష్ట్రాభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేసారని చెప్పారు. హైదరాబాద్‌ను నిర్మిం చేందుకు నిజాం నవాబులకు 200ఏళ్లు పట్టిందని, ఒక రాజధానిని నిర్మించడానికి బ్రిటీష్‌వాళ్లకు వందేళ్లు పట్టిందని, కాని తొమ్మిదేళ్లలోనే చంద్రబాబు సైబరాబాద్‌ను నిర్మించారని అన్నారు. నాలుగు దశాబ్దాల రాజకీయ అనుభవమున్న చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే ఈ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, 16నెలలు జైలులో వున్న జగన్ వస్తే రాష్ట్రం అవినీతి మయమవు తుందన్నారు. అన్నదాతే ఈ రాష్ట్రానికి వెన్నెముక అని, చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే తొలిసంతకం రైతు ఋణమాఫీ ఫైలు మీదేనన్నారు. డ్వాక్రా మహిళల ఋణాలను కూడా రద్దు చేస్తామన్నారు. 2రూపాయలకే 20లీటర్ల మినరల్‌వాటర్, ఐదు రూపాయలకే భోజనం, నిరుద్యోగులు, వృద్ధులకు వెయ్యిరూపాయల భృతి వంటివి కల్పిస్తామన్నారు. ఎన్టీఆర్ హెల్త్‌కార్డును ప్రవేశపెట్టి పేద మధ్యతరగతి ప్రజలకు రేషన్‌కార్డులు అవసరం లేకుండా ఉచిత వైద్యం అందజేస్తామని చెప్పారు.

ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్య క్షుడు బీద రవిచంద్ర, నగర పార్టీ అభ్యర్థి ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, టి.రమేష్ రెడ్డి, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కిలారి వెంకటస్వామినాయుడు, శింగంశెట్టి రవి చంద్ర, తిరుమలనాయుడులు పాల్గొన్నారు.

# 'చింతా'కు చితచిత



ఎన్నోమార్లు ఎంపీగా పనిచేసిన అనుభవముండి కూడా తిరుపతి ఎంపీ చింతా మోహన్ ఎన్నికల కోడ్ ఉల్లంఘించ డంపై ఎన్నికల సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది. తిరుపతి లోక్‌సభ నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న చింతా మోహన్ ఈ నెల 14వతేదీ రాత్రి గూడూరు బైపాస్ పక్కనున్న ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులతో సమావేశమయ్యారు. ఈయన సమావేశం ఏర్పాటు చేసిన గది పక్కరూమ్‌లోనే స్థానికసంస్థల బ్యాలెట్ బాక్సులు భద్రపరచిన స్ట్రాంగ్‌రూం వుంది. చింతా ఎన్నికల కోడ్ ఉల్లంగించడంతో ఆయనకు, ఆది శంకర కాలేజీ యాజమాన్యానికి ఎన్నికల సంఘం నోటీసులు జారీచేసింది.







## చంద్రబాబు తీరింతేనా?

విశ్వసనీయతకు మారుపేరు వై.యస్.రాజశేఖరరెడ్డి. కాంగ్రెస్ పార్టీలో తనను నమ్ముకుని ఉన్న వాళ్లకు ఆయనెప్పుడూ ద్రోహం చేయలేదు. ఓడిపోతారని తెలిసిన వాళ్లకు కూడా సీట్లిచ్చిన ఘనత వై.యస్.ది. కాని చంద్రబాబుది నయవంచన. పార్టీ ప్రతిపక్షంలో ఉన్న పదేళ్ళకాలం నుండి పోరాడుతున్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి లాంటి నాయకులకు టిక్కెట్టివ్వ లేదంటే ఇక చంద్రబాబును ఎవరు మాత్రం నమ్ముతారు.

జి.వాసు, కొత్తకోడూరు.

## ఆయనేం అన్యాయం చేయలేదే!

కాంగ్రెస్‌వాళ్లకు ఇంకేం ప్రచారాస్త్రం లేనట్లు నరేంద్ర మోడీ పెళ్ళి అంశాన్ని వివాదాస్పదం చేస్తున్నారు. ఆయన పెళ్లి వ్యక్తిగతం. మోడీ వల్ల మాకు అన్యాయం జరిగిందని ఏ ఒక్క మహిళ కోర్టుకెక్క లేదు. ఆయన చిన్నతనంలో పెళ్లి చేసుకున్న భార్య ఈరోజు ఆయన ప్రధానికావాలని పూజలు చేస్తుంది. కత్తికి లేని దురద కందకు ఎందుకన్నట్లు మోడీ పెళ్లి గురించి ఆయన చేసుకున్న భార్యకు లేని బాధ కాంగ్రెస్‌వాళ్లకెందుకో?

పసుపులేటి ప్రసాద్, కాకుపల్లి.

## ఎన్నికల షెడ్యూల్ కుదించాలి

సార్వత్రిక, స్థానిక ఎన్నికలను ఇక యూనియన్ ఎన్నికల స్థాయిలో నిర్వహించాలి. ఎన్నికల షెడ్యూల్ సుథీర్ఘకాలం ఉండకూడదు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడంతోటే నామినేషన్‌లు వేయడానికి, విత్‌డ్రాకు ఒకరోజు, అభ్యర్థుల ప్రకటనకు ఒకరోజు, ప్రచారానికి ఇంకో రోజు కేటాయించేసి వెంటనే ఎన్నికలు పెట్టేయాలి. దీనివల్ల ఎన్నికల్లో ధన, మద్యం ప్రభావాన్ని తగ్గించడానికి వీలవుతుంది.

సూది కృష్ణారావు, నెల్లూరు.

## ఇక పండుగే...

ఐపిఎల్ సీజన్ మొదలైంది. ఇంకేముంది బెట్టింగ్ బాబులకు పండుగే. క్షణాల్లో లక్షాధికారులు భిక్షాధికారులు, భిక్షాధికారులు లక్షాధికారులైపోతారు. వీటిని అరికట్టాల్సి వుంది.

జి.రమేష్, నెల్లూరు.

## 'ప్రభా'తం

ఎన్నికల్లో ఏ పార్టీకైనా ప్రచారం ముఖ్యమే. అయితే ఆ ప్రచారానికి కొన్ని పరిమితులుంటాయి. ఎన్నికల ప్రచారంలో విమర్శలు, ప్రతివిమర్శలు సహజమే అయినా వాటికీ ఓ హద్దుంటుంది. విమర్శ అనేది ప్రజలను ఆలోచింపజేసేదిగా ఉండాలి. ఆరోపణ చేసారంటే ప్రజలు దానిని నమ్మేటట్లు ఉండాలి. విమర్శలు దేశ ప్రయోజనాలకు, ప్రజాసమస్యలకు సంబంధించినవిగానే ఉండాలి. ఆరోపణలు చేస్తే తప్పు చేసినవాడు తలదించుకునేలా ఉండాలి.

కాని ఇప్పుడు జరుగుతున్న ఎన్నికల్లో ఆయా పార్టీల నాయకులు చేసుకుంటున్న విమర్శలు, ఆరోపణలు చూస్తుంటే వాటిలో సంస్కారం పాళ్ళు ఒక్కశాతమైనా కనిపించడం లేదు. బడా నాయకులే సంస్కార హీనులుగా తయారవుతున్నారు. తమ స్థాయిని మరుస్తున్నారు. జుగుప్సాకరమైన విమర్శలకు దిగుతున్నారు. ప్రచార విమర్శల్లోకి పెళ్లాలను, పిల్లలను, ఉంపుడుగత్తెలను, అక్రమ సంబంధాలను లాగుతున్నారు.

బీజేపీ ప్రధాని అభ్యర్థి నరేంద్ర మోడీ వివాహ విషయమే కాంగ్రెస్‌వాళ్లకు పెద్ద ప్రచారాస్త్రమైపోయింది. మోడీలో పెళ్లి తప్ప ఇంకే లోపాలు వీరికి కనిపిస్తున్నట్లులేదు. నరేంద్ర మోడీ వైవాహిక జీవితం ఆయన వ్యక్తిగత విషయం. బాల్యంలోనే ఆయన పెళ్లి జరిగిపోయింది. పెళ్లయిన కొద్దిరోజులకే ఆయన భార్యను, ఇంటిని విడిచిపెట్టేసి వెళ్ళి ఆర్ఎస్ఎస్‌కు తన జీవితాన్నే అంకితం చేసాడు. నరేంద్ర మోడీ తనను పెళ్లి చేసుకుని వదిలేసాడని ఆయన భార్య ఏనాడు పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టలేదు. విడాకుల కోసం ఆమె కోర్టుకూ ఎక్కలేదు. భర్త నన్ను వేధిస్తున్నాడని పత్రికలకూ ఎక్కలేదు. ఒకర్ని పెళ్లి చేసుకుని నలుగురితో కాపురాలు చేసే నాయకులు ఈ దేశంలో చాలామందే ఉన్నారు. వారికంటే మోడీ మంచోడే! పెళ్లయ్యి భార్యకు దూరంగా వున్నంత మాత్రాన ఆయన మహిళలను గౌరవించడంటే అంతకుమించిన మూర్ఖత్వపు వాదన మరొకటి వుండదు.

ఎన్నికల దరఖాస్తులో భార్య వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలని ఎన్నికల కమీషన్ ఆదేశించబట్టే ఈసారి ఎన్నికల నామినేషన్ పత్రంలో మోడీ తన భార్య పేరు వ్రాసారు. కాబట్టే కాంగ్రెస్‌వాళ్లు దీనిని పట్టుకుని పీకుతున్నారు. అంతకు ముందంతా ఆయన నామినేషన్ పత్రాలలో భార్య వివరాల వద్ద ఖాళీ వదిలేసేవారు. నరేంద్ర మోడీ పెళ్లి విషయాన్ని రాహుల్‌గాంధీ ఓ బ్రహ్మాస్త్రమనుకుంటున్నాడు. మోడీ పెళ్లినే ఓ తప్పుగా ప్రచారం చేస్తున్నారు. రాహుల్‌గాంధీ ఎంతోమంది విదేశీప్రియురాళ్లను వెంటేసుకుని తిరిగింది పలు పత్రికలలో రావడం ప్రజలే చూసారు. పెళ్లి చేసుకున్నంత మాత్రాన మోడీ పాపాత్ముడు కాదు. పెళ్లి చేసుకోనంతమాత్రాన రాహుల్ పునీతుడు కాదు. మోడీ వ్యక్తిగత విషయంలోకి కాంగ్రెస్ జొరబడాలని చూస్తే బీజేపీ వాళ్లు దానికి ధీటుగానే స్పందించారు. మోడీ పెళ్లి గురించి మీరు మాట్లాడితే మీ తాతల(నెహ్రూ) హయాం నుండి జరుగుతున్న మీ పార్టీ వాళ్ల అక్రమ సంబంధాల వ్యవహారం గురించి మేం మాట్లాడాల్సి వస్తుందని అరుణ్‌జైట్లీ ఘాటుగానే మాట్లాడారు. ఇలా చేసుకుంటే ఒకరి శీలాన్ని ఒకరు శంకించుకుని ఒకరి పరువు ఒకరు బజారున పడేసుకోవడానికి మార్గం సుగమం అవుతుంది.

ఎన్నికలలో నేతలు ఎంతగా అడ్డదార్లు తొక్కుతారనే దానికి సమాజ్‌వాదీపార్టీ అధినేత ములాయంసింగ్‌యాదవ్ తప్పుడు కూతలు ఓ ఉదాహరణ. రేప్‌కేసుల్లో శిక్షలుపడ్డ యువకులకు మద్దతుగా ఆయన మాట్లాడిన మాటలు ప్రస్తుతం దేశవ్యాప్తంగా పెనుసంచలనం సృష్టిస్తున్నాయి. ముంబైలోని శక్తిమిల్స్ ప్రాంగణంలో ఓ ఫోటో జర్నలిస్టుపై జరిగిన సామూహిక అత్యాచారం నిందితులకు న్యాయస్థానం ఉరిశిక్ష విధించింది. అంతకుముందు ఢిల్లీ నిర్భయ కేసులో నిందితులకు సైతం న్యాయస్థానం ఉరిశిక్ష వేసింది. మహిళలపై అఘాయిత్యాలు పేట్రేగిపోతున్న తరుణంలో మృగాళ్లకు కఠినమైన శిక్షలు విధించాల్సిందేనని మహిళా లోకం కోరుతోంది. అయితే ఈ శిక్షలపై బాధ్యతాయుతమైన ప్రజాప్రతినిధిగా వున్న ములాయం సింగ్‌యాదవ్ వివాదాస్పదవ్యాఖ్యలు చేసారు. కుర్రాళ్లన్నాక తప్పులు చేస్తుంటారని, ఈ మాత్రం దానికే ఉరిశిక్ష వేస్తారా? అంటూ ప్రశ్నించారు. అత్యాచారాలు చేయడం మృగాళ్లకు పుట్టుకతో వచ్చే హక్కు అన్నట్లుగా ఆయన మాట్లాడారు. దేశంలో అన్ని రాజకీయపార్టీలు ఆమోదించిన మహిళా రిజర్వేషన్ బిల్లుకు మోకాలడ్డిన ములాయంసింగ్‌కు మహిళల పట్ల ఇంతకుమించిన గౌరవం ఉంటుందని మనం భావించనక్కరలేదు కూడా!

ఇక ప్రచారంలో వ్యక్తిగత దూషణలు తీవ్రస్థాయికి చేరాయి. ఒక కాంగ్రెస్ నాయకుడైతే నరేంద్ర మోడీని ముక్కలు ముక్కలుగా నరుకుతానన్నాడు. ముజఫర్‌నగర్ అల్లర్లలో జాట్‌లను చంపినవారిపై ప్రతీకారం తీర్చుకోమని బీజేపీ నాయకుడు అమిత్‌షా రెచ్చగొట్టారు. ఇక సినీతారలు హేమమాలిని, నగ్మా వంటివారి ప్రచారంలో అయితే కొందరు వికృతచేష్టలకే పాల్పడుతున్నారు.

ఇలా ప్రచారం హుందాతనాన్ని ప్రతిబించడం కాదు, వ్యవస్థలను వదిలి వ్యక్తిగత విషయాల్లోకి జొరబడుతూ భారత రాజకీయాలనే కలుషితం చేస్తుంది.

### దారి తప్పిన ప్రచారం



ఎన్నికలలో నేతలు ఎంతగా అడ్డదార్లు తొక్కుతారనే దానికి సమాజ్‌వాదీపార్టీ అధినేత ములాయంసింగ్‌యాదవ్ తప్పడు కూతలు ఓ ఉదాహరణ. రేప్‌కేసుల్లో శిక్షలుపడ్డ యువకులకు మద్దతుగా ఆయన మాట్లాడిన మాటలు ప్రస్తుతం దేశవ్యాప్తంగా పెనుసంచలనం సృష్టిస్తున్నాయి.

## 'అంతర్'జాతీయం

- కొబ్బరి పొట్టును ఉపయోగించి కొబ్బరి విత్తనాల నుండి బలమైన మొక్కలు మొలకెత్తేలా చేసే విధానాన్ని అమెరికాలోని వర్జీనియాటిక్ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు కనుగొన్నారు. కేరళలోని రైతుల కోసం శాస్త్రవేత్తలు ఈ విధానాన్ని అభివృద్ధి చేసారు. ఈ శాస్త్రవేత్తల బృందానికి భారత సంతతి శాస్త్రవేత్త మునియప్పన్ నాయకత్వం వహించారు.
- దేశంలో ప్రతిఒక్కరు కూడా తమ ఓటుహక్కును తప్పనిసరిగా ఉపయోగించుకోవాలని బాలీవుడ్ హీరో షారూఖ్‌ఖాన్ పిలుపునిచ్చారు. ఆనంద దాయకమైన దేశంలో ఉండాలని కోరుకునే ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ఓటు వేయాలన్నారు.
- కర్బన ఉద్గారాలను తగ్గించడం కోసం ఐక్యరాజ్యసమితి సిఫార్సులతో రూపొందించిన నివేదికను వివిధ ప్రభుత్వాలు ఆమోదించాయి. నాలుగేళ్లుగా 200మంది శాస్త్రవేత్తలు కలిసి ఈ నివేదికను తయారు చేసారు. భూతాపాన్ని 2డిగ్రీల సెల్సియస్‌కు పరిమితం చేయాలన్నది ఈ నివేదిక లక్ష్యం.
- ఈ నెల 12వ తేదీన ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు రెచ్చిపోయారు. బీజాపూర్‌కు సమీపంలో ఏర్మనార్ గ్రామం వద్ద మావోయిస్టులు పేల్చిన మందుపాతరలో 14మంది దుర్మరణం చెందారు. వీరిలో ఐదుగురు జవాన్‌లు, ఏడుగురు ఎన్నికలసిబ్బంది, ఇద్దరు 108 సిబ్బంది ఉన్నారు.
- సత్యశోధన్ కమ్యూనిస్టు పార్టీ వ్యవస్థాపకుడు వామపక్ష సిద్ధాంత మహానేత శరత్‌పాటిల్ ఈ నెల 12న ముంబైలో కన్నుమూసారు. 1925 సెప్టెంబర్ 17న ధులెలో ఆయన జన్మించారు. భారతీయ చరిత్రపై విస్తృత పరిశోధనలు చేసారాయన.
- ఎన్నికల తర్వాత పార్టీ తనకు ఏ బాధ్యత అప్పగించినా స్వీకరిస్తానని బీజేపీ అగ్రనేత అద్వానీ పేర్కొన్నారు. మోడీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమన్నారు.
- సామాజిక మీడియా ఫేస్‌బుక్‌లోని సమాచారానికి కత్తెరవేయాలని విజ్ఞప్తులు చేస్తున్న దేశాలలో ప్రపంచంలోనే భారత్ మొదటి స్థానంలో వుంది. భారత్ తర్వాత స్థానంలో టర్కీ, పాకిస్థాన్, ఇజ్రాయిల్, జర్మనీ, ఫ్రాన్స్ దేశాలున్నాయి.
- బొగ్గు కుంభకోణానికి మంత్రులు శిబుసోరెన్, దాసరి నారాయణరావులు కారణమని బొగ్గు శాఖ మాజీ కార్యదర్శి పరేఖ్ స్పష్టం చేసారు. సోమవారం ఢిల్లీలో తాను వ్రాసిన 'క్రూసేడర్ ఆర్ కాన్స్‌పిరేటర్? – కోల్‌గేట్ అండ్ అదర్ ట్రూత్స్' పుస్తకం విడుదల కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వాస్తవానికి బొగ్గు క్షేత్రాల బహిరంగ వేలం మేలంటూ తాను చేసిన ప్రతిపాదనలకు ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ నుండి సంపూర్ణ మద్దతు లభించిందని, అయితే బొగ్గు మంత్రులు దాసరి, శిబుసోరెన్‌లు వాటిని వ్యతిరేకించారని పేర్కొన్నారు.

## వార్త వ్యాఖ్య

వార్త :- మా పొత్తు సునామీ సృష్టిస్తుంది. – చంద్రబాబు.
**వ్యాఖ్య :- ఆల్‌రెడీ మీ పార్టీలో అసంతృప్తి సునామీ పుట్టిందిగా!**

వార్త :- జయ జైలుకెళ్లేరోజులు దగ్గరపడ్డాయి. – కరుణానిధి.
**వ్యాఖ్య :- అనవసరంగా ఆమెకు జైలు గుర్తుచేయకండి... మీకే ఇబ్బంది.**

వార్త :- సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యం. – మాజీమంత్రి డొక్కా.
**వ్యాఖ్య :- అవును... ఈసారి ఎవరూ అడగలేదు కాబట్టి టిక్కెట్లలో సామాజిక న్యాయం చేసారు.**

వార్త :- మోడీని ప్రపంచం విశ్వసించదు. – కాంగ్రెస్.
**వ్యాఖ్య :- భారత్ విశ్వసిస్తే చాలుగా...**

వార్త :- పదవులు ఆశించి టీడీపీలోకి రాలేదు. – గంటా శ్రీనివాసరావు.
**వ్యాఖ్య :- టిక్కెట్ మాత్రమే ఆశించారు.**

వార్త :- వైకాపా ఎన్నికల ప్రణాళిక ఓ చెత్త కాగితం. – తులసిరెడ్డి.
**వ్యాఖ్య :- అన్ని పార్టీల మేనిఫెస్టోలు అదే బాపతులే!**

వార్త :- ముస్లింలను జంతువుల కంటే హీనంగా చూస్తున్నారు. – మాయావతి.
**వ్యాఖ్య :- వాళ్లకు లేని ఆలోచనలను కూడా మీరు తెప్పిస్తున్నారు.**

వార్త :- సీమాంధ్రను స్వర్ణాంధ్ర చేస్తాం. – బీజేపీ నేత వెంకయ్యానాయుడు.
**వ్యాఖ్య :- విడగొట్టింది అందుకేనా?**

వార్త :- మన్మోహన్ అత్యంత బలహీన ప్రధాని. – అద్వానీ.
**వ్యాఖ్య :- ఏదన్నా ఐరన్ టానిక్ వాడుండాల్సింది.**

వార్త :- కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి – చిరంజీవి.
**వ్యాఖ్య :- ఇప్పటివరకు ఎంత అభివృద్ధి వెలగబెట్టారో చూస్తూనే ఉన్నాంగా!**

వార్త :- జగన్‌ది నియంతృత్వ ధోరణి. – 'దేశం' నేతల ధ్వజం.
**వ్యాఖ్య :- చంద్రబాబుదేదో ప్రజాస్వామ్యబద్ధ వైఖరి అయినట్లు!**

వార్త :- సంక్షోభంలోనూ కాంగ్రెస్ వెంటే రాష్ట్ర ప్రజలు. – వాయిలార్ రవి.
**వ్యాఖ్య :- వాళ్లు వెంటపడింది ఓట్లేయడానికి కాదు, తన్ని తరిమేయడానికి!**

వార్త :- కాంగ్రెస్ ఆయువు తీరింది. – బృందా కారత్.
**వ్యాఖ్య :- వెంటిలేటర్ తీసేయొచ్చంటారు.**

వార్త :- భారత్‌లో అవినీతి విస్తరించింది. – అమెరికా సంస్థ వెల్లడి.
**వ్యాఖ్య :- విస్తరించలేదు... ఆక్రమించేసింది.**


ఇందుకూరుపేట మండలం, కొత్తూరులో...



# షిరిడిసాయి వైభవం యోగాంజనేయ వైభోగం

**భగవంతుడు ఎప్పుడు ఎవరికి ఏ సంకల్పాన్ని కలిగిస్తాడో వూహించడం అసాధ్యం. ఎవరి మదిలో ఎలాంటి ఆలోచన రేకెత్తిస్తాడో తెలుసుకోవడం అసంభవం. బెంగుళూరు నివాసి నెల్లూరు జిల్లావాసి ప్రముఖ పారిశ్రామికవేత్త కలికి కోదండ రామిరెడ్డి మదిలో కలిగిన ఇలాంటి ఆలోచనల ప్రతిరూపాలే శ్రీ షిరిడి సాయిబాబా మరియు శ్రీ యోగాంజనేయ ఆలయాల నిర్మాణాలు.**

నెల్లూరు జిల్లా ఇందుకూరుపేట మండలం, కొత్తూరు గ్రామం ఆయన శ్రీమతికి పుట్టినిల్లు. ఈ గ్రామం ప్రస్తుతం ఆధ్యాత్మిక యాత్రాస్థలంగా అవతరించిందంటే ఆశ్చర్యపోవలసిందే. 8సంవత్సరాలక్రితం శ్రీ షిరిడిసాయి మందిరాన్ని ఈ గ్రామంలో నిర్మించాలనే ఆశయం మదిలో మెదలగానే కొంత మంది ఆప్తులు ఆత్మీయుల సహకారంతో జిల్లాకే తలమానికంగా శ్రీ షిరిడి సాయి మందిరాన్ని అర ఎకరం విస్తీర్ణంలో సుందర మందిరంగా తీర్చిదిద్దారు కలికి కోదండరామిరెడ్డి శ్రీలత దంపతులు. ఈ ఆలయంలో శ్రీ షిరిడిసాయిని షిరిడిలోని బాబా మూర్తిని రూపుదిద్దిన శిల్పి వంశస్థులచే ప్రత్యేకంగా తయారుచేయించి 51/2 అడుగుల ఎత్తులో ఏక శిలా విగ్రహంగా ప్రతిష్ఠించారు. విశాలమైన ప్రాంగణంలో నిర్మించబడిన ఈ మందిరంలో అన్నీ ప్రత్యేకతలే.



## అరుదైన నిర్మాణం, ఆధ్యాత్మిక ప్రాంగణం శ్రీ యోగాంజనేయ ఆలయం..!

కొత్తూరులోనే శ్రీ షిరిడి సాయి మందిరానికి సరిగ్గా ఎదురుగా దక్షిణ ముఖంతో అత్యంత ప్రతిష్టాత్మకంగా, ప్రయోగాత్మకంగా, ప్రమోదాత్మకంగా నిర్మించిన అరుదైన ఆలయం శ్రీ యోగాంజనేయ ఆలయం. మకరానా మార్బుల్‌తో భారతదేశంలో ప్రఖ్యాతగాంచిన శిల్పులచే అందంగా మలచబడిన అరుదైన విగ్రహం ఈ యోగాంజనేయ ప్రతిరూపం. దాదాపు 60టన్నుల బరువైన ఒక రాయిని 40టన్నులకు కుదించి ఆ నలభై టన్నుల ఏకశిల నుండి 23టన్నులు వచ్చేలా 12 అడుగుల ఎత్తులో 8అడుగుల వెడల్పుతో 6అడుగుల లోతులో ఆంజనేయస్వామి యోగమూర్తిని రూపొందించారు. బహుశా భారతదేశంలోనే ఇంతటి అరుదైన విగ్రహం మరెక్కడా వుండకపోవచ్చు. విగ్రహ ప్రతిష్ఠ చేసిన మందిరాన్ని సైతం అంగుళం అంగుళం శ్రద్ధ కనపరచి ఢిల్లీలోని అక్షరధామ్‌ని తలపించే స్థాయిలో శిల్పకళ వైభవంతో అందంగా తీర్చిదిద్దారు.

ధ్యాన ముద్రలో ఉన్న "యోగాంజనేయస్వామి" మూర్తిని దూరం నుండి చూస్తే కళ్ళు మూసుకుని ధ్యానం చేస్తున్నట్లుగాను మనం దగ్గరకు వెళ్ళే కొద్దీ కొంచెం కొంచెంగా కళ్ళు తెరచి స్వామి మనలను చూస్తున్నట్లుగాను శిల్పి తన మేధస్సునూ ప్రతిభా చాతుర్యాన్ని ఉపయోగించి రూపొందించారు. ఆలయ ముఖద్వారంలో నల్ల గ్రానైట్‌తో తయారుచేసిన ఐరావతంలు ద్వారం రెండు వైపులా ఏక శిలా రూపంలో మనకి కనిపిస్తాయి.

సుమారు అర ఎకరంలో నిర్మించిన విశాల ప్రాంగణంలో ఓ వైపు కోనేరు మరోవైపు కల్యాణ మండపం ఇంకొక పక్కన అన్నదాన మండపాలను ఏర్పాటుచేస్తున్నారు. ముఖ్య ఆలయ ప్రాంగణమంతా దేశంలోని వివిధ ప్రాంతాలలో వివిధ రాష్ట్రాలలో ప్రాచుర్యం పొందిన పుణ్యక్షేత్రాల దేవతామూర్తుల విగ్రహాలను దాదాపు 58ని ఇక్కడ శిల్పులచేత చెక్కించి ఏర్పాటు చేశారు.

## కొలువైన మూర్తులు...

తిరుమల వెంకటేశ్వరస్వామి వారితో మొదలుపెట్టి మధుర మీనాక్షి, మధురై, శ్రీ కాళహస్తీశ్వరుడు (శ్రీకాళహస్తి), శ్రీ జ్ఞానప్రసూనాంబ(శ్రీకాళహస్తి), శ్రీ భక్తకన్నప్ప(శ్రీ కాళహస్తి), శ్రీ బాలకుమారస్వామి, శ్రీ కంచి కామాక్షి (కాంచీపురం), శ్రీకాశీ విశాలక్ష్మి, కాశీ, శ్రీ పర్వతవర్షిణి(రామేశ్వరం), శ్రీ రామనాథస్వామి (రామేశ్వరం), శ్రీ పెదనాయకిదేవి(తంజావూరు), శ్రీ ప్రగతీశ్వర్(తంజావూరు), శ్రీ కమలాంబిక(తిరువారూర్), శ్రీ వస్మితనాథర్‌స్వామి(తిరువారూర్), శ్రీ అఖిలాండేశ్వరి(తిరునలైకోవర్), శ్రీ జసకంతేశ్వర(తిరునలై కోవర్), శ్రీ నటరాజ (చిదంబరం), శ్రీ శివకామిదేవి(చిదంబరం), శ్రీ అరుణాచలేశ్వరస్వామి(తిరువన్నామలై), శ్రీ ఉన్నామలైదేవి (తిరువన్నామలై), శ్రీ మల్లికార్జునస్వామి(శ్రీ శైలం), శ్రీ భ్రమరాంబ(శ్రీ శైలం), శ్రీ గురువాయురప్పన్ (గురువాయుర్), శ్రీ మహంకాళి (కలకత్తా), శ్రీ పాండురంగడు(పండరీపురం), శ్రీ రుక్మిణీదేవి(పండరీపురం), శ్రీ కృష్ణ(ద్వారకా), శ్రీ అయ్యప్పస్వామి(శబరిమలై), శ్రీ వీరదక్షిణామూర్తి, శ్రీ రామచంద్ర(అయోధ్య), శ్రీ ధన్వంతరిమహావిష్ణు, శ్రీ కుబేరస్వామి, శ్రీ తరిగొండ వెంగమాంబ(వరిగొండ), శ్రీ గురురాఘవేంద్ర (మంత్రాలయ), శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి(పెనుగొండ), శ్రీ భద్రాచల రామచంద్రస్వామి, శ్రీ లక్ష్మణస్వామి (భద్రాచలం), శ్రీ కనకదుర్గాదేవి(విజయవాడ), శ్రీ ఆదిశంకరాచార్యులు(శృంగేరి), శ్రీ సరస్వతీదేవి(బాసర), శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి(బ్రహ్మంగారి మఠం), శ్రీ రాజరాజేశ్వరి దేవి, శ్రీ గౌతమబుద్ధుడు(అమృతసర్), శ్రీ శ్రీమన్నానారాయణ, శ్రీ పెనుశిల నరసింహస్వామి(పెంచలకోన), శ్రీ ఆదిలక్ష్మీదేవి(పెంచలకోన, శ్రీ సంకర్షణమూర్తి, శ్రీ గోదాదేవి (శ్రీ రంగం), శ్రీ శాస్త్రమూర్తి, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి (పళని), శ్రీ కైలాసమూర్తి, శ్రీ వాసుదేవమూర్తి, శ్రీ చండీకేశ్వరమూర్తి, శ్రీ బాలకృష్ణుడు, శ్రీ శ్రీపాదవల్లభుడు, శ్రీ నరసింహస్వామి (యాదగిరిగుట్ట), శ్రీ లక్ష్మీదేవి (యాదగిరిగుట్ట), శ్రీ అలివేలు మంగమ్మ (తిరుచానూరు) వరకు ఇక్కడ అమర్చారంటే ఈ ఆలయ ప్రాంగణ నిర్మాణానికి కోదండ రామిరెడ్డి – శ్రీలత దంపతులు తీసుకున్న శ్రద్ధ ఏ పాటిదో మనకు అర్ధమౌతుంది.

కేవలం ఒక ఆధ్యాత్మిక ప్రాంగణంలా కాకుండా అపూరూప శిల్పకళా వైభవాన్ని ప్రతిబింబింపజేసే అద్భుత కళారూపాలను ఈ ప్రాంగణంలో నెలకొల్పారు. శ్రీ యోగాంజనేయ స్వామి శిలా విగ్రహాన్ని ప్రతిష్టించిన మండపంలో రామాలయంలోని 21ఘట్టాలను తెలిపే చిత్రకళా రూపంతో హాల్ చుట్టూ ఏర్పాటుచేస్తున్నారు.

ఉత్తర ముఖంలో శ్రీ సాయిబాబా సరిగ్గా ఆయనకు ఎదురుగా ఒకరినొకరు చూస్తున్నట్లుగా దక్షిణ ముఖంతో శ్రీయోగాంజనేయ ఆలయాలు గ్రామ నడిబొడ్డులో చూసేవారికి కనులవిందు చేస్తూ దర్శనమిస్తాయి. ఇలాంటి నిర్మాణాలు బహుశా అరుదుగానే మనకి కనిపిస్తాయి. శ్రీ షిరిడి సాయిబాబా మందిరం ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మింపబడిన ఈ ఆలయ ప్రాంగణాలకి పలువురు దాతలు సహాయసహకారాలు అందించారు. ఒక్క శ్రీ యోగాంజనేయ ఆలయానికే దాదాపు కొన్ని కోట్ల రూపాయలను ఈ ట్రస్టు ద్వారా ఖర్చుచేశారు. శ్రీ షిరిడీ సాయి మందిరం 2008 సంవత్సరంలో ప్రారంభంకాగా శ్రీ యోగాంజనేయ స్వామివారి ఆలయం గత యేడాది నుండి భక్తుల సందర్శనార్థం తెరవబడింది.

## వార్షిక బ్రహ్మోత్సవాలు...


శ్రీ షిరిడి సాయిబాబా మరియు శ్రీ యోగాంజనేయ స్వామివార్ల వార్షిక బ్రహ్మోత్సవాల పేరిట ఈ యేడాది ఏప్రియల్ 21వతేదీ నుండి వార్షిక బ్రహ్మోత్సవాలను ప్రారంభిస్తున్నారు. ఇక ప్రతియేటా తిథుల ప్రకారం ఈ బ్రహ్మోత్సవాలు జరుగుతాయని ఇప్పుడు జరిగేది తొలి వార్షిక బ్రహ్మోత్సవాలని నిర్వాహకులు చెప్తున్నారు. 5రోజుల పాటు ఈ బ్రహ్మోత్సవాలను భారీస్థాయిలో నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

ఓ వైపు బాబా మరో వైపు ఆంజనేయులు ఇలా ఒకొరికొకరు ఎదురెదురుగా వుండడం, అలాంటి అతి అరుదైన ప్రాంగణాలు నెల్లూరు జిల్లా కొత్తూరులో నిర్మించబడటం అభినందనీయం. మామూలుగా ఆంజనేయుడు రాముడికి గుడి కట్టించాలి కాని ఇక్కడ ఈ కోదండరాముడు ఆ ఆంజనేయుడికి మహా మండపాన్ని నిర్మింపజేశాడు.

ఒక ఆధ్యాత్మిక ప్రాంగణంగా, యాత్రాప్రదేశంగా వైభవోపేతమైన శ్రీ సాయిబాబాని, వైభోగవంతమైన శ్రీ యోగాంజనేయ స్వామిని నెల్లూరీయులకు, ఆధ్యాత్మిక ప్రియులకు అందించిన కలికి కోదండ రామిరెడ్డి– శ్రీలత దంపతులకు "లాయర్" అభినందనలు.

## నవరంగుల నవగ్రహాలు





సాయి మందిరంలో మరోప్రత్యేక అంశం 'నవగ్రహాలు'. ఈ నవగ్రహాలను వాటి యొక్క విశిష్టతను, ప్రాముఖ్యతను వివరించేలా 9రంగులలో వివిధ ప్రాంతాల నుండి సేకరించిన రంగురాళ్ళపై చెక్కించారు. ఇలా 9రంగులు కలిగిన నవగ్రహాలు మన రాష్ట్రంలోనే మరెక్కడా వుండకపోవచ్చు. ఈ బాబా మందిరానికి అనుసంధానం చేస్తూ ధ్యాన మందిరం అన్నదాన భోజనశాలలను కూడా నిర్మింపచేశారు కోదండరామిరెడ్డి దంపతులు.







## విజిలెన్స్ దాడుల్లో
# పట్టుబడ్డ పప్పుదినుసులు



నెల్లూరుజిల్లాలోని పలు ప్రాంతాల్లో పప్పుల నిల్వలపై విజిలెన్స్ అధికారులు ఈ నెల 16న ఒకే సమయంలో దాడులు నిర్వహించారు. విజిలెన్స్ ఎస్పీ శివధర్ రాజు ఆదేశాల మేరకు 7బృందాలుగా ఏర్పడిన అధికారులు మధ్యాహ్నం 12గంటలకు దాడులు చేసారు.

నెల్లూరులో విజిలెన్స్ డీఎస్పీ రమేష్ బాబు ఆధ్వర్యంలో పప్పులవీధిలో వివిధ షాపులపై, స్టోన్‌హౌస్‌పేటలోని ఓబయ్య అండ్ సన్స్ గోదాములపై, లక్ష్మీ బాలాజీ దాల్‌మిల్‌పై, మారుతీ దాల్‌మిల్‌పై దాడులు చేసారు. లైసెన్సులు వున్న షాపుల్లో సరుకుల వివరాలను ఆరాతీసి లైసెన్సులు లేకుండా వ్యాపారం చేస్తున్న వారిపై కేసులు నమోదు చేసారు. లైసెన్సు లేని గోదాముల్లో పప్పుధాన్యాలు నిల్వచేసిన వ్యాపారులు పరారవగా కొందరు గోదాములకు తాళాలు వేసారు. రెండు గోదాములపై విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి యజమానులు లేకున్నా తాళాలు పగులగొట్టి సరుకును బయటకు తీసారు. కోవూరు మండలం పోతిరెడ్డిపాళెంలో శ్రీ వెంకటసాయి ట్రేడర్స్ దాల్‌మిల్‌పై దాడి చేసిన అధికారులు 318క్వింటాళ్ళ శనగలు ఎలాంటి ఆధారాలు లేకుండా నిల్వచేసినట్లు గుర్తించారు. వింజమూరు, కలిగిరి, వెంకటగిరి తదితర ప్రాంతాల్లో కూడా దాల్‌మిల్లులపై అదే సమయంలో అధికారులు దాడులు చేసి కేసులు నమోదు చేసారు.

బృందాల్లో డీసీటీఓ రవికుమార్, సీఐలు కె.శ్రీనివాసరావు, సంగమేశ్వరరావు, విజిలెన్స్ అధికారులు లక్ష్మీబాలాజీ, వెంకట్రామనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## సుప్రీం తీర్పుపై
# హిజ్రాల హర్షం

సుప్రీంకోర్టు ఈ నెల 15న హిజ్రాలకు హక్కులు కల్పించాలని తీర్పివ్వడం పట్ల నెల్లూరులో హిజ్రాలు సంతోషాన్ని ప్రకటించారు. ఈ నెల 16న నెల్లూరు గాంధీ బొమ్మ కూడలి నుండి విఆర్సీ కూడలి వరకు ర్యాలీ నిర్వహించి రంగులు, పువ్వులు చల్లుకుంటూ నృత్యాలు చేస్తూ ఆనందాన్ని వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా హిజ్రాల సంఘం జిల్లా అధ్యక్షురాలు అలేఖ్య మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన దినమైన ఏప్రిల్ 15ను హిజ్రాస్‌డేగా క్యాలెండర్‌లో ప్రకటించామని, ప్రతి యేటా ఆరోజును హిజ్రాస్‌డేగా జరుపుకుంటామన్నారు. సమాజంలో అందరితో సమానంగా తమను చూడాలని దేశవ్యాప్తంగా చేసిన పోరాట ఫలితమే ఈ తీర్పని, నేపాల్, పాకిస్తాన్‌లలో హిజ్రాలకు అన్ని రంగాల్లో రిజర్వేషన్ వుందని తెలిపారు. కాబట్టి సుప్రీం తీర్పుననుసరించి రాష్ట్ర ప్రభుత్వం హిజ్రాలకు హక్కులు కల్పించడానికి కృషి చేయాలని కోరారు.

## కాలధర్మం
# చెరకుపల్లి పిచ్చిరెడ్డి



నెల్లూరు మాగుంట లే అవుట్‌లో 13 సంవత్సరాల క్రితం సిపిఆర్ కల్యాణ మండపం పేరుతో అప్పట్లోనే అత్యంత అధునాతన రీతిలో పెళ్ళి వేడుకల మండపాన్ని నిర్మించిన చెరకుపల్లి పిచ్చిరెడ్డి తన 85వ యేట ఏప్రియల్ 18వ తేదీ శుక్రవారం తెల్లవారుఝామున 5.30 గంటలకు కన్నుమూశారు. సిపిఆర్ పిచ్చిరెడ్డిగా ఆయన అందరికీ సుపరిచితుడే.

నెల్లూరులో కట్టెలదొడ్డితో పాటు బొగ్గుల వ్యాపారంతో తన ప్రస్థానాన్ని ప్రారంభించి అనంతరం శ్రీ మల్లిఖార్జున ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ఫైనాన్స్ వ్యాపారంలో అడుగుపెట్టాడు. అనంతరం నెల్లూరు ట్రంకురోడ్డులో శివప్రియ పేరుతో హోటల్ నిర్మాణం చేసి శివప్రియ పిచ్చిరెడ్డిగా కొంతకాలం పిలువబడ్డాడు. 2001లో అప్పుడప్పుడే ఎదుగుతున్న మాగుంట లే అవుట్‌లో పిచ్చిరెడ్డి నిర్మించిన సిపిఆర్ కల్యాణ మండపంలో ఇప్పటికి కొన్ని వందల కల్యాణాలు జరిగాయి.


నగరంలో పలు దేవాలయాలకు పిచ్చిరెడ్డి విరాళాలను అందజేయడంతో పాటు మూలాపేటలోని మూలస్థానేశ్వర దేవాలయం పడమటి ప్రహరీగోడ మొత్తాన్ని తన స్వంత ఖర్చుతో నిర్మింపజేశాడు. ఇటీవల గొలగమూడి రోడ్డులో నిర్మితమైన విశాలాక్షి వృద్ధాశ్రమానికి భారీవిరాళాన్ని అందజేశాడు. పలుసార్లు అన్నదానం, వస్త్రదానం కార్యక్రమాలను నిర్వహించాడు.

రాజకీయాలకు దూరంగా వుంటూ అన్నిపార్టీల వ్యక్తులతో సత్సంబంధాలను కొనసాగించేవాడు. ఆయనకు భార్య, నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు వున్నారు. సువర్ణకుమారి, కరుణకుమారి, అరుణకుమారి, మమతలు ఆయన కుమార్తెలు కాగా రత్ననారాయణరెడ్డి ఆయన కుమారుడు.

గత కొన్నినెలలుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ 18వ తేదీ శుక్రవారం కన్నుమూశారు. మాగుంట లే అవుట్ 2వ మెయిన్ రోడ్డు 2వ క్రాస్‌రోడ్డులోని ఆయన స్వగృహంలో నగరానికి చెందిన అనేకమంది రాజకీయ, వ్యాపార రంగాలతో పాటు సాహిత్య, సాంస్కృతిక రంగాలకు చెందిన ప్రముఖులు పిచ్చిరెడ్డి భౌతిక దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

మాగుంట లే అవుట్ రెసిడెంట్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులుగా కూడా పిచ్చిరెడ్డి ప్రస్తుతం వున్నారు. అసోసియేషన్ గౌరవసలహాదారు ముప్వా బలరామ నాయుడు, అధ్యక్షులు తుంగా శివప్రభాత్ రెడ్డి, కార్యదర్శి కనుమూరు శ్రీనివాసులురెడ్డి ఇతర కమిటీ సభ్యులు పిచ్చిరెడ్డి మృతిపట్ల తమ సంతాపాన్ని ప్రకటించారు. అసోసియేషన్ పక్షాన ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

నిరంతర కష్టజీవి పిచ్చిరెడ్డి. గత కొన్నినెలలుగా అనారోగ్యంతో ఇంటిపట్టునే వున్నా ఆయన మనసంతా కల్యాణమండపంపైనే వుండేది. ఆయన ప్రియశిష్యుడు "రియాజ్"ని అడిగి రోజూ కల్యాణ మండపం బాగోగులు కనుక్కునేవాడు. పిచ్చిరెడ్డి శిష్యులకు, అభిమానులకు, ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢసానుభూతి తెలుపుతోంది 'లాయర్'.



# నెల్లూరు కబుర్లు

## ముప్పువరప్పుకు తప్పిన ముప్పు



బీజేపీ జాతీయ నాయకులు యం.వెంకయ్యనాయుడుకి గాలి తిరుగుళ్లు(విమానప్రయాణం) కలిసొస్తున్నట్లు లేదు. ఇప్పటికే 8సార్లు విమాన ప్రమాదాల నుండి సురక్షితంగా బయటపడ్డ వెంకయ్యనాయుడు ఈ నెల 12న మరోసారి గాలి ప్రయాణం ప్రమాదం నుండి బయటపడ్డారు. ఈనెల12న ఆయన హైదరాబాద్ రావడానికి ఢిల్లీలో ఎయిర్ ఇండియా విమానమెక్కారు. విమానం గాల్లోకి లేచిన 25 నిముషాల తర్వాత విమానంలో నుండి పెద్దపెద్ద శబ్దాలు రాసాగాయి. దీంతో ప్రయాణీకులకు హిందూ మహా సముద్రంలో గల్లంతైన మలేషియా విమానం కళ్లముందు మెదిలింది. విమానంలో ఒక ఇంజన్ పని చేయడం లేదని గుర్తించిన పైలట్లు వెంటనే దానిని వెనక్కి మళ్లించి ఢిల్లీ ఎయిర్‌పోర్టులో సురక్షితంగా దించారు. వెంకయ్యనాయుడు మరో విమానంలో హైదరాబాద్‌కు చేరుకున్నారు. సంఘటనతో వెంకయ్యనాయుడు గాలిప్రయాణాల ప్రమాదాల నుండి బయటపడ్డ సంఘటనలు 9కి చేరాయి. ఇది ఒకరకంగా గిన్నీస్ రికార్డేమో! ఎందుకంటే ఈ దేశంలో అత్యంత ఎక్కువుగా విమాన ప్రయాణాలు చేసే నాయకులలో వెంకయ్య టాప్‌టెన్‌లో ఖచ్చితంగా ఉంటారు.

## నెల్లూరులో లోకేష్



నారా చంద్రబాబు ముద్దుల కొడుకు యువరత్న బాలకృష్ణ అల్లరి అల్లుడు నారా లోకేష్ మంగళవారం నెల్లూరులో రోడ్‌షో నిర్వహించారు. నెల్లూరులోని విఆర్‌సి సెంటర్ నుండి గాంధీబొమ్మ వరకు రోడ్‌షో నిర్వహించారు. నర్తకి సెంటర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగసభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. లోకేష్ రాక సందర్భంగా తెలుగుయువత, తెలుగు నాడు విద్యార్థి సంఘం కార్యకర్తలు వందలసంఖ్యలో బైక్‌లతో పాల్గొని నెల్లూరు వీధుల్లో మోత మోగించారు.

### రోడ్‌షోకు పోలీసుబ్రేక్...

మంగళవారం నెల్లూరులో నారా లోకేష్ రోడ్‌షోను పోలీసులు అడ్డుకున్నారు. రోడ్‌షో విఆర్‌సి నుండి మొదలై గాంధీబొమ్మ వద్దకు వచ్చాక పోలీసులు అడ్డుపడ్డారు. రోడ్‌షో అక్కడనుండి ఏ.సి సెంటర్ మీదుగా నర్తకి సెంటర్ వద్దకు రావాలి. కాని ఆ రూటులో పర్మిషన్ లేదని పోలీసులు అభ్యంతరంపెట్టారు. తెలుగు దేశం నాయకులు గొడవకు దిగినా పోలీసులు వినలేదు. దీంతో లోకేష్ వాహనం దిగి నడుచుకుంటూ నర్తకిసెంటర్‌కు చేరుకున్నారు.

## వైసిపి అభ్యర్థుల చేతికే బి-ఫారాలు



బి-ఫారంతో కాకాణి

జిల్లాలోని నెల్లూరు, తిరుపతి లోక్‌సభ స్థానాలకు, 10అసెంబ్లీ స్థానాలకు పోటీచేస్తున్న వైకాపా అభ్యర్థులకు ఆ పార్టీ జిల్లా కన్వీనర్ మేరిగ మురళీ స్వయంగా బి-ఫారాలు అందజేసారు. అభ్యర్థులు ఎన్నికల ప్రచారంలో ఉన్నందున వాళ్ళు ఎక్కడవుంటే అక్కడికే వెళ్ళి బి-ఫారాలు అందజేయాలని పార్టీ అధ్యక్షుడు వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ఆదేశించారు. దీంతో మేరిగ మురళీ ప్రతి అభ్యర్థిని వెదుక్కుంటూ వెళ్ళి బి-ఫారాలు అందజేసారు.

## మీడియాసెల్‌లో కలెక్టర్



సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్‌లోని ప్రణాళికాధికారి కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా మానిటరింగ్ కమిటీ విభాగాన్ని జిల్లా కలెక్టర్ శ్రీకాంత్ ఈ నెల 14న తనిఖీ చేసారు. పత్రికల్లో పోటీలో వున్న అభ్యర్థుల గురించి వస్తున్న వార్తలను పరిశీలించి పెయిడ్‌న్యూస్‌ను అభ్యర్థుల ఖర్చులో నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ట్రైనీ కలెక్టర్ ఇంతియాజ్ కూడా పాల్గొన్నారు.

## ముగిసిన పది పరీక్షలు

### ఆనందోత్సాహాలతో విద్యార్థులు

పదో తరగతి పబ్లిక్ పరీక్షలు 16వ తేదీతో ముగిసాయి. చివరి పరీక్ష సాంఘిక శాస్త్రం-2ను వ్రాసి పరీక్షహాళ్ల నుండి బయటకు రాగానే విద్యార్థులు రెక్కలు తొడిగిన పక్షుల్లా కేరింతలు కొట్టారు. పరీక్ష కేంద్రాల నుండి ఇళ్లకు బస్సుల్లో వెళుతూ అరుపులు, కేకలతో సందడి చేసారు. పుస్తకాలను చించి ఎగరేసారు. ఈ పరీక్షలలో జిల్లా అంతటా 9మంది విద్యార్థులు మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడగా అధికారులు డీబార్ చేసారు. జిల్లాలో మొత్తం 33,814మంది విద్యార్థులకు గాను 33,530మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలు వ్రాసారు.

## పోలీసు సిబ్బందిపై వేటు

ఎన్నికల విధుల్లో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన పోలీసులపై ఎస్పీ నవదీప్‌సింగ్ కొరడా ఝుళిపించారు. ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి మోజెస్‌ను అక్రమంగా నిర్భందించిన వాకాడు సిఐ చెంచురామారావును సస్పెండ్ చేశారు. వింజమూరు ఎస్‌ఐ కె.రామకృష్ణను విఆర్‌కు బదిలీ చేసారు. జలదంకి ఎస్‌ఐ కృష్ణబాబ్జీ బాబుకు ఛార్జ్‌మెమో ఇచ్చారు.

## కర్నాటకకు నెల్లూరు పోలీసు

కర్నాటకలో జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల కోసం సోమవారం నెల్లూరు నుండి 200మంది హోంగార్డులు బయలుదేరి వెళ్లారు. కర్నాటకలోని పావుగడ, సిరాప్రాంతాలలో వీరికి ఎన్నికల బందోబస్తు విధులు అప్పగించారు.

## జపాన్ అథ్లెటిక్స్‌కు నెల్లూరు పిఇటి

ఈ యేడు సెప్టెంబరులో జపాన్ దేశంలో జరగబోయే అథ్లెటిక్స్ పోటీలలో మనదేశం తరపున నెల్లూరుజిల్లా కొడవలూరు మండలంలోని కొత్త వంగల్లు జడ్పీ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ఈతకోట రామచంద్ర పాల్గొననున్నారని ఈనెల 12న అథ్లెటిక్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రసాద్ తెలిపారు. కోయంబత్తూరులో ఇటీవల జరిగిన జాతీయ అథ్లెటిక్స్ పోటీలలో ఆయన రాష్ట్రం తరపున పాల్గొని మంచి ప్రతిభ చాటారని, అందువల్లే అంతర్జాతీయ పోటీలలో పాల్గొనేందుకు ఆయన ఎంపికైనట్లు తెలిపారు. రామచంద్రకు "లాయర్" శుభాభినందనలు.

## బీజేపీలోకి తేళ్లపల్లి

ఇప్పటికే ఉన్న ప్రధానపార్టీలను చుట్టేసిన కాపు సంఘం నాయకుడు తేళ్లపల్లి రాఘవయ్య ఈ నెల 14వ తేదీన బీజేపీలో చేరారు. రంగనాయకులపేటలోని సోమిశెట్టి కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నెల్లూరురూరల్ బీజేపీ అభ్యర్థి సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి ఆయనను కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నరేంద్ర మోడీ నాయకత్వంలో పనిచేయాలనే ఉబలాటంతోనే బీజేపీలో చేరినట్లు రాఘవయ్య చెప్పుకున్నారు. ఈ సందర్భంగా రాఘవయ్య తన ఇంటి వద్ద నుండి సోమిశెట్టి కల్యాణ మండపం వరకు ఆటోలతో ఓ మోస్తరు ర్యాలీ నిర్వహించారు.



ఈ నెల 14వ తేదీన రాజ్యాంగ నిర్మాత డా॥ బి.ఆర్.అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని నెల్లూరులోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్, ఎస్పీ నవదీప్‌సింగ్ గ్రేవాల్

## 'దేశం' ఆఫీసులో గందరగోళం



కుర్చీలను విరగొడుతున్న కార్యకర్తలు

సోమవారం నెల్లూరులోని జిల్లా తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి నెల్లూరురూరల్ సీటు ఇవ్వనందుకు కోపోద్రిక్తులైన కార్యకర్తలు ఆగ్రహంతో కుర్చీలు విరగ్గొట్టారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్రతో వాగ్యుద్ధానికి దిగారు. మంగళవారం నెల్లూరులో నిర్వహించతలపెట్టిన లోకేష్ రోడ్‌షో కోసం పార్టీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటుచేసారు. అప్పటికే పెద్దసంఖ్యలో రూరల్ కార్యకర్తలు పార్టీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. రూరల్ సీటు బీజేపీకివ్వడంపై తమ నిరసన వ్యక్తం చేసారు. సమావేశం కాగానే కార్యకర్తలు రూరల్ సీటు విషయమై నాయకులతో గొడవకు దిగారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర కూడా వారితో గట్టిగా మాట్లాడడంతో వారిలో మరింత కోపం పెరిగి కుర్చీలను విరగ్గొట్టారు.

## అంబేద్కర్‌కు ఘన నివాళులు



నివాళులర్పిస్తున్న మేకపాటి, అనిల్

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని పలువురు రాజకీయ నాయకులు, అధికారులు, వివిధ స్వచ్ఛంధ సంస్థల వారు నెల్లూరు విఆర్‌సి సెంటర్‌లోని ఆయన విగ్రహానికి భారీగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైయస్సార్ కాంగ్రెస్ నాయకులు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, అనిల్‌కుమార్‌యాదవ్, అబ్దుల్ అజీజ్, మేరిగ మురళీధర్, సన్నపరెడ్డి పెంచలరెడ్డి, ఎం.ద్వారకానాథ్, పుట్టా రామకృష్ణారెడ్డి తదితరులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## వైభవంగా రాముడి రథోత్సవం

నెల్లూరు సంతపేటలోని ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరిగాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా 15వ తేదీ రథోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. సీతారామచంద్రులకు విశేషపూజలు నిర్వహించి, అనంతరం రథంపై ఊరేగించారు. స్వామి వారి రథాన్ని లాగడానికి పెద్దసంఖ్యలో భక్తులు పోటీపడ్డారు. బ్యాండు మేళాలు, తప్పెట్లు, వాయిదాలతో రథోత్సవం సందడిగా సాగింది. వివిధ స్వచ్ఛంద సంస్థలు, స్థానికులు భక్తులకు ప్రసాదాలు, మంచి నీళ్లు, మజ్జిగ అందించారు. ఈ ఉత్సవంలో ఎమ్మెల్యేలు ఆనం వివేకానందరెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, నెల్లూరునగర వైకాపా అభ్యర్థి పి.అనిల్‌కుమార్‌యాదవ్, నెల్లూరు నగర తెలుగు దేశం మేయర్ అభ్యర్థి డాక్టర్ జడ్.శివప్రసాద్, ఆలయ మాజీఛైర్మెన్ దర్శి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### యూటీఎఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర

## ప్రధాన కార్యదర్శిగా బాబురెడ్డి



హైదరాబాద్‌లోని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) కార్యాలయంలో ఈనెల 13న జరిగిన ఉమ్మడి రాష్ట్ర కమిటీ సమావేశంలో నెల్లూరీయులైన పి.బాబురెడ్డి ఆంధ్రప్రదేశ్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. తూర్పు గోదావరి జిల్లాకు చెందిన ఐ.వెంకటేశ్వరరావు అధ్యక్షులుగా నియమితులయ్యారు. నెల్లూరు జిల్లా యూటీఎఫ్ ప్రధానకార్యదర్శిగా ఉపాధ్యాయ సమస్యలపై పోరాడిన బాబురెడ్డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎంపికకావడం పట్ల జిల్లా యూటీఎఫ్ నాయకులు హర్షం వ్యక్తం చేసారు.

### 'ఆప్' సీటు కోసం

## ఆపసోపాలు

తెలుగుదేశం, వైసిపి పార్టీల టిక్కెట్ల కోసం కొందరు కొట్టుకుంటుండడం చూసాం. కాని ఆమ్‌ఆద్మీపార్టీ టిక్కెట్ కోసం కూడా గొడవలు పెట్టుకోవడం విచిత్రంగానే వుంది. ఆమ్ ఆద్మీ పార్టీ నుండి నెల్లూరు నగరం సీటు కోసం ఎన్ఎండి ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మెన్ నిజాముద్దీన్, హిజ్రాల సంక్షేమసంఘం నాయకురాలు అలేఖ్యల మధ్య తీవ్ర వాగ్యుద్ధం జరిగినట్లు తెలుస్తుంది. నేను ఎప్పటినుండో కష్టపడుతున్నాని, సీటు నాదేనని అలేఖ్య అంటే, నేను సేవా కార్యక్రమాలు చేస్తున్నానని, నువ్వు పక్కకుపోతే నేను పోటీ చేస్తానని నిజాముద్దీన్ ఆమెతో బేరానికి దిగడం విశేషం.

## దూదేకులకు మోసం

దూదేకులకు సీట్లివ్వకుండా చంద్రబాబు మోసం చేసాడని దూదేకుల సంక్షేమసంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ సలీం ఒక ప్రకటనలో విమర్శించారు. దూదేకులకు ఒక ఎంపీ, 5అసెంబ్లీ సీట్లిస్తానని చెప్పిన బాబు ఒక్క సీటు కూడా ఇవ్వకుండా మోసం చేసారని ఆరోపించారు.




జిల్లాలో సార్వత్రిక ఎన్నికల సమరాంగణానికి తెరలేచింది. గత మూడు దశాబ్దాల కాలంగా జరిగిన ఎన్నికలన్నీ ఒకెత్తయితే ఈ ఎన్నికలు ఒకెత్తు. ఇప్పటివరకు కాంగ్రెస్, తెలుగుదేశంపార్టీల మధ్యే అధికారం కోసం పోరాటం జరుగుతూ వచ్చింది. ఇప్పుడు అధికారపార్టీలో కాంగ్రెస్ తెరవెనక్కి పోయింది. రాష్ట్ర విభజన నేపథ్యంలో వైయస్సార్ కాంగ్రెస్, తెలుగుదేశంల మధ్యనే ప్రధానపోటీ నెలకొంది. కాంగ్రెస్ అక్కడక్కడ మాత్రమే గట్టి పోటీలో వుంది. నెల్లూరుజిల్లాలో చూస్తే నెల్లూరు లోక్‌సభకు, పదిఅసెంబ్లీ స్థానాలకు కాంగ్రెస్, వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించాయి. 16వతేదీ సాయంత్రానికి కూడా తెలుగుదేశం రెండుచోట్ల అభ్యర్థులను ఖరారు చేయలేదు. ఇవే కాకుండా జైసమైక్యాంధ్ర, ఆమ్‌ఆద్మీ, సీపీఎం, సీపీఐ వంటి పార్టీలు కూడా జిల్లా ఎన్నికల బరిలో దిగాయి. అభ్యర్థుల నామినేషన్లు కోలాహలంగా సాగుతున్నాయి. ఇప్పుడిప్పుడే ప్రచారం వేడెక్కుతుంది.

# నెల్లూరుజిల్లా నుండి 1 పార్లమెంటు, 10శాసనసభ నియోజకవర్గాలకు ప్రధానపార్టీల నుండి పోటీ చేస్తున్న అభ్యర్థులు, వారి అర్హతలు, అనుకూలతలు - ప్రతికూలతలు

## నెల్లూరు పార్లమెంట్

### వాకాటి నారాయణరెడ్డి (కాంగ్రెస్)



డి.సి.సి.బి ఛైర్మెన్‌గా రాజకీయ జీవితాన్ని ప్రారంభించి అనూహ్యంగా యం.యల్.సి.గా ఎన్నికకాబడ్డారు. రాజకీయంగా అనుభవం తక్కువైనా సూళ్ళూరుపేట నియోజకవర్గ కాంగ్రెస్ పెద్దగా, నేదురుమల్లి జనార్దన్‌రెడ్డికి అంతరంగీకవ్యక్తిగా పేరుంది. ఇటీవల "ధన" రాజకీయాలలో ధిట్టగా పిలిపించుకుంటూ "ఆనం" వారికి అప్తుడిగా మారాడు. ప్రస్తుతం తానే దిక్కై నెల్లూరు నుండి పార్లమెంటుకు పోటీచేసి "బలి"కాబోతున్నాడు.

### ఆదాల ప్రభాకర్‌రెడ్డి (తెలుగుదేశం)



మూడు పర్యాయాలుగా వరుసగా యం.యల్.ఏ.గా వుంటూ వస్తున్నాడు. తొలిసారి తెలుగుదేశం పార్టీ నుండి అల్లూరు నియోజకవర్గంలో పోటీ చేసి గెలిచి మంత్రిగా కూడా పనిచేసాడు. 2004, 2009లలో డా॥ వై.యస్.ఆశీస్సులతో సర్వేపల్లి నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా నిలిచి గెలిచి ఆ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి నంతా తన ఖాతాలో జమచేసుకున్నాడు. రాష్ట్ర విభజనతో దశాదిశా కోల్పోయిన దిక్కుమాలిన కాంగ్రెస్‌ను వదిలి మళ్ళీ సొంత గూటికి చేరి వియ్యంకుడి పైనే పోటీకి దిగి గట్టిపోటీ ఇవ్వబోతున్నాడు.

### మేకపాటి రాజమోహన్‌రెడ్డి (వైయస్సార్ కాంగ్రెస్)



సుదీర్ఘ రాజకీయ అనుభవం వున్నా నాయకత్వ లక్షణాలు లేవు. గౌతం తండ్రి కావడం ఒక్కటే ప్రస్తుతం వై.యస్.ఆర్.సి.పిలో ఈయనకున్న ప్రధాన అర్హత. పది సంవత్సరాలుగా యం.పి.గా వున్నా జిల్లాకు ఈయన చేసింది శూన్యమే. 2004 నుండి 2009 వరకు రాజశేఖరరెడ్డి పాలనలో సైతం కనీసం ఒక్క గట్టిస్థాయి అభివృద్ధి కార్యక్రమాన్నయినా ఢిల్లీ స్థాయిలో తెచ్చుకోలేకపోయిన హైటెక్ యంపిగా ఈయనకు పేరుంది. ప్రస్తుతం మళ్ళీ వై.యస్. కుటుంబ హవాతోనే గెలుపు ధీమాతో బరిలో దిగాడు.

కాంగ్రెస్ | తెలుగుదేశం | వై.యస్.ఆర్.కాంగ్రెస్

## సర్వేపల్లి

### కె.పట్టాభిరామయ్య



కాంగ్రెస్ మార్క్ సామాజిక న్యాయం ఖచ్చితంగా అమలు చేయగలిగింది ఈ ఎన్నికల్లోనే! అలివయితే రిజర్వుడ్ సీట్లలో కూడా రెడ్లు పోటీ చేస్తారు. అంతేగాని జనరల్ స్థానాలో దళితులు పోటీచేయడం కల్ల. కాని ఈ ఎన్నికల్లో అది సాధ్యమైంది. జనరల్ స్థానమైన సర్వేపల్లి నియోజకవర్గం నుండి దళిత వర్గాలకు చెందిన డాక్టర్ పట్టాభిరామయ్య కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్ టిక్కెట్‌ను తీసుకోమని ఏ రెడ్డి నాయకుడిని అడిగినా ముందుకు రాలేదు. దీంతో తిరుపతి ఎంపీ చింతామోహన్ స్వయంగా కలుగజేసుకుని దళిత వర్గాలకు చెందిన పట్టాభిరామయ్యను సర్వేపల్లి అభ్యర్థిగా నిలబెట్టారు.

### సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



అనుకున్నదొకటి, అయిందొకటి అన్నట్లైంది సర్వేపల్లి విషయంలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పరిస్థితి. సర్వేపల్లిని ఆయన వదులుకోవాలనుకుంటున్నా... సర్వేపల్లి ఆయన్ను వదులుకోవడంలేదు. గత నాలుగు దఫాలుగా సర్వేపల్లి నుండి పోటీ చేసిన సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఈసారి మాత్రం నెల్లూరు రూరల్ సీటుపై మనసుపడ్డారు. అయితే ఆయనకు గ్రహచారమో? ఆచారమో? ఏమోగాని చంద్రబాబు మళ్ళీ ఈయనకు సర్వేపల్లినే అంటగట్టాడు. ఈ నెల 19న సర్వేపల్లి నుండి నామినేషన్‌కు కూడా సిద్ధపడ్డారు. బీజేపీతో పొత్తు తెగింది కాబట్టి ఈలోపు రూరల్ నుంచి కూడా అవకాశం ఉన్నట్లే!

### కాకాణి గోవర్ధన్‌రెడ్డి



2007లో జిల్లా పరిషత్ ఛైర్మెన్ అభ్యర్థిగా అకస్మాత్తుగా జిల్లా రాజకీయతెరపై మెరిసి ఆ తరువాత ఛైర్మెన్ హోదాలో సమర్థత కలిగిన పాలకుడిగా, రాజకీయ చతురత నేర్చిన పొలిటీషియన్‌గా ప్రజల్లో గుర్తింపును తెచ్చుకున్నాడు. 2009లో ఆత్మకూరు అసెంబ్లీ స్థానంలో తనకు బదులుగా ఆనం రామనారాయణరెడ్డికి టిక్కెట్టు రావడంతో దశాబ్దాలుగా ఆనం కుటుంబంతో వున్న బంధాన్ని తెంచుకుని వై.యస్. మరణానంతరం "జగన్" పంచన చేరాడు. వ్యక్తిగా, పాలకుడిగా, రాజకీయనేతగా అన్ని విధాలుగా బ్రతకనేర్చిన వ్యక్తిగా ఈయనకు పేరుంది. ఆత్మకూరు నియోజకవర్గమైతే గట్టి పట్టు వుండేది. ఇప్పుడు సర్వేపల్లిలో ఆయన హవా ఏస్థాయిలో వుందో వేచిచూడాలి.

## నెల్లూరు రూరల్

### ఆనం విజయకుమార్‌రెడ్డి



అన్నలు ఆదేశిస్తే తూచ తప్పక ఆచరించే తమ్ముడు ఈయన. మొదటి నుండీ అన్నలచాటు తమ్ముడిగా వారు ఏ పదవికి వెళ్ళమంటే ఆ పదవికి వెళ్ళిన సందర్భాలు చాలా వున్నాయి. పార్టీలో కార్యకర్తగా "ఆనం" సోదరుల ప్రతిష్ఠ కోసం పరితపించే వ్యక్తి ఈయన. తొలిసారిగా శాసనసభకి పోటీ చేసే అవకాశం ఈయనకి దక్కింది. ఆనం బ్రాండ్ రూరల్‌లో ప్లస్ అయినప్పటికీ హస్తం గుర్తు ఏ మేరకు సహకరిస్తుందో తెలియదు.

### సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి (బీజేపీ)



బీజేపీ, టీడీపీల పొత్తులో భాగంగా నెల్లూరురూరల్ నుండి బీజేపీ అభ్యర్థిగా సన్నపరెడ్డి సురేష్‌రెడ్డికి అవకాశం వచ్చింది. ఇక్కడ బీజేపీ పోటీ చేయడం సాహసమే. రూరల్ పరిధిలో సీపీఎంకున్నంత కేడర్ కూడా బీజేపీకి లేదు. సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కోరుకున్న సీటిది. ఆయనకు హ్యాండిచ్చి బీజేపీకిచ్చారు. 20రోజుల్లో మిరాకిల్స్ చేస్తేగాని బీజేపీ గెలుపుకు చేరువకాలేదు. సన్నపరెడ్డి సురేష్‌రెడ్డిది పోరాడే తత్వం. ఏబివిపిలో విద్యార్థిస్థాయి నుండి నేడు బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి స్థాయికి పోరాడుతూనే వచ్చారు. 2004 ఎన్నికల్లో నెల్లూరు అసెంబ్లీ నుండి పోటీచేసి ఓడిపోయారు. ఈసారి రూరల్ ఆయన పోరాటానికి పరీక్షావేదికయ్యింది.

### కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి



2009లో ఖచ్చితంగా సీటొస్తుందని భావించి భంగపడ్డ వ్యక్తి ఈయన. విద్యార్థి నాయకుడిగా మొదలుపెట్టిన రాజకీయ జీవితం వున్నత పదవులే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. ప్రస్తుతం వైయస్సార్సీపీలో అందరితో కలుపుగోలుగా వుంటూ తన విజయప్రస్థానానికి మార్గం సుగమం చేసుకుంటున్నాడు. పార్టీలో సైతం ఈయనకి గట్టి పట్టే వుంది. పలు దీక్షల సమయాలలోనూ, షర్మిలమ్మ పాదయాత్రలలోనూ ఈయన్నే ఇన్‌ఛార్జ్‌గా పెట్టి బాధ్యతలు అప్పజెప్పారు. కార్యసాధకుడిగా గుర్తించిన పార్టీ ఈయన్ని నెల్లూరు గ్రామీణం నుండి బరిలోదింపింది. ప్రజా సానుభూతితో పాటు రాజకీయాన్ని బాగా వంటబట్టించుకున్న వ్యక్తిగా ఈయనకి పేరుంది.


## నెల్లూరు నగరం

### ఆనం చెంచుసుబ్బారెడ్డి




ఆనం వంశం నుండి వచ్చిన నవయువ నక్షత్రం ఈయన. మనిషి చాలా సౌమ్యుడు, మృధుస్వభావి, మితభాషి. తొలిసారిగా రాజకీయతెరపై మెరిసినా ఏకంగా శాసనసభ్యత్వానికే పోటీ చేస్తున్నాడు. కాంగ్రెస్‌పార్టీ భయంకరమైన కష్టకాలంలో వున్నప్పుడు నెల్లూరు నగరం నుండి పోటీ చేస్తున్న ఈయనకి "ఆనం" ఇంటిపేరు ఓ రకంగా కలిసొచ్చినా మరోరకంగా నష్టాన్నే కల్గించే అవకాశాలు ఎక్కువగా వున్నాయి. త్రిముఖ పోటీలో భవిష్యత్తును పరిశీలించుకునే వాళ్లల్లో ఈయనొకడు.

### ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి



తెలుగుదేశం టు ప్రజా రాజ్యం, ప్రజారాజ్యం టు కాంగ్రెస్, కాంగ్రెస్ టు మళ్ళీ తెలుగుదేశం. ఇదీ ఈయన రాజకీయ ప్రస్థానం. కౌన్సిలర్‌గా తెలుగుదేశం నుండి పనిచేసి అనంతరం 2009 ఎన్నికల్లో ప్రజారాజ్యం నుండి గెలుపొందాడు. కాంగ్రెస్‌తో ప్రజారాజ్యం దోస్తీ చేసినప్పటి నుండి 'ఆనం' నీడగా ఈయన ముద్రపడిపోయాడు. పేరుకి నగర శాసనసభ్యుడే అయినా పెత్తనం అంతా రూరల్ యం.యల్.ఏ చేస్తుండడంతో కార్యసాధకుడిగా ఈయనకు పెద్ద గుర్తింపు రాకపోయినా మంచి మనిషన్న పేరు మాత్రం ప్రజల్లో బాగా వుంది. ఈయన కూడా త్రిముఖ పోరులో తన జాతకాన్ని పరిశీలించుకోబోతున్నాడు.

### పి.అనిల్‌కుమార్‌యాదవ్



వయసులో చిన్నవాడు, సమర్థతలో పెద్దవాడు నెల్లూరు నగర వై.కా.పా అభ్యర్థి. కార్పొరేటర్‌గా ఆనం ఆశీస్సులతో గెలిచి వై.యస్. అండతో 2009లో యం.యల్.ఏ.గా పోటీ చేసి వెన్నుపోటుకు గురయ్యాడు. అప్పటినుండి ఆనం వ్యతిరేక నినాదంతో 'జగన్'కి బాగా దగ్గరయ్యి ఆయన ఆశీస్సులు పుష్కలంగా సంపాదించుకున్నాడు. ప్రతిపక్ష పార్టీల నుండి మంచి పోటీ ఎదుర్కోబోతున్నాడు. త్రిముఖపోరులో నెగ్గుకొచ్చే ప్రయత్నాలు గట్టిగానే చేస్తున్నాడు. ఆనంకు ఎదురుతిరిగిన ధీరుడుగా ఈయనకి జనంలో పేరుంది.

## ఆత్మకూరు

### ఆనం రామనారాయణరెడ్డి



ప్రస్తుతతరంలో వున్న సీనియర్ నాయకుడు. రాష్ట్రంలోనే ఓ పెద్ద రాజకీయ కుటుంబం వారిది. ఆనం కుటుంబం అంటనే పొలిటికల్ ఫ్యాక్టరీ. నెల్లూరు సహకార మార్కెటింగ్ కమిటీ ఛైర్మెన్‌గా మొదలైన ఆనం రామనారాయణరెడ్డి రాజకీయ ప్రస్థానం అప్రతిహతంగా సాగుతూనే వుంది. 1983లో నెల్లూరు, 1985, 1989, 1994, 1999, 2004లలో రాపూరు, 2009లో ఆత్మకూరు అసెంబ్లీ నియోజకవర్గాల నుండి పోటీ చేసారు. 1989, 1994లలో ఓడిపోయారు. 1989లో ఎన్టీఆర్ కేబినెట్‌లో కొంతకాలం మంత్రిగా చేసారు. 2007 నుండి మొన్నటివరకు వై.యస్., రోశయ్య, కిరణ్ కేబినెట్‌లలో మంత్రిగా కొనసాగారు. ఆత్మకూరు నుండి ఈసారి అగ్నిపరీక్షకు సిద్ధమయ్యారు.

### గూటూరు కన్నబాబు



ఏ చెట్టూ లేని చోట ఆముదం చెట్టే మహావృక్షమన్నట్లు ఆత్మకూరుకు టీడీపీ అభ్యర్థిగా గూటూరు కన్నబాబును పెట్టారు. కొమ్మి లక్ష్మయ్యనాయుడు పార్టీని వదిలి పోవడంతో ఇక్కడ నాయకత్వ కొరత ఏర్పడింది. దీంతో ఆత్మకూరు ఇన్‌ఛార్జ్‌గా కన్నబాబే నెట్టుకుంటూ వచ్చారు. సొంతంగా వర్గం లేదు, సొంత బలం లేదు. పార్టీ బలం మీద, తన సామాజిక వర్గాన్ని నమ్ముకుని బండిని లాగించాల్సి వుంటుంది. ఎన్నికలకు కూడా కొత్త. కన్నబాబుకు ఈ ఎన్నికల వరకు ప్రాక్టికల్సేననుకోవచ్చు. ఆయన గెలవడమంటూ జరిగితే అది దైవలీలే!

### మేకపాటి గౌతమ్‌రెడ్డి



రాజకీయాలకు ఈయన పూర్తిగా కొత్త. జగన్‌కి అత్యంత ఆప్తమిత్రుడిగా, వ్యాపార భాగస్వామిగా పార్టీ అధిష్ఠానంలో మంచి గుర్తింపువుంది. రాజకీయాలకు కొత్తైనా, వయస్సులో చిన్నైనా తండ్రి, చిన్నాన్నల విజయానికి పలుసార్లు కృషి చేసిన అనుభవంతో జిల్లా పెత్తనాన్ని ఈయనే కొనసాగిస్తున్నాడు. జగన్‌కి కొన్ని విషయాల్లో ఈయన చెప్పిందే వేదం. ఒక్కోసారి అది పార్టీకి చెడుచేసిన సందర్భాలు కూడా లేకపోలేదు. పట్టువిడుపు అన్నది లేకుండా తాననుకున్నదే కావాలనే తత్వం ఈయనలో ఎక్కువ. ఆత్మకూరుకి పూర్తిగా కొత్తే అయినా వై.యస్. హవాతో ఫేస్‌వాల్యూ కన్నా పార్టీ వాల్యూయే ప్రస్తుతం తనకి ప్లస్ పాయింటన్నది ఈయన ధీమా.

## వెంకటగిరి

### నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి



తండ్రి వారసత్వపు వాసనతో వెంకటగిరి వాసానికి చేరిన మరో రెండోతరం నాయకుడు ఈయన. తండ్రీ, తల్లీ చురుకుగా రాజకీయాలలో వున్నన్నాళ్ళూ తెరవెనుకే వుండి నేడు ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చేశాడు.


తన తండ్రి అనుచరగణాన్ని ప్రక్కదారి పట్టనీయకుండా తనకు అండగా దండగా నిలుపుకోవడంలో సక్సెస్ అయ్యాడు. తండ్రి ఛరిష్మా, తల్లి ప్రజాసేవా ఈయనకి ఏ స్థాయిలో కలిసొస్తాయో చూడాలి.

### కురుగొండ్ల రామకృష్ణ



పేరుకి ఈయన ఇక్కడ సిట్టింగ్ యం.యల్.ఏ అయినా అధికారం తమ పార్టీది కాకపోవడంతో ఇక్కడ ఈయన పెద్దగా సాధించిందేమీ లేదు. అడపాదడపా నిరసనలూ, సమ్మెలూ అంటూ పత్రికలకు ఫోజులిచ్చి ప్రచారం పొంది ఇక్కడ తానంటూ ఒక శాసనసభ్యుడిని వున్నానంటూ తన ఉనికిని చాటుకున్నాడు తప్ప నియోజకవర్గం కోసం చేసింది శూన్యమని అంటారు. అయితే అందరికీ అందుబాటులో ఉంటూ అవసరమైన వేళ స్పందించే నాయకుడిగా ఈయనకు పేరుంది. అడపాదడపా కావలసినప్పుడు ఆపదలో వచ్చిన వారిని ఆర్థికంగా ఆదుకోవడంలో ఈయన ముందుంటాడని అంటారు. వ్యక్తిగత సేవలు రాజకీయంగా ఈయనకు పనికొస్తాయా కలిసొస్తాయా చూడాలి.

### కొమ్మి లక్ష్మయ్యనాయుడు



అటు రాజకీయానికి ఇటు ప్రజాసేవకి సమపాళ్ళలో న్యాయం చేస్తూ ప్రజల నాడి నెరిగి పనిచేసే వ్యక్తిగా ఈయనకి పేరుంది. మాజీశాసనసభ్యుడిగా, సీనియర్ ప్రజానాయకుడిగా తనదైన శైలిలో ముక్కసూటిగా వెళ్ళే మనస్తత్వం ఈయనది. మేకపాటి వర్గం ప్రక్కలో బల్లెంలా ఈయనని వ్యతిరేకిస్తున్నా తనకున్న మంచిపేరు, ప్రజల్లో పార్టీకున్న క్రేజ్ తన విజయానికి బాటలు వేస్తాయనే ధీమాతో తన పని తాను చేసుకుపోతున్నాడు. అవినీతి మచ్చలేని నాయకుడిగా ఈయనకి పేరుంది. అదొక ప్లస్‌పాయింట్.

కాంగ్రెస్ | తెలుగుదేశం | వై.యస్.ఆర్.కాంగ్రెస్

## ఉదయగిరి

### పి.చెంచలబాబుయాదవ్



ప్రతి ఎన్నికలలోనూ బలహీనవర్గాల నుండి కాంగ్రెస్‌పార్టీ టిక్కెట్‌ను కోరుకుంటున్న ఆశాజీవి. ఉదయగిరి స్వగ్రామం. ఆయన తండ్రి పి.చెంచురామయ్య గతంలో ఉదయగిరికి ఎమ్మెల్యేగా పనిచేసి వున్నారు. ఉదయగిరి నుండి ఎన్నికైన ఏకైక బిసి ఎమ్మెల్యే కూడా ఆయనే. తన తండ్రి రికార్డును తానే బద్ధలు కొట్టాలనేది చెంచలబాబు తపన. అదృష్టం తలుపుతట్టి వూహించకుండానే 2001లో జిల్లా పరిషత్ ఛైర్మెన్ కాగలిగాడు. ఈసారి మాత్రం ఉదయగిరి టిక్కెట్‌ను ముందుగానే ఊహించాడు. కాకపోతే అదృష్టమే తలుపు తట్టే సీన్ కనిపించడం లేదు.

### బొల్లినేని రామారావు



ఆర్థికబలంతో రాజకీయ ఆరంగేట్రం చేసిన ఆధ్యాత్మిక చింతనాపరుడీయన. ఉప ఎన్నికల్లో పార్టీకి అండగా నిలిచి ఓటమిపాలై అప్పటి నుండి నియోజకవర్గాన్ని కనిపెట్టుకుని ఎప్పటికైనా చట్టసభకి వెళ్ళడమే లక్ష్యంగా పనిచేస్తున్నాడు. ఇక్కడ పార్టీకి కొంత బలం ఉన్నప్పటికీ ఈయనకి వర్గబలం లేదు. సామాజిక పరంగా కొంత ఉపయోగం వున్నా పరిచయాలు విస్తృత స్థాయిలో లేకపోవడం పెద్ద లోటు. ఒక పరిధికే పరిమితమై సంబంధాలను నెరపడంతో ప్రజలకు పెద్దగా చేరువకాలేకపోయాడు. అవతల వ్యక్తిపై కోపం వున్నా ఈయనలో కలుపుగోలుతనం లేనందున అది ఈయనకి కలిసిరాలేదనే చెప్పాలి.

### మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి



కేవలం ధనబలం, కండబలంతో పాటు వై.యస్. కుటుంబ ఇమేజ్‌తో ఈయన ఇప్పటికి మూడుసార్లు గెలిచాడు. మనిషికి దూకుడు ఎక్కువ, సౌమ్యుడు కాదు. సర్వేల ప్రకారం ఈయనపై వ్యతిరేక ఫలితాలొచ్చినా కేవలం గౌతం బాబాయ్‌గా మళ్ళీ పోటీలో దిగుతున్నాడు. ఈసారి కూడా వై.యస్.గాలే ఈయనకు బలం. రాజశేఖరరెడ్డి మరణం అనంతరం చోటుచేసుకున్న అనేక పరిణామాలు అనర్హులను సైతం అందలం ఎక్కిస్తున్నాయి. వారిలో ఈయనొకడు. ఈ ఎన్నికల్లో కూడా వై.యస్. కుటుంబ సానుభూతే ఈయన అదృష్టం కావచ్చు.


## కావలి

### చింతాల వెంకటరావు



కలిగి యానాదిరెడ్డి, గొట్టిపాటి కొండపనాయుడు, మాగుంట పార్వతమ్మ వంటి ఉద్దండులు ఎమ్మెల్యేలుగా పనిచేసిన కావలి నియోజకవర్గం కాంగ్రెస్ టిక్కెట్‌ను ఈసారి ప్రముఖ న్యాయవాది చింతాల వెంకటరావు దక్కించుకోగలిగారు. చిరంజీవి అభిమాన సంఘం నాయుకుడు కూడా! గతంలో తెలుగుదేశం, ప్రజారాజ్యం పార్టీలలో పనిచేసారు. న్యాయవాదిగా కావలి పట్టణంలో అందరికీ సుపరిచితుడే. కాని మిగతా మండలాలలో ఎవరికీ తెలియదు. ఇంతకుముందంతా కావలి కాంగ్రెస్‌కు కంచుకోట. ఇప్పుడదే చోట కాంగ్రెస్ కుప్పకూలింది. చింతా వెంకట్రావుకు టిక్కెట్ మొక్కుబడిగా ఇచ్చినట్లే.

### బీద మస్తాన్‌రావు



విద్యావంతుడు, సౌమ్యుడు అన్నింటినీమించి సహృదయమున్న ప్రజాసేవకుడిగా ఈయనకు పేరుంది. శాసనసభ్యుడిగా 2009 నుండి రోజు వరకూ నియోజకవర్గంలో మంచిపట్టును సాధించాడు. ముఖ్యంగా కావలికి "కావలి"కాస్తూ వ్యాపారాలను ప్రక్కనబెట్టి ప్రజలకు అందుబాటులో వుండే నాయకుడనిపించుకున్నాడు. ఇక్కడ ప్రధానప్రతిపక్షంగా కొత్తపార్టీ బలపడడం "హస్తం" పూర్తిగా కనుమరుగైపోవడంతో పోటీ నువ్వా-నేనా అనే స్థాయిలోనే వుంటుంది.

### రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



విద్యావంతుడిగా, యువ పారిశ్రామికవేత్తగా ఈయనకి మంచి గుర్తింపు వుంది. రాజకీయాల్లో సైతం సౌమ్యుడిగా అందరికీ అందుబాటులో వుండే వ్యక్తిగా పేరు సంపాదించుకున్నాడు. నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయడంలో బాగా కష్టపడుతున్నాడు. ఇక్కడ తెలుగుదేశం ఒక్కటే గట్టి ప్రత్యర్థి పార్టీ కావడంతో కాంగ్రెస్‌తో పాటు తెలుగుతమ్ముళ్ళను కూడా వై.సి.పిలో చేర్పించే పనిలో చాలావరకూ సఫలమయ్యాడు. తన ప్రత్యర్థి కూడా తనలాగే సౌమ్యుడు, విద్యావంతుడూ, పారిశ్రామికవేత్తే కాకుండా రాజకీయంగా అనుభవం కలిగినవాడు కావడంతో ఇక్కడ ఈయనకి గట్టిపోటియే వుండే అవకాశాలు వున్నాయి.

## కోవూరు

### జి.వెంకటరమణ

కాంగ్రెస్‌కు ఏ దుస్థితి పట్టిందనేదానికి ఉదాహరణ కోవూరు అభ్యర్థే. ఊరు, పేరు తెలియని జి.వెంకట రమణకు కోవూరు కాంగ్రెస్ సీటునిచ్చారు. బుచ్చిరెడ్డిపాలెం మండలంలోని చెల్లాయపాళెం సొంత ఊరు. కాని ఈయన గురించి సొంత మండలం వారికే తెలియదు. ఇక కోవూరు జనాలకేం తెలుస్తుంది. ఈయన తాత జి.సుందరయ్య 1978లో అల్లూరు ఎమ్మెల్యేగా పనిచేసారు. కాని పెద్దగా పేరున్న కుటుంబం కూడా కాదు. కోవూరు కాంగ్రెస్ కార్యక్రమాలలో వెంకటరమణ ఎప్పుడూ పాల్గొన్న దాఖలాలు కూడా లేవు. కాంగ్రెస్ సీటును చించి చెత్తబుట్టలో వేసిన చందంగా అభ్యర్థిని పెట్టారు.

### పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి



పచ్చచొక్కాతో రాజకీయ రంగ ప్రవేశం చేసి 2004లో అకస్మాత్తుగా ఖద్దరుపార్టీ అభ్యర్థిగా అక్కడ సైకిలెక్కిన అభ్యర్థిని ఓడించి జెయింట్‌కిల్లర్‌గా పేరు సంపాదించిన నాయకుడీయన. ఆ తరువాత రెండుసార్లు వరుసగా ఖద్దరు పార్టీ నుండే పోటీ చేసి ఓటమిపాలై మళ్ళీ ఇప్పుడు సైకిలెక్కి ప్రజల మద్దత్తు కోరుతున్నాడు. ఇక్కడ సిట్టింగ్‌ని ఇప్పటికి రెండుసార్లు వరుసగా గెలిపించిన ఓటర్లు 3వ సారి ఓటెయ్యరన్నది ఈయన ధీమా. ఫలితం వేచిచూడాల్సిందే!

### నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి



తండ్రి నుండి అందుకున్న రాజకీయ వారసత్వం, పలు దఫాలు యం.యల్.ఏగా ఎన్నిక కాబడి ప్రజలతో ఏర్పరచుకున్న గట్టి సంబంధాలూ, కలసిన వారందరినీ పేరుపేరునా గుర్తుపెట్టుకుని పలకరించే నాన్న గుణం, వీటన్నింటితో పాటు వై.యస్.ఆర్.కాంగ్రెస్‌కు ప్రజల్లో వున్న బలం ఈయనకు కలిసొచ్చే అంశాలు. సిట్టింగ్ అభ్యర్థిగా కొంత వ్యతిరేక పవనాలు వీస్తున్నా "జగన్"గాలిలో కొట్టుకొచ్చేస్తానన్న ధీమా ఈయనలో ఎక్కువగా వుంది. బలమైన అభ్యర్థి ప్రత్యర్థిగా వచ్చినా తన గెలుపుకు ఢోకాలేదన్నది ఆయన నమ్మకం.

## గూడూరు

### పనబాక కృష్ణయ్య



దక్షిణమధ్య రైల్వేలో చీఫ్ పిఆర్‌ఓ ఉద్యోగాన్ని అర్థాంతరంగా వదిలిపెట్టి 2009లోనే గూడూరు కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసారు. కాంగ్రెస్ రక్తాన్ని నరనరాన జీర్ణించుకున్న కాంగ్రెస్‌వాది. నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి ఆ ఎన్నికలలో తెలుగుదేశంకు మద్దతుగా పనిచేయడంతో ఈ కాంగ్రెస్ అభ్యర్థి ఓటమి పాలు కావాల్సి వచ్చింది. భార్య పనబాక లక్ష్మి కేంద్రమంత్రిగా వుంది. పనబాక కృష్ణయ్య ఈసారి పార్టీ మార్చాలని చూసాడుకాని అది వీలుపడక కాంగ్రెస్ అభ్యర్థిగానే బరిలోకి దిగాల్సి వస్తుంది. గత ఎన్నికల్లో నిరాదరించిన గూడూరు ప్రజలు ఈసారన్నా ఆదరిస్తారన్న ఆశతో వున్నారు.

జిల్లాలోని 8అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసిన చంద్రబాబు గూడూరు సీటు విషయంలో మాత్రం గురువారం రాత్రి దాకా కూడా సస్పెన్స్‌ను కొనసాగించారు. సిట్టింగ్ ఎమ్మెల్యే బల్లి దుర్గాప్రసాద్‌రావు వున్నప్పటికీ ఆయన పేరును ఖరారు చేయకుండా నాన్చారు. బల్లి దుర్గాప్రసాద్‌కు పోటీగా డాక్టర్ జోత్స్నను కూడా కాంట్రాక్టర్ గంగా ప్రసాద్ రంగంలోకి తెచ్చిపెట్టారు. దీంతో టిక్కెట్ ఎవరికి దక్కుతుందనేదాని మీద టెన్షన్ నెలకొంది. గత ఎన్నికల్లో నేదురుమల్లి సహకారంతో బల్లి దుర్గాప్రసాద్ గట్టెక్కాడు. ఈసారి ఆయనకు టిక్కెట్ ఇవ్వడం సందేహంగా ఉంది.


### పాశం సునీల్‌కుమార్



నల్లపరెడ్డి వర్గీయుడిగా, మాజీమున్సిపల్ ఛైర్మెన్‌గా రాజకీయ రంగంలో గుర్తింపు తెచ్చుకున్న వ్యక్తి ఈయన. ఇక్కడ నాయకత్వం వహించే బలమైన అగ్రసామాజికవర్గం మద్దత్తుతో ఈ ఎన్నికల్లో శాసనసభకు పోటీ చేయబోతున్నాడు. రిజర్వు నియోజకవర్గమైనప్పటికీ ఇక్కడా ఇతరవర్గాల వారిదే పెత్తనం. ముఖ్యంగా రెండు గ్రూపులుగా వున్న ఆ వర్గం ఈయన విషయంలో ఒక్కటై ఇతనిని బరిలో దింపడం ఈయన అదృష్టం. బయట తమకు ఎన్ని లుకలుకలున్నా అభ్యర్థి గెలుపు విషయంలో ఈ పార్టీలోని రెండు అగ్రవర్ణాల వర్గాలూ ఒక్కటిగా ఈయన గెలుపుకి కృషి చేసే అవకాశం వుంది.

## సూళ్లూరుపేట


### డి.మధుసూదనరావు



నెల్లూరులో టౌన్‌బస్సు చెకింగ్‌గా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించి, జర్నలిస్టు వృత్తిలోకి ప్రవేశించి, తన వ్యక్తిగత సంబంధాలతో అటు జర్నలిజాన్ని, ఇటు రాజకీయాన్ని ప్రభావితం చేసిన వ్యక్తి మధుసూదన్‌రావు. ప్రస్తుత తరంలో చాలా వేగంగా సాధారణ రిపోర్టర్ స్థాయి నుండి కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి స్థాయికి ఎదిగాడు. ఏసిఎన్ మధుగా నెల్లూరు నగరంలో చాలామంది ప్రముఖులకు సుపరిచితుడైన మధుకు తిరుపతి ఎంపీ చింతామోహన్‌తో ప్రత్యేక అనుబంధముంది. చింతా మోహన్ సహకారంతోనే ఈరోజు సూళ్లూరుపేట కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయగలుగుతున్నారు.

సిట్టింగ్ ఎమ్మెల్యే పరసా రత్నంకు 17వ తేదీ రాత్రి వరకు కూడా సీట్ ఖరారు కాలేదు. సీటు విషయంలో ఆయనకే ఎక్కువ అవకాశాలున్నాయి. ఇదో విచిత్రమైన కేసు. ఎన్నికలప్పుడే ఈయనకు ప్రజలతో అనుబంధాలు, ఆత్మీయతలు గుర్తుకు వస్తుంటాయి. ఎన్నికల్లో గెలిచాక అనుబంధాలను తెంపేసుకుపోతుంటాడు. అయితే జిల్లా నాయకులలో ఇంతకంటే అదృష్టవంతుడు ఉండడేమో! 1994 నుండి రూపాయి ఖర్చు లేకుండా ఎమ్మెల్యేగా ఉంటున్నాడు. 1994, 1999, 2009ఎన్నికల్లో సూళ్లూరుపేట నుండి తెలుగుదేశం ఎమ్మెల్యేగా గెలిచారు. 2004లో మాత్రం వై.యస్. గాలిలో ఓడిపోయారు. పరసా వెనుక వేనాటి చంద్రారెడ్డి బలమైన శక్తిగా ఉన్నారు. పరసాను ఇంతవరకు నిలబెట్టింది ఆయనే! ఇప్పుడు నిలబెడతాడో, కూలుస్తాడో చూడాలి.

### కె.సంజీవయ్య



ఇక్కడ మొదటి నుండీ వై.యస్.ఆర్.కాంగ్రెస్ అభ్యర్థిగా తెరవై వుండిన వ్యక్తిపై వుండిన తీవ్ర వ్యతిరేకతతో పాటు ఆయన ప్రవర్తన, అహంకారపు పోకడ ఇక్కడ బరిలో కొత్త అభ్యర్థికి అవకాశం కల్పించింది.

విద్యావంతుడిగా ప్రభుత్వరంగ ఉద్యోగిగా గతంలో ఇదే నియోజకవర్గం నుండి ఎంపికై మంత్రిగా పనిచేసిన అనుభవమున్న వ్యక్తికి అల్లుడిగా ఈయనకి అన్నీ అనుకూల అర్హతలు వుండడంతో ఇక్కడ అభ్యర్థిగా బరిలో దిగాడు.



ఈ నెల 12వ తేదీన నెల్లూరులోని తన ఇంట్లో జరిగిన ఉదయగిరి నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ప్రసంగిస్తున్న మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పక్కన ఉదయగిరి కాంగ్రెస్ అభ్యర్థి పి.చెంచలబాబుయాదవ్

## సమర్థవంతంగా ఎన్నికల నిర్వహణ - జిల్లా ఎస్పీ



సార్వత్రిక ఎన్నికల ప్రక్రియను సాఫీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామని జిల్లా ఎస్పీ నవదీప్‌సింగ్ గ్రేవాల్ పేర్కొన్నారు. సోమవారం నెల్లూరులోని తన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు సంబంధించి సిబ్బందికి విధులు కేటాయించడంతో పాటు రూట్‌మ్యాప్‌లను కూడా తయారు చేస్తున్నామన్నారు. మే7న జరిగే లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల బందోబస్తు కోసం సిఆర్‌పిఎఫ్, రాపిడ్ యాక్షన్ ఫోర్సు బలగాలు కావాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. ఎన్నికలకు ముందు, ఎన్నికల రోజు, ఎన్నికల తర్వాత అనే మూడంచెల పద్ధతిలో భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల సందర్భంగా గొడవలు జరిగిన ప్రాంతాల్లో భారీగా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి బందోబస్తును ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఎన్నికల సందర్భంగా ఎక్కడైనా అక్రమ మద్యం నిల్వలు, మద్యం పంపిణీ గురించి తెలిస్తే వెంటనే 100కు సమాచారం అందించాలని ఆయన కోరారు. పులికాట్‌సరస్సులో తమిళనాడు, ఆంధ్రా జాలర్ల మధ్య జరిగిన ఘర్షణ గురించి ఆయన ప్రస్తావిస్తూ ఒకరి సరిహద్దుల్లోకి మరొకరు వస్తున్నందువల్లే ఇలాంటి వివాదాలు తలెత్తుతున్నాయని అన్నారు. సరిహద్దు సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని కోరారు. మొన్నటి వివాదంలో తమిళజాలర్లదే తప్పని పేర్కొన్నారు.

## వైసిపిలో చేరిన 'అనురాగ్' అధినేత



నెల్లూరు గ్రామీణంలోని వడ్డిపాళెంలో ఈనెల 12న వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం జరిగింది. నెల్లూరు గ్రామీణ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పాల్గొన్న ఈ సమావేశంలో ప్రముఖ పారిశ్రామికవేత్త, అనురాగ్ హోటల్ అధినేత కాకుటూరు సూర్యప్రతాప్‌రెడ్డి తన అనుయాయులు వెంకటశేషారెడ్డి, చెన్నయ్య, శీనయ్య, సుధీర్‌రెడ్డి, రామసుబ్బయ్య, రవి, రమేష్, వెంకటేశ్వర్లు, హరి తదితరులతో కలసి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ సూర్యప్రతాప్‌రెడ్డి పార్టీలో చేరడం ఎంతో ఆనందంగా వుందని దీంతో నెల్లూరు గ్రామీణ నియోజకవర్గంలో పార్టీ మరింత బలోపేతమైందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు లేబూరు పరమేశ్వర్‌రెడ్డి, చెంచురామయ్య, మస్తానయ్య, శ్రీను, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అగ్నిమాపక దినోత్సవం

సోమవారం నెల్లూరు రైల్వేఫీడర్స్ రోడ్డులోని అగ్నిమాపక కేంద్రంలో అగ్నిమాపక వారోత్సవాలను నెల్లూరు కేంద్ర కారాగార సూపరింటెండెంట్ ఎం.ఆర్.రవికిరణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలను చైతన్యవంతులను చేయడం ద్వారా అగ్ని ప్రమాదాలను నివారించవచ్చునన్నారు. అజాగ్రత్త వల్లే ఎక్కువ అగ్నిప్రమాదాలు జరుగుతుంటాయన్నారు. అగ్నిమాపక శాఖ నిర్లక్ష్యం వహిస్తే జరిగే నష్టం అపారమని, కాబట్టి అగ్నిమాపక సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ తమ సేవలందించి ప్రజల ప్రాణాలు, ఆస్తులు కాపాడాలన్నారు. జిల్లా అగ్నిమాపక అధికారి జి.శ్రీనివాసులు మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలను నివారించేందుకు అన్ని భవనాలు, కాంప్లెక్స్‌లలో విధిగా అగ్నిమాపక పరికరాలు పెట్టుకునేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సిగరెట్లు తాగి ఆపకుండా పడేస్తున్నందువల్లే ఎక్కువగా అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. జిల్లాలో 13అగ్నిమాపక కేంద్రాలలో 16ఫైరింజన్లు అందుబాటులో ఉన్నాయన్నారు. నెల్లూరులో 84 లక్షలతో అగ్నిమాపక కేంద్ర భవన నిర్మాణాన్ని చేపట్టినట్లు చెప్పారు.



పరికరాలను పరిశీలిస్తున్న అధికారులు

ఈ సందర్భంగా అగ్నిమాపక వారోత్సవాలపై ముద్రించిన పోస్టర్లు, కరపత్రాలను రవికిరణ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఫైర్ ఆఫీసర్ జాషువా, జిల్లా అగ్నిమాపకశాఖ అదనపు అధికారి కె.సత్యనారాయణ, నెల్లూరు ఫైర్ ఆఫీసర్ పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా ఫైరింజన్‌లతో నగరంలో నిర్వహించిన ప్రదర్శన ప్రజలను ఆకర్షించింది.

## సింహపురి సమాచారం

### జ్వాలాముఖి ఆశీస్సులతో...

## కాకాణి ఎన్నికల ప్రచారం ప్రారంభం



సమావేశంలో ప్రసంగిస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

తోటపల్లి గూడూరు మండలంలోని వరిగొండలోగల జ్వాలాముఖి ఆలయంలో వైఎస్సార్‌సీపీ సర్వేపల్లి నియోజకవర్గ అభ్యర్థి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఈనెల 13న ప్రత్యేక పూజలు నిర్వహించి తన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈనెల 16న తను నామినేషన్ వేస్తున్నట్టు, తనను గెలిపిస్తే ప్రజలకు సేవకుడిలా పనిచేస్తూ సమస్యలు పరిష్కరిస్తానని పేర్కొన్నారు. అందుకే జ్వాలాముఖి అమ్మవారి ఆశీస్సులు కోసం వరిగొండకు వచ్చానని తెలిపారు. జడ్పీ ఛైర్మెన్‌గా అభివృద్ధి కార్యక్రమాలను ఎలా చేసానో ప్రజలందరికీ తెలిసిన విషయమేనని అదే విధంగా సర్వేపల్లి నియోజకవర్గ ప్రజల సంక్షేమానికి బాటలు వేస్తానన్నారు. తన నిజాయితీ పనితనంతో పాటు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి విశ్వసనీయత తన విజయానికి దారితీస్తుందని పేర్కొన్నారు. ఈనెల 16న నామినేషన్ వేసి తదుపరి ప్రజల ఆశీస్సులు కోరడానికి నియోజకవర్గంలోని గ్రామాలకు వెళ్తానని తెలిపారు. దేవళాలమిట్ట దళిత కాలనీలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు చిల్లకూరు సుధీర్‌రెడ్డి, పేర్నేటి శ్యాంప్రసాద్‌రెడ్డి, మండల కన్వీనర్ టంగుటూరు పద్మనాభరెడ్డి, నేతలు కామిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, టంగుటూరు శ్రీనివాసులురెడ్డి, మన్నెం చిరంజీవిగౌడ్, ఆకుల మధు, నెల్లిపూడి రాజగోపాల్‌రెడ్డి, ఉప్పల శంకరయ్య, సిద్ధవరపు రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా అనిల్ నామినేషన్



నెల్లూరు నగర అసెంబ్లీ నియోజకవర్గానికి వై.యస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ తరపున డా॥పి.అనిల్‌కుమార్ ఈనెల 12న గాంధీ బొమ్మ నుండి మేళతాళాలతో కనకమహల్ సెంటర్, ములుముడి బస్టాండ్, చిన్న బజారు, పెద్దబజారు, అలంకార్ సెంటర్ మీదుగా నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయము వరకు భారీ ర్యాలీ నిర్వహించి నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా మహిళలు మంగళహారతులతో ఘనస్వాగతం పలికారు.

ఈ కార్యక్రమంలో మేకపాటి రాజమోహన్‌రెడ్డి, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, మేరిగ మురళీధర్, కోటంరెడ్డి, అబ్దుల్ అజీజ్, జియాఉద్దీన్, పులిమి శైలజ, ముక్కాల ద్వారకానాథ్, మాజీ కార్పొరేటర్ దువ్వూరు శరచ్చంద్ర, సన్నపురెడ్డి పెంచలరెడ్డి, పడవల సుధాకర్, పుట్టా రామకృష్ణారెడ్డి, దార్ల వెంకటేశ్వర్లు, లోకిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, అబ్దుల్ జలీల్, ఏ.బాలకోటేశ్వరరావు, దామవరపు రాజశేఖర్, యం.డి.ఖలీల్‌అహ్మద్, ముప్పసాని శ్రీనివాసులు, మునీర్ సిద్ధిక్, లెక్కల వెంకారెడ్డి, పోలంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, యస్.కె.సుభాన్, అతహర్, మాజీ కౌన్సిలర్ షఫీ, గంధం సుధీర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## దళితులకు న్యాయం చేసేది 'దేశమే'



కండువా కప్పి జన్ని రమణయ్యను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న ఆదాల

నెల్లూరులోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో ఈనెల 12న తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర సమక్షంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి జన్ని రమణయ్య మాదిగతో పాటు పలువురు కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరారు. తెదేపా పార్లమెంటు అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి రమణయ్యకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బీద రవిచంద్ర మాట్లాడుతూ ఎన్టీఆర్ తెదేపాను స్థాపించినప్పటి నుంచే దళితులకు సరైన న్యాయం జరిగిందని, దళితుల హక్కు కోసం, వారి అభివృద్ధి కోసం చంద్రబాబు ఎంతో కృషిచేసారని అన్నారు. ఇప్పుడు రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను చక్కదిద్ది సీమాంధ్ర అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు ఒక్కడికే అది సాధ్యపడుతుందని పేర్కొన్నారు. ఆదాల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో కూర్చున్న కాంగ్రెస్ అధినేత్రి రాష్ట్రాన్ని ఏకపక్షంగా విభజించిందని, దాంతో సీమాంధ్ర ఎంతో నష్టానికి లోనయిందన్నారు. జన్ని రమణయ్య మాదిగ మాట్లాడుతూ తమ సామాజిక వర్గానికి తెదేపాతోనే న్యాయం జరిగిందని, జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్ళపాక అనూరాధ, కావలి ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు, మాజీ శాసనసభ్యులు పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, నాయకులు ఎర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, కొండ్రెడ్డి రంగారెడ్డి, దేవరాల సుబ్రహ్మణ్యంయాదవ్, రాచర్ల రవికుమార్‌యాదవ్, ఆనంద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వాసవి క్లబ్ వితరణ

నెల్లూరు దర్గామిట్టలోని విశ్వభారతి అంధుల పాఠశాలలో ఈనెల 14న వాసవిక్లబ్ ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులు అందించారు. క్లబ్‌సభ్యులు గునుపూడి మురళీధర్ సహాయంతో వంటనూనె, నిత్యావసర వస్తువులు, దుస్తులు, బిస్కెట్ ప్యాకెట్లు పాఠశాలకు ఇచ్చినట్టు క్లబ్ అధ్యక్షుడు తిరివీధి వెంకటకిషోర్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి మంచికంటి సుబ్రహ్మణ్యం, సభ్యులు పేరూరు మల్లికార్జున, మాదాల వెంకటసుధాకర్, తులసి సుబ్బారావు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# స్వర్గలోకంలోవారికి కాంగ్రెస్ టిక్కెట్లు

గల్పిక

అది న్యూఢిల్లీలోని టెన్‌జనపథ్. సోనియాగాంధీ, మన్మోహన్‌సింగ్, రాహుల్‌గాంధీ, దాసరి జైరాం రమేష్, దిగ్విజయ్‌సింగ్‌లు కూర్చుని వున్నారు. వారికెదురుగా సీమాంధ్ర పీసీసీ అధ్యక్షుడు రఘు వీరారెడ్డి, మెగాస్టార్ చిరంజీవి, ఆనం రామనారాయణరెడ్డి, బొత్స సత్యనారాయణ, కన్నా లక్ష్మీనారాయణ, పనబాక లక్ష్మి, చింతా మోహన్ వున్నారు. ఇంకోపక్కన తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్యతో పాటు సర్వే సత్యనారాయణ, జైపాల్‌రెడ్డి, మధుయాష్కీ, గీతారెడ్డి, దానం నాగేందర్, జానారెడ్డి వున్నారు. పొన్నాల లక్ష్మయ్య లేచి... మేడమ్, మా తెలంగాణ మొత్తం 119 అసెంబ్లీ, 17లోక్‌సభ స్థానాలున్నాయి. కాంగ్రెస్ టిక్కెట్ల కోసం అసెంబ్లీ 238 మంది, లోక్‌సభకు 34మంది పోటీలో ఉన్నారు. ఉన్న సీట్లు తక్కువ. టిక్కెట్లు అడిగే నాయకులు ఎక్కువ. ఎలా అడ్జస్ట్ చేయాలో అర్థం కావడం లేదన్నాడు. మీ సమస్య ఏంటని రఘువీరారెడ్డిని సోనియా అడిగింది. దానికాయన... మేడమ్ మా రాష్ట్రంలో 175అసెంబ్లీ, 25లోక్‌సభ స్థానాలు న్నాయి. వీటిలో పోటీ చేయడానికి అభ్యర్థులెవరూ దొరకడం లేదు. క్రితంసారి పోటీ చేసిన వారిలో సగం మంది తెలుగుదేశం, వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీల్లోకి వెళ్లిపోయారు.

ఇక సగం మంది మాత్రం... ఎల్లకాలం మేమే పోటీ చేస్తుంటే ఎలా... కొత్తవారికి అవకాశం ఇవ్వాలి కదా... అని చెప్పి పోటీ చేయబోమంటున్నారు. మాకు అభ్యర్థులు కొరతగా వుంది... అని చెప్పాడు. అప్పుడు సోనియా... సమస్య ఇక్కడే వుంది. దానికి పరిష్కారమూ ఇక్కడే వుంది. తెలం గాణలో టిక్కెట్లు అడిగేవాళ్లు ఎక్కువయ్యారు, సీమాంధ్రలో టిక్కెట్లు అడిగేవాళ్లే లేరు. కాబట్టి తెలంగాణలో టిక్కెట్లు అడుగుతున్నవారికి సీమాంధ్రలో టిక్కెట్లిచ్చేయండి సరిపోతుందని తెలివిగా చెప్పింది. దానికి పొన్నాల... సీమాంధ్రలో కాంగ్రెస్ అంటే జనం పరుగులు తీస్తున్నారు. ఇంకో మార్గం ఆలోచించండన్నాడు. అప్పుడు సోనియా రఘు వీరాతో... సీమాంధ్ర కాంగ్రెస్‌ను పూర్తిగా మీకు అప్ప గించేసాం, అభ్యర్థులను పెట్టుకుంటారో మానుకుం టారో మీ ఇష్టం. మీ చావు మీరు చావండని లేచింది. దాంతో ఉసూరుమంటూ సీమాంధ్ర కాంగ్రెస్ నాయ కులు హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు.

★★★★★

హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో సీమాంధ్ర కాంగ్రెస్ నాయకులంతా కూర్చుని వున్నారు. రఘువీరారెడ్డి ఆరోజు పత్రికలో ఇచ్చిన ప్రకటన చదవసాగాడు. అది ఇలా వుంది.... "అభ్యర్థులు కావలెను", ఆంధ్రప్రదేశ్‌లో 175అసెంబ్లీ సీట్లకు, 25లోక్‌సభ స్థానాలకు పోటీ చేయుటకు ఆసక్తిగల అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నాము, అభ్యర్థులు ఏ పార్టీలో వున్నా ఫర్వాలేదు, పార్టీ నుండి ఒక్క రూపాయి కూడా ఆర్థికసహాయం అందదు, జెండాలు, సోనియా, రాహుల్‌ల ఫోటోలు ఉచితంగా అందజేస్తాము, ఆసక్తిగల వారు గాంధీభవన్‌లో ఏ.పి పిసిసి అధ్యక్షుడిని సంప్రదించగలరు అని వుంది.

రఘువీరా ఆ ప్రకటన చదవడం ఆపి... ఇదే ప్రకటనను 2009ఎన్నికల్లో ఇచ్చివుంటే ఈవరకే ఇక్కడ నుండి ఎల్.బి. స్టేడియం వరకు అభ్యర్థులు క్యూకట్టి ఉండేవాళ్ళు. ఇప్పుడు ఒక్కడూ రావడం లేదని వాపోయాడు. అప్పుడు ఆనం రామనారాయణరెడ్డి వుండి... ఈ ప్రకటన చూసి ఎవరూ రారేమో... సీఎంఆర్, చందన బ్రదర్స్‌లలో ఖాతాదారులకు ఆఫర్లు పెట్టినట్లు, మనం కూడా కొన్ని ఆఫర్లు ప్రకటిద్దాం. ఎంపీ సీటు తీసుకుంటే రెండు అసెంబ్లీ సీట్లు ఫ్రీ, అలాగే ఒక అసెంబ్లీ సీటు తీసుకుంటే ఇంకో అసెంబ్లీ సీటు ఫ్రీ అని వన్‌ప్లస్ వన్ ఆఫర్లు పెడతాం... పార్టీ టిక్కెట్ తీసుకునే మహిళా అభ్యర్థులకు కంచిపట్టు చీర, మగాళ్లకయితే పది జతల ఖద్దరు వస్త్రాలు అని పెడతాం... అలాగే కాంగ్రెస్ టిక్కెట్లు తీసుకుని పోటీ చేసిన అభ్యర్థులందరికీ కలిపి ఎన్నికల తర్వాత లక్కీడిప్ నిర్వహిస్తామని ప్రకటిద్దాం... మొదటి విజేతకు ఆడి గారు, రెండో విజేతకు మారుతి డిజైర్ కారు, మూడో విజేతకు హీరో బైక్‌లు బహుమతులుగా ఇద్దాం... అలాగే కన్సోలేషన్ బహుమతి క్రింద పదిమంది విజేతలను ఎంపిక చేసి బ్యాంకాక్, తైవాన్, ఉజ్జెకిస్థాన్‌లకు ఫారిన్‌ట్రిప్ పంపిద్దామన్నాడు. దానికి చిరంజీవి... ఈ ఆఫర్లు బదులు, సినీపరిశ్రమలో చాలామంది వేషాల్లేక ఖాళీగా తిరుగుతున్నారు, వారందరినీ పోటీలో పెడదాం... పార్టీకి సినిమా గ్లామర్ కూడా వస్తుందన్నాడు.

అందుకు కన్నా లక్ష్మీనారాయణ... నీకే గ్లామర్ లేకుండా పోయింది, మెగాస్టార్‌వి.. నిన్ను చూస్తేనే జనాలు ఓట్లేసే పరిస్థితి లేదు. ఇక వేషాల్లేక గాలికి తిరుగుతున్న వాళ్లను పోటీలో పెడితే ఓట్లు పడతాయా... దీనికంటే బెటర్ ఐడియా ఒకటుంది. 1950 నుండి కాంగ్రెస్ టిక్కెట్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి అప్లికేషన్‌లు బయటకు తీద్దాం... వారిలో ఇప్పటి వరకు టిక్కెట్లు రాని వాళ్లను ఎంపిక చేసి సామాజిక సమీకరణలతో అందరికీ న్యాయం చేద్దామని ప్రతిపాదించాడు. దీనికి అందరూ ఒప్పుకున్నారు. వెంటనే రఘువీరారెడ్డి 1950 నుండి అన్ని ఎన్నికలలో టిక్కెట్లకు పెట్టుకున్న అప్లికేషన్ల ఫైళ్లన్నింటిని బయటకు తీసాడు. రఘువీరా, బొత్స, చిరంజీవి, ఆనం రామనారాయణరెడ్డి కలిసి ఒక్కో అప్లికేషన్‌ను పరిశీలించి కులాలవారీగా చూస్తూ ఒక్కో అసెంబ్లీకి అభ్యర్థి పేరును రాస్తూ వచ్చారు. ఇలా 175అసెంబ్లీకు, 25లోక్‌సభ స్థానాలకు అభ్యర్థుల పేర్లను తయారుచేసి టీవీలకు, పత్రికలకు ఇచ్చేసారు.

★★★★★

రఘువీరారెడ్డి సెల్‌ఫోన్ మోగింది. ఆయన ఫోన్ ఎత్తి హలో ఎవరండీ అన్నాడు... అవతల నుండి... స్వర్గలోకపు సత్తెయ్యను మాట్లాడుతున్నాను. నేనిప్పుడు స్వర్గంలో వున్నాను, ఇప్పుడే టీవీలో కాంగ్రెస్ అభ్యర్థుల లిస్టు చూసాను, అందులో నా పేరు కూడా వుంది. నేను బ్రతికి వున్నానో, చచ్చినానో కూడా తెలుసుకోరా? బ్రతికినంతకాలం టిక్కెట్ కోసం మీ పార్టీ ఆఫీసు చుట్టూ తిరగలేక చచ్చాను.

ఇప్పుడేమో చచ్చి స్వర్గానికి చేరాక పార్టీ టిక్కెట్ ఇస్తారా... ఆ టిక్కెట్‌ను మీరే మడిచి... అంటూ అవతల సత్తెయ్య ఆత్మకోపంతో అంది. ఆ ఫోన్‌తో రఘువీరారెడ్డి నిలబడిన వాడు నిలబడ్డట్లే శిలలా ఉండిపోయాడు.

★★★★★

కదంబం

## దుఃఖలిపి

సుంకర గోపాలయ్య
కోట, 9492638547

గుండెల్లో మొదలైన బాధ, సుళ్ళు తిరుగుతూ
కనురెప్పల పొర్లు కట్టలు దాటి
దుఃఖ జలపాతం అవుతుంది
కొబ్బరికాయ కొడితే నీళ్ళొచ్చినట్టు
గుండె పగిలితే కన్నీరే
దుఃఖ సాగరపు అలలు కన్నీళ్ళు
కళ్ళు కాయలు కాస్తాయంటారుగానీ
పూలు మాత్రం పూస్తాయ్
దుఃఖిస్తున్న కంటి నుండి రాలుతున్న
అశ్రువులన్నీ పూలే కదా!
మనసుకు ఊరటైతే ఆనంద భాష్పపుమాల
మెడలో వేసుకుంటాం
మనసులో ముల్లు గుచ్చుకున్నప్పుడు
దుఃఖాశ్రువుల మాల అల్లుతుంటాం
దుఃఖపు మొలకలు కన్నీళ్ళు
దుఃఖానికి భయపడితే
కన్నీటి చెరువులో ముంచేస్తుంది
దుఃఖానికి సానపెడితే
ఓటమి కుత్తుకలు తెగ్గోస్తుంది
కొందరి కన్నీళ్ళు
బుగ్గల బండలపై బడి
కొందరి కన్నీల్ళు
బుగ్గల టర్బైన్‌ల పైబడి
విద్యుత్ ప్రకంపనలు పుట్టిస్తాయ్!
రాయి రాయి రాపాడిస్తే, నిప్పు పుట్టినట్టు
రెండు కన్నీటి చుక్కల రాపిడి
వజ్రపు కొంతై మెరుస్తుంది
ఒక సామూహిక దుఃఖం
ఉద్యమానికి ఊపిరి
దుఃఖస్తన్యం కన్నీళ్ళు
కన్నీటి చుక్కలే దుఃఖలిపి

## ఘనంగా గుర్రాల రమణయ్య స్మారక పురస్కారాల ప్రదానం



సభలో మాట్లాడుతున్న గుర్రాల రమణయ్య

నెల్లూరు దర్గామిట్ట సరస్వతి నగర్‌లోని ఐఎంఏ హాలులో ఈనెల 13న జి.ఆర్.ట్రస్ట్ ఆధ్వర్యంలో గుర్రాల రమణమ్మ స్మారక సాహితీ పురస్కారాల సభ ఘనంగా జరిగింది. సభాధ్యక్షులు గుర్రాల రమణయ్య మాట్లాడుతూ కీర్తిశేషులైన తన భార్య గుర్రాల రమణమ్మ లేని జీవితంలోని విషాదాన్నికవితారూపంలో వ్యక్తీకరించారు. తదుపరి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కవులను యద్ధల లలిత వేదికపైకి ఆహ్వానించారు. కవులు తూములూరి రాజేంద్రప్రసాద్, ఊసల రజనీగంగాధర్, ఎన్.వి.రఘువీరాప్రతాప్, కనుమూరి లావణ్య, కరేటి అమరజీవి, బి.వి.వినోద్‌కుమార్‌లకు బె.గో.రె అవార్డు కమిటీ కార్యదర్శి బి.వి.నరసింహం, డాక్టర్ గుర్రాల మురళీధర్, పాతూరి అన్నపూర్ణ, కొండమూరు వెంకటేశ్వర్లు గుర్రాల రమణమ్మ స్మారక పురస్కారాలను ప్రధానం చేసారు. ఈ సందర్భంగా కనుమూరి లావణ్య ఆధ్వర్యంలో స్కూలు పిల్లలు ప్రదర్శించిన ఆటపాటలు ప్రేక్షకుల్ని అలరించాయి. రావూరి శారద కవితాగానంతో వందన సమర్పణ చేసారు.

## వేసవిలో "శుభప్రదం"

టిటిడి హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో విద్యార్థులకు శుభప్రదం వేసవి శిక్షణా శిబిరాన్ని మే 19 నుంచి 25 వరకు నిర్వహిస్తామని టీటీడీ ధర్మ ప్రచార మండలి జిల్లా అధ్యక్షుడు పీవీ సుబ్రహ్మణ్యం ఈనెల 12న తెలిపారు. భారతీయ సనాతన ధర్మం–మానవీయ నైతిక విలువలను పెంపొందించేందుకు హిందూ ధర్మం, సంప్రదాయాలపై విశ్వాసం కలిగి వుండి ఈ సంవత్సరం 8,9,10తరగతుల పరీక్షలు రాసిన విద్యార్థులకు వేసవిలో ఈ శిక్షణను ఉచితంగా ఇస్తున్నట్లు తెలిపారు. కాకుటూరులోని కృష్ణచైతన్య కళాశాలలో ఈ శిక్షణా కార్యక్రమం వుంటుందని తెలిపారు. ప్రతిరోజూ సాయంత్రం 5 నుంచి రాత్రి 7గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. నెల్లూరులోని టీటీడీ కల్యాణ మండపంలో దరఖాస్తులు తీసుకొని పూర్తిచేసి ఈనెల 25వతేదీలోపు అందించాలని పేర్కొన్నారు. టీటీడీ ద్వారా విద్యార్థులకు వారం రోజుల పాటు ఉచిత భోజన, వసతి సదుపాయాలను ఏర్పాటుచేస్తామన్నారు. ఛార్జీలకు 300/–రూ॥ల అందిస్తామని తెలిపారు.

వివరాలకు 90308 50336నెంబరులో ధర్మప్రచారపరిషత్ నెల్లూరు జిల్లా శాఖ ప్రోగ్రాం అసిస్టెంట్ హరనాథ్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ధర్మ ప్రచార మండలి జిల్లాశాఖ ఉపాధ్యక్షుడు కొండా శేఖర్‌రెడ్డి, కార్యదర్శి వంజివాక ధనుంజయ, కోఆర్డినేటర్ మల్లెల శ్రీహరి, సభ్యులు నాగార్జునాచారి, గిరిజ, దుర్గాప్రసాద్, సనత్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కథ–2013 ఆవిష్కరణ

నెల్లూరు ట్రంకురోడ్డులోని టివిఎస్ కళ్యాణ్ సదన్‌లో ఈనెల 13న కథ–2013ను ప్రభవ నిర్వాహకులు, ప్రముఖ రచయిత్రి చంద్రలత అధ్యక్షతన జరిగిన సభలో ప్రసిద్ధ కథారచయితలు, కవుల సమక్షంలో ఆవిష్కరించారు. 2013 సంవత్సరంలో రాష్ట్రంలోని వివిధ పత్రికలలో ప్రచురితమైన కథలలో మేలిమి గుణాలున్న వివిధ కథారచయితల 14కథలను ఎంపికచేసి గుదిగుచ్చిన కథాసంపుటి కథ–2013. ప్రతి ఏటా ప్రఖ్యాత రచయితలు పాపినేని శివశంకర్, వాసిరెడ్డి నవీన్‌ల సంపాదకత్వంలో వెలువడే ఈ కథావార్షిక ఈ ఏడు నెల్లూరులో ఆవిష్కరించడం ఎంతో సంతోషాన్ని కలిగించింది. కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రముఖ కథారచయితలు, రచయిత్రులు పాల్గొన్నారు. ప్రముఖ కవి కె.శివారెడ్డి, ప్రసిద్ధ కథారచయితలు శ్రీ రమణ, చంద్రశేఖర్‌రావు, అరసం కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ, వి.ప్రతిమ తదితరులు కథ–2013ను ఆవిష్కరించారు. మధ్యాహ్నం ప్రభవ పాఠశాలలో కథారచయితలతో ఇష్టాగోష్టి జరిగింది. ఇందులో కథా రచయితలు ఉమామహేశ్వరరావు సత్యవతి, భగవ్‌తం, విమల, రమేష్, సింధుమాధురి, మధురాంతకం నరేంద్రలు కథల ఇతివృత్తాలు, రచనా నేపథ్యాల గురించి తెలిపారు. కార్యక్రమంలో కథారచయితలు, కవులు ఈతకోట సుబ్బారావు మంత్రి కృష్ణమోహన్, నన్నపనేని రవి, దగ్గుమాట ప్రభాకర్, ఏటూరి నాగేంద్రరావు, వంజవాక సతీష్‌కుమార్, జి.సుభద్రాదేవి, పాతూరి అన్నపూర్ణ, గంగిశెట్టి శివకుమార్, చిన్ని నారాయణరావు, బొగ్గరపు రాధాకృష్ణ, వాయుగండ్ల శశికళ, నరేంద్ర, శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.

## వాకాడు సిఐగా కరుణాకర్

సిసియస్ ఇన్స్‌పెక్టర్‌గా వున్న పి.కరుణాకర్‌ను వాకాడు సిఐగా నియమిస్తూ గుంటూరురేంజి ఐజి పి.వి.సునీల్‌కుమార్ ఉత్తర్వులు జారీచేసారు. ఎన్నికల ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారని అక్రమంగా నిర్భందించిన కేసులో వాకాడు సిఐ చెంచు రామారావును మంగళవారం సస్పెండ్ చేయడం జరిగింది. ఆయన స్థానంలో కరుణాకర్‌ను నియమించారు.

## టిక్కెట్ మారలేదు!

(2వపేజీ తరువాయి)

అభ్యర్థి వ్యక్తిత్వానికి ఎక్కువ ప్రాధాన్యతనిచ్చాడు. ఇక్కడ మొదట చేరిన నెలవల సుబ్రహ్మణ్యంను పక్కనపెట్టేసి మంచిపేరున్న కిలివేటి సంజీవయ్యను ఖరారు చేసారు. గూడూరు ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గాన్ని అనుకున్నట్లే పాశం సునీల్‌కుమార్‌కు కేటాయించారు.

వైకాపా టిక్కెట్లపై ఎక్కడా గందరగోళం లేదు. అసమ్మతి, అసంతృప్తులు లేవు. ప్రశాంతంగా పనిచేసుకుపోయేలా టిక్కెట్ల కేటాయింపు జరిగింది.

# కూలిన కాపురం

సీమాంధ్రలో తెలుగుదేశం-బీజేపీల పొత్తు బెడిసికొట్టింది. ఇరుపార్టీల మధ్య అయిష్టంగానే కుదిరిన ఈ పొత్తుకు నామినేషన్ల పర్వం పూర్తికాకముందే గండి పడింది. సీమాంధ్రలో బీజేపీకి కేటాయించిన సీట్లలో బలహీనమైన అభ్యర్థులను దించిందని, దీనివల్ల ప్రత్యర్థులు బలపడే అవకాశముందని గురువారం గజపతి నగరంలో తెలుగుదేశం అధినేత బహిరంగంగానే ప్రకటించారు. దీంతో పొత్తుకు తెరపడినట్లేననే విషయం అర్థమైపోయింది. బీజేపీకి కేటాయించిన 14అసెంబ్లీ స్థానాలతో పాటు 4లోక్‌సభ స్థానాల్లో కూడా తెలుగుదేశం అభ్యర్థులను రంగంలోకి దించేందుకు సన్నద్ధమయ్యారు. సీమాంధ్రలో బీజేపీతో పొత్తును తెలుగుదేశం నాయకులు తీవ్రంగా వ్యతిరేకించారు. బీజేపీతో పొత్తు పెట్టుకున్నాక ఆ పార్టీకి కోల్పోయిన పలు స్థానాలలో టీడీపీ కార్యకర్తలు పెద్దఎత్తున ఆందోళనలు కూడా చేపట్టారు. అయినా కూడా మొన్నటివరకు మొండిగా వ్యవహరించిన చంద్రబాబు ఒక్కసారిగా మనసు మార్చుకుని బీజేపీతో తెగదెంపులకు సిద్ధపడ్డాడు. బీజేపీతో పొత్తుపై చంద్రబాబు ప్రకటన చేసిన వెంటనే బీజేపీ జాతీయనేత ప్రకాష్ జవదేకర్ హుటాహుటిన హైదరాబాద్ బయలుదేరి వచ్చారు. బీజేపీకి కేటాయించిన అన్ని సీట్లలో టీడీపీ అభ్యర్థులను నిలబెడితే సీమాంధ్రలోని 175శాసనసభ స్థానాలు, 25లోక్‌సభ స్థానాలలో అభ్యర్థులను నిలబెట్టడానికి ఆ పార్టీ సిద్ధమైంది. ఈ మేరకు గురువారం రాత్రి అసెంబ్లీల వారీగా అభ్యర్థులను గుర్తించారు. బీజేపీతో చంద్రబాబు కటీఫ్ చేసుకోవడం వెనుక పురంధేశ్వరి కూడా ఒక కారణంగా కనిపిస్తుంది. బీజేపీలో చేరిన ఆమెకు సీటు ఇవ్వకూడదనే కండీషన్ మీద చంద్రబాబు పొత్తు పెట్టుకున్నట్లు వినికిడి. అందుకే ఆమె పోటీ చేస్తుందని భావించిన ఒంగోలు, విజయవాడ సీట్లను బీజేపీకి వదలకుండా టీడీపీ అభ్యర్థులను నిలబెట్టారు. అయితే బీజేపీకి వదిలిన రాజంపేట సీటు నుండి పురంధేశ్వరిని నిలబెట్టడం చంద్రబాబుకు కోపం తెప్పించిందని, అందుకే బీజేపీతో తెగదెంపులు చేసుకున్నారని, అది చెప్పలేక బలహీనమైన అభ్యర్థులను సాకుగా చూపుతున్నాడని సమాచారం. బలహీనమైన అభ్యర్థులంటే ఆర్థికంగా బలహీనులనా? లేక రాజకీయంగా బలహీనులనా? అనే విషయం అర్థంకాక బీజేపీ నాయకులు బుర్రలు గోక్కుంటున్నారు. తెలంగాణలో నామినేషన్లు ముగిసాక చంద్రబాబు ఇలా చేయడంతో బీజేపీ నాయకులు షాక్‌కు గురయ్యారు. తెలంగాణ బీజేపీ అధ్యక్షులు కిషన్‌రెడ్డి అయితే తెలుగుదేశంతో పొత్తును తీవ్రంగా వ్యతిరేకించారు. కాని ఆయన మాటను పార్టీ జాతీయ నేతలు లెక్క చేయకుండా పొత్తు కుదిర్చారు. ఇప్పుడు వాళ్లంతా కూడా చంద్రబాబును నమ్ముద్దంటే మా మాట వినకుండా నమ్మి మోసపోయారని, తెలంగాణలో బీజేపీ సహకారంతో పోటీ చేసి సీమాంధ్రలో మాకు హ్యాండిచ్చాడని, యేరు దాటాక తెప్పతెగలేసే తన బుద్ధిని చంద్రబాబు పోనిచ్చుకోలేదని వారంటున్నారు.

# మాపై కోపం బిడ్డలపై చూపొద్దు

**ఆనం వివేకా**

ఆదివారం నెల్లూరులోని అనిల్ గార్డెన్స్‌లో నెల్లూరు నగరం, రూరల్ కాంగ్రెస్ అభ్యర్థులు ఆనం చెంచు సుబ్బారెడ్డి, ఆనం విజయకుమార్‌రెడ్డిల పరిచయ సమావేశం జరిగింది. డాక్టర్లు, లాయర్లు, ప్రైవేట్ విద్యాసంస్థల యజమానులు, వ్యాపారులు, మేధావులను ఈ సమావేశానికి ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఆనం వివేకా స్వయంగా పిలవడంతో చాలామందే ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆనం విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఆనం కుటుంబానికి నెల్లూరు ప్రజలకు ఆరు దశాబ్దాల అనుబంధముందని, ఈ సంబంధాన్ని ఎవరూ విడదీయలేరన్నారు. తమ సహకారం పొందిన ఎంతో మంది ఈరోజు పార్టీని విడిచి వెళ్లారని, కాని ప్రజలు మాత్రం తమతోనే ఉన్నారని, తమ కుటుంబానికి మరోసారి అవకాశమిచ్చి నెల్లూరు ప్రజలకు సేవచేసుకునే భాగ్యం కల్పించాలని కోరారు. ఏ.సి.సుబ్బారెడ్డి ఈ సమావేశంలో ఎంతో వినయంగా అందరి సహకారాన్ని అభ్యర్థించారు. చివరలో ఆనం వివేకానందరెడ్డి మాట్లాడారు. తాము అన్నీ మంచి పనులే చేయలేదని, కొన్ని తప్పులు కూడా చేసామని, వాటిని దృష్టిలో పెట్టుకోవద్దని కోరారు. తమ తప్పులకు తమ బిడ్డలను శాపగ్రస్తులను చేయొద్దని కోరారు.

***తుదిశ్వాస వరకు ప్రజాసేవలోనే...***

తన వ్యక్తిగత జీవితం తన రాజకీయ జీవితం రెండూ ఒకే క్షణంలో ముగుస్తాయని నెల్లూరురూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నెల్లూరులోని తన కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన రాజకీయ జీవితానికి శుభంకార్డు తప్పితే విశ్రాంతికార్డు లేదన్నారు. శుభంకార్డు పడేది దేవుడి చేతుల్లో వుందన్నారు. తుదిశ్వాస విడిచేవరకు ప్రజాసేవలోనే ప్రజాజీవనంలోనే ఉంటానన్నారు.

60ఏళ్ళు దాటినవాళ్లు పోటీ నుండి తప్పుకుని యువతరానికి అవకాశం కల్పించాలని గతంలో నేనే చెప్పానని, ఆ మాటకు కట్టు బడే ఇప్పుడు ఎన్నికలలో పోటీ చేయడం లేదన్నారు. ఈ ఎన్నికల్లో నెల్లూరురూరల్, నెల్లూరు నగరం నియోజకవర్గాల నుండి కాంగ్రెస్ అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారని, వారిని గెలిపించాలని ఆయన కోరారు.




● **అన్నదాతల కన్నెర్ర**

# కరెంట్ కోతలపై మండిన గుండెలు

వేళాపాళా లేని కరెంట్ కోతలతో రైతుల కడుపు మండింది. గుండె రగిలింది. ఈ కరెంట్ కష్టాలు ఏంటంటూ జనం ఏకమై సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. ఈ సంఘటన ఈ నెల 15న ఆత్మకూరులోని నెల్లూరుపాళెం సబ్‌స్టేషన్ వద్ద చోటుచేసుకుంది. వేళాపాళా లేని విద్యుత్ కోతలతో నానా అగచాట్లు పడుతున్నామని ఆ ప్రాంత రైతులు, ప్రజలు నెల్లూరుపాళెంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ముందు ధర్నాకు దిగారు. కరెంటు సక్రమంగా లేక తాగునీటికి, సాగునీటికి నానా తంటాలు పడుతున్నామని వాపోయారు. కరెంట్ లేక పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆగ్రహం వ్యక్తం చేసారు. రోజుకు 7గంటలు బదులు 5గంటలే ఇస్తున్నారని, అది కూడా సక్రమంగా ఇవ్వకపోతుండడంతో పొలాల్లో పడిగాపులు కాయాల్సి వస్తుందన్నారు. ఇప్పటికైనా సక్రమంగా విద్యుత్‌ను సరఫరా చేయకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విద్యుత్‌శాఖ ఏడి బాలాజీనాయక్, ఏఇ రామ్మోహన్‌రెడ్డిలు సబ్‌స్టేషన్‌కు చేరుకుని రైతులకు సర్దిచెప్పారు.

# శాపగ్రస్థుడిలా..

(మొదటిపేజీ తరువాయి)

పార్టీ ప్రతిపక్షంలో వున్న పదేళ్లు కూడా ఆయన క్రమశిక్షణగల సైనికుడిలానే పనిచేసారు. అధికారం లేకపోయినా ఆయనెప్పుడూ పార్టీ మారే ఆలోచన చేయలేదు. పార్టీ కోసం ఇంత కష్టపడ్డా కూడా కోరుకున్న సీటును దక్కించుకోలేని శక్తి హీనుడిగా మిగిలిపోయాడు తెలుగుదేశంపార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి.

1991లో తెలుగుదేశంలో అడుగుపెట్టిన సోమిరెడ్డి, అనతికాలంలోనే ఆ పార్టీలో ముఖ్యనాయకుడిగా ఎదిగారు. 1994, 1999లలో సర్వేపల్లి నుండి వరుసగా గెలిచారు. 2004, 2009ఎన్నికల్లో స్వయంకృతాపరాధం చేత అక్కడ నుండే ఓడిపోయారు. రెండేళ్ల క్రితం జరిగిన కోవూరు ఉపఎన్నికల్లోనూ ఆయన టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి పరాజయం పొందారు. పార్టీలో పార్టీ కోసం చంద్రబాబు కంటే ఎక్కువే కష్టపడ్డారు. జగన్‌ను విమర్శించడంలో పార్టీలో అందరికన్నా తానే మిన్న అనిపించుకున్నాడు. వరుసగా మూడు పరాజయాలు చవిచూడడంతో ఇక సర్వేపల్లి నుండి పోటీ చేయకూడదనుకున్న ఆయన నెల్లూరురూరల్ సీటుపై మనసుపడ్డారు. ఇక్కడ నుండే పోటీ చేస్తానని ముందుగానే చంద్రబాబుకు సంకేతాలు పంపారు. లోక్‌సభ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి కూడా సోమిరెడ్డి అభ్యర్థిత్వంవైపే మొగ్గుచూపారు. అయితే తానొకటి తలిస్తే దైవమొకటి తలచినట్లు టీడీపీ, బీజేపీ పొత్తులో చంద్రబాబు ఈ సీటును బీజేపీకిచ్చారు. వాస్తవంగా ఇక్కడ బీజేపీకి బలమేమీ లేదు. కేవలం సోమిరెడ్డికి చెక్ పెట్టడానికే ఈ సీటు బీజేపీకిచ్చినట్లుగా వుంది. రూరల్ సీటును బీజేపీకిచ్చారని తెలిసి సోమిరెడ్డి షాక్‌కు గురయ్యారు. జిల్లాలోని తెలుగుదేశం శ్రేణులు డీలా పడ్డాయి. పార్టీ కేడర్ బలంగా వున్న సీటును బీజేపీకివ్వాల్సిన అవసరమేమొచ్చిందని కార్యకర్తలు ఆగ్రహావేశాలు వ్యక్తం చేసారు. నెల్లూరురూరల్ సీటును సోమిరెడ్డికి ఇప్పించడానికి పలువురు నాయకులు పలు విధాలా ప్రయత్నించారు. బీజేపీ నాయకులకు నచ్చచెప్ప చూసారు. అయినా బీజేపీ వాళ్లు తగ్గలేదు. చంద్రబాబు కూడా సోమిరెడ్డి సీటు విషయాన్ని సీరియస్‌గా తీసుకోలేదు. సర్వేపల్లి నుండి పోటీ చేస్తే చెయ్, లేకుంటే మానుకోమన్నట్లు ఉండిపోయాడు. సోమిరెడ్డి తీవ్ర మనస్థాపం చెందినా చంద్రబాబు కరగలేదు. చివరకు సోమిరెడ్డే అలకవీడి సర్వేపల్లి నుండి పోటీ చేయడానికి ఒప్పుకున్నాడు. సీమాంధ్రలో టీడీపీ-బీజేపీ పొత్తు తెగుతుందనే ప్రచారం 17వ తేదీ జోరుగాసాగింది. ఇదే జరిగితే సోమిరెడ్డి కోరుకున్న నెల్లూరు రూరల్ దక్కే అవకాశముంది. లేదంటే సర్వేపల్లి తప్పదు. ఏదేమైనా పూలమ్మిన చోట కట్టెలమ్ముడమంటే ఇదేనేమో! ఒకప్పుడు జిల్లాలో పార్టీకి ఆయనే పెద్ద దిక్కయ్యాడు. ఈరోజు పార్టీలో ఆయనకే దిక్కులేకుండా పోయింది.

# అట్టర్‌ఫ్లాప్‌షో

(మొదటిపేజీ తరువాయి)

కిరణ్ సొంత పార్టీతో ఏదో విరగదీస్తాడనుకుంటే సీపీఐ, బిఎస్పీ వంటి పార్టీలకంటే జైసమైక్యాంధ్ర పార్టీ పరిస్థితి అధ్వాన్నంగా మారింది. రాష్ట్రంలో ఆ పార్టీ గెలుస్తుందని చెప్పగల సీటు ఒక్కటీ లేదు. ఆఖరకు కిరణ్ సొంత నియోజకవర్గమైన పీలేరులో కూడా గ్యారంటీ లేదు. మొదట కిరణ్ వెంట వెళదామనుకున్న నాయకులు ఆ తర్వాత ఆయనపై నమ్మకం లేక కాంగ్రెస్‌లోనే సర్దుకున్నారు. ఇంకొందరు కిరణ్ సన్నిహితులు కూడా ఆయన పార్టీలో చేరకుండా తెలుగుదేశంలోనో, వైసిపిలోనో చేరారు. కిరణ్ పార్టీలో చేరిన కొందరు నాయకులు వెంటనే తిరుగుటపా కట్టారు.

సొంతంగా పార్టీ పెట్టడమంటే ప్రైవేట్ కంపెనీని పెట్టి ఏసి ఆఫీసులో కూర్చోవడం కాదు. పార్టీ నాయకుడిలో దానిని నడపగల సత్తా ఉండాలి. కిరణ్‌లో అది లోపించింది. రాష్ట్ర విభజనకు వ్యతిరేకంగా కిరణ్ పోరాడాడు. ఎక్కడా...? పత్రికా సమావేశాలు పెట్టి అధిష్టానం మీద. పార్లమెంటులో విభజన బిల్లు ఆమోదం పొందాక కూడా సీఎం పదవికి రాజీనామా చేయడానికి మీనమేషాలు లెక్కిస్తూ కూర్చున్నాడు. సిడబ్ల్యుసిలో విభజన నిర్ణయం తీసుకున్న వెంటనే ఆయన సీఎం పదవికి రాజీనామా చేసుండాలి. కేంద్రప్రభుత్వ విభజన నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ప్రజల మధ్యకు పోయి ఉండాలి. ప్రజాదరణ తెచ్చుకుని ఉండాలి. అప్పుడు సొంత పార్టీ పెడితే ఉపయోగముండేదేమో!

# మహా సంగ్రామమే!

(మొదటిపేజీ తరువాయి)

కాంగ్రెస్‌పార్టీ పరిస్థితి మాత్రం ఈ ఎన్నికల్లో చాలా దయనీయంగానే కనిపించింది. రాష్ట్ర విభజన నేపథ్యంలో కాంగ్రెస్‌పార్టీని ప్రజలు గొంగలిపురుగు కంటే ఎక్కువగా చీదరించుకుంటున్నారు. టిక్కెట్లిస్తాం, పోటీ చేయండంటే మాకొద్దు మీ టిక్కెట్లంటూ నాయకులు పరుగులు తీసారు. జిల్లాలో ఆత్మకూరు నుండి పోటీ చేస్తున్న ఆనం రామనారాయణరెడ్డి తప్పితే సీనియర్ నాయకులెవరూ లేరు. గూడూరు అభ్యర్థి పనబాక కృష్ణయ్యకు మాత్రం ఇవి రెండో ఎన్నికలు. లోక్‌సభ అభ్యర్థి వాకాటి నారాయణరెడ్డితో సహా మిగిలిన 8అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులకు ఇవి తొలి ఎన్నికలే! నెల్లూరుజిల్లా ఫలితాలను బట్టే రాష్ట్ర రాజకీయాలుంటాయి. ఇక్కడ వచ్చే ఫలితాలే రాష్ట్ర వ్యాప్తంగా వస్తాయి. ఇక్కడ జనాదరణ పొందిన పార్టీయే రాష్ట్రంలో అధికారంలోకి రాగలుగుతుంది. జిల్లా ఎన్నికల కురుక్షేత్రంపై రాష్ట్ర వ్యాప్తంగా అందరికీ ఆసక్తి ఉంటుంది.

# సూపర్‌హిట్

(మొదటిపేజీ తరువాయి)

ఇప్పుడు ఆయన రాజకీయ వారసుడిగా వచ్చిన జగన్ కూడా అదే పని చేసాడు. సీమాంధ్రలోని 170అసెంబ్లీలకు, 24 పార్లమెంట్ స్థానాలకు ఒకే విడతలో అభ్యర్థులను ప్రకటించేసాడు. ఒక లోక్‌సభ, 5అసెంబ్లీ స్థానాలను మాత్రమే సామాజిక సమీకరణల నేపథ్యంలో పెండింగ్‌లో పెట్టాడు. జగన్ ఒకేసారి ఇన్ని సీట్లు ప్రకటించినా ఎక్కడా గొడవలు లేవు. దీనికి కారణం పార్టీ మొదటి నుండి పనిచేస్తున్న వారికి సీట్లు ఇవ్వడమే!

## రాశి - మీ వాసి



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

తేది. 18.04.2014 నుండి తేది. 24.04.2014 వరకు

ఈ వారం మేషంలో రవిబుధకేతువులు, మిథునంలో గురువు, కన్యలో కుజుడు, తులలో శనిరాహువు వృశ్చికధనుర్మక కుంభరాశులలో చంద్రుడు, కుంభంలో శుక్రుడు సంచరిస్తారు.

**పంచాంగము:**

**ముహూర్తము:** తేది 18 శుక్రవారం ఉదయం గం॥ 9.10ని॥ల నుండి 10గంటల 30ని॥లలోగా వివాహ, గృహారంభ, వాణ్యిపార ఉపనయ నాదులకు మిథునలగ్నము.

తేది 24 గురువారము ఉదయం గం॥8.45ని॥ల నుండి గం॥10.52 ని॥లలోగా గృహారంభ, వ్యాపార, ఉపనయన వివాహాలకు మిథునలగ్నము.

**చైత్ర మాస కృష్ణపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 18 | శుక్ర | తదియ | ఉ॥గం.10.50వ॥ |
| తేది. 19 | శని | చతుర్థి | ఉ॥గం.9.05వ॥ |
| తేది. 20 | ఆది | పంచమి | ఉ॥గం.7.22వ॥ |
| | | షష్ఠి | రా॥గం.5.16వ॥ |
| తేది. 21 | సోమ | సప్తమి | రా॥గం.2.56వ॥ |
| తేది. 22 | మంగళ | అష్టమి | రా॥గం.12.30వ॥ |
| తేది. 23 | బుధ | నవమి | రా॥గం.9.53వ॥ |
| తేది. 24 | గురు | దశమి | రా॥గం.7.38వ॥ |


### మేషం



అశ్విని, భరణి, కృత్తిక 1 పాదము

అవసరాలకు ఋణాలు చేయవలసిరావచ్చును. ఇంటా బయట వ్యవహారాలు చికాకు కలిగిస్తాయి. విలువైన వస్తువులు పత్రాలు జాగ్రత్త పరచుకొనండి. ఉద్యోగ ప్రయత్నాలలో అవకాశాలు లభించగలవు. ఖర్చులు పెరిగి ఆందోళన ఎక్కువగా ఉంటుంది. ఆదాయ వ్యయాలకు పొంతన ఉండదు. వ్యాపార అవకాశాలు వెనుకబడగలవు. పెద్దలతో పరిచయాలు బలపడతాయి.

### వృషభం



కృత్తిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశిర్ష1,2పాదాలు

అయితే చెల్లింపులు పన్నులకై డబ్బు వ్యయము కాగలదు. ఉద్యోగ బాధ్యతలలో ఏకాగ్రత ముఖ్యము. క్రొత్త పెట్టుబడులకు అవకాశాలు, భాగస్వామ్య వ్యాపార అవకాశాలు దొరుకుతాయి. ఈ రాశి వారికి సంపాదన బాగుండినా శ్రమ అసంతృప్తి ఎక్కువగా ఉంటుంది. శుభకార్యాలలో పాల్గొనడం దైవకార్యాలలో ప్రముఖంగా పాల్గొని సహాయపడటం జరుగుతుంది.

### మిథునం



మృగశిర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

కమిటీలు, సమావేశాలలో మీ సూచనలకు సమర్థన బాగుంటుంది. ఉద్యోగులకు ప్రయాణాలు అదనపు బాధ్యతలు తప్పవు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగి ఆదాయం పెరుగుతుంది. దైవకార్యాలకు మంచి పనులకు వితరణ ప్రదర్శిస్తారు. స్థిరాస్తుల లావాదేవీలపై శ్రద్ధ చూపుతారు. నిరుద్యోగులకు అవకాశాలు దొరకగలవు. శుభకార్య నిర్ణయాలు జరుగవచ్చును.

### కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

శుభకార్య ప్రయత్నాలు ఫలిస్తాయి. ఆత్మీయులతో సంప్రదింపులుంటాయి. శుభకార్యాలలో పాల్గొనడం, దూరప్రయాణాలు చేయడం, బంధుమిత్రులకు సహాయ పడటం జరుగుతుంది. వృత్తి ఉపాధిరంగాలలో స్థిరపడ తారు. వ్యాపారవర్గాలకు అవకాశాలు బాగుండి ఆదా యము పెరుగుతుంది. వృత్తి జీవనంలో అవకాశాలు బాగుండి సంపాదన పెరుగుతుంది.

### సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

ఆదాయానికి లోపం లేకపోయినా అదనపు ఖర్చులు తప్పవు. శుభకార్యాలలో పాల్గొంటారు. దూరప్రయాణాలు జరుగగలవు. అనుకున్న పనులు సక్రమంగా జరుగు తాయి. ప్రభుత్వ అనుమతులు ప్రభుత్వము నుండి చెల్లింపులు ఆలస్యంకాగలవు. బంధువర్గ ముఖ్యులకు సంబంధించిన అనారోగ్య వార్తలు వింటారు. వ్యాపార వర్గాలకు మంచి ఆర్థికావకాశాలు వాయిదాపడతాయి. కుటుంబసౌఖ్యం బాగుంటుంది.

### కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

బంధువర్గం నుండి అనారోగ్య వార్తలు వింటారు. స్త్రీలకు అనారోగ్య బాధలుంటాయి. వస్తు వాహన రిపేర్లుండగలవు. కోపం పట్టుదల తగ్గించుకొని అందరితో సర్దుబాటు చేసుకొనిపోవడం మంచిది. సభలు సమా వేశాలలో మీ సూచనలు సలహాలకు గుర్తింపు లభిస్తుంది. వృత్తి వ్యాపారాలలో వ్యాపకం పెరిగి ఆదాయము బాగుంటుంది. జలుబు శ్వాసకోశ బాధలు ఉండగలవు.

### తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

వ్యాపారవర్గాలకు అవకాశాలు తప్పిపోవచ్చును. శుభకార్యములకై ఖర్చులు, ప్రయాణ ఖర్చులుండినా ఇబ్బందిపడరు. ఆర్థిక విషయాలలో నిర్ణయాలు తీసుకొనే టప్పుడు జాగ్రత్తపడండి. వృత్తిపరంగా ప్రాబల్యం బాగుండి అవకాశాలు దొరికి ఆదాయం పెరుగుతుంది. బాకీలు వసూళ్ళు, ఇతర సాంఘిక వ్యవహారాలలో లౌక్యంగా ఉండి జాగ్రత్తపడాలి.

### వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

అందుకని అధికారులతో, పబ్లిక్‌తో జాగ్రత్తగా ఉండండి. యాజమాన్యాలకు వర్కర్లతో సమస్యలుండ గలవు. రావలసిన బాకీల పై హామీలు, కోర్టు వ్యవహా రాలలో అనుకూలత ఉంటుంది. ఆదాయ వ్యయాలు సరిపోతుంటాయి. వృత్తి వ్యాపార రంగాల వారికి అభివృద్ధి రాబడి బాగుంటుంది. స్థిరాస్తుల వ్యవహారాలు మధ్యవర్తుల ద్వారా సర్దుబాటు చేసుకొనడం మంచిది.

### ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

విలువైన వస్తువులు, వస్త్రాభరణాలు సమకూర్చు కొంటారు. శుభకార్యాలలో పాల్గొంటారు. ఉద్యోగులకు అదనపు బాధ్యతలు పెరుగుట చేపట్టిన పనులందు ముందుకు సాగుతాయి. ప్రజాదరణ రాజకీయ పలుకుబడి బాగుంటుంది. ఆర్థిక లావాదేవీలందు ప్రతిభ చూపు తారు. వృత్తి వ్యాపారాలు ప్రగతి పథంలో సాగి, ఆదాయం పెరుగుతుంది. విమర్శించిన వాళ్ళే మీ వైపుకు చేరతారు.

### మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

శుభకార్య నిర్ణయాలు జరగడం, శుభకార్యములలో పాల్గొనడం జరుగుతుంది. సోదరుల వల్ల సమస్యలుండ వచ్చును. ఆర్థికాభివృద్ధికి కొత్త ఆలోచనలు, ప్రణాళికలు రూపొందిస్తారు. అనుకున్న పనులు పూర్తి చేయడానికి డబ్బు పలుకుబడి ఉపయోగిస్తారు. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి పెరిగి ఆదాయం పెరుగుతుంది. బిడ్డలు, బంధువుల వల్ల కొంత ఇబ్బందిపడతారు.

### కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

క్రొత్త పెట్టుబడులకు, వ్యాపార ప్రారంభాలకు ప్రయత్నాలు చేస్తారు. విలువైన వస్తువులు, వాహనాలు, వస్త్రాభరణాలు సమకూర్చుకొంటారు. స్థిరాస్తుల లావాదేవీలు ప్రక్కనపెట్టండి. వాహనాలు నడిపేవారు కరెంటు పనులు, యంత్రాల పనులు చేసేవారు మెల కువగా ఉండండి. వృత్తిపరంగా ప్రాపకం బాగుండి ఆదాయం బాగుంటుంది.

### మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

సంతాన విషయంలో శుభపరిణామాలుంటాయి. అధికారులకు పర్యటనలు, తనిఖీలు ఎక్కువగా ఉంటాయి. ప్రభుత్వ అనుమతులు, రావలసిన బాకీలు ఆలస్యం కాగలవు. ఆరోగ్యం కాపాడుకొనండి. అనుకున్న పనులను పట్టుదలతో నెరవేరుస్తారు. వృత్తి వ్యాపారాల విస్తరణ, ఆదాయవృద్ధి ఉంటుంది. కొత్త పెట్టుబడులు, కొత్త వ్యాపారులకు అనుకూలత ఉంటుంది.

# నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ఎన్నికల నిబంధనలు అనుసరించి ఎన్నికలలో పోటీ చేయు అభ్యర్థులు ప్రచారానికి సంబంధించిన ఖర్చులపై ఎప్పటికప్పుడు సమగ్ర తనిఖీలు నిర్వహిం చాలని ఎన్నికల పరిశీలకులు హేమంత్ బిజయ్‌మహంత్ పేర్కొన్నారు.

సోమవారం స్థానిక గోల్డెన్ జూబ్లీ హాలులో రిటర్నింగ్ అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రధానంగా ఎన్నికలలో పోటీచేయు అభ్య ర్థులు తమ ప్రచారంలో ఎన్నికల నిబంధ నలు అతిక్రమించకుండా ప్రచారం నిర్వహించాలని దీనిపై వివిధ స్క్వాడ్‌లను నియమించడం జరిగిందని, ఈ ప్రక్రియలో ఆ కమిటీలు విస్తృత తనిఖీలు నిర్వహించి ఎప్పటికప్పుడు సంబంధిత నివేదికలు అందజేయాలన్నారు. తనిఖీల సమయంలో పార్టీలవారీగా అభ్యర్థులకు నోటీసులివ్వా లన్నారు. ఈ ప్రక్రియలో ఎన్నికల నిబంధ నలపై నియమించిన వివిధ టీములు నిష్పక్షపాతంగా తనిఖీలు చేసి, అతిక్రమిం చిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. రాత్రి సమయాలలో అభ్యర్థులు తమ ప్రచారానికి సంబంధించి నగదు, మద్యం, చీరలు తదితర ప్రలో భాలు పెట్టి కార్యక్రమాలు చేపట్టడం జరు గుతుందని, దీనిపై ఫ్లయింగ్ సాధారణ, ఎక్స్‌పెండీచర్ తదితర కమిటీలు రాత్రి సమయాలలో గట్టి నిఘా వుంచి పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు.

ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ నవదీప్ సింగ్ మాట్లాడుతూ, ఎన్నికల నియమా వళిపై వివిధ కమిటీలు నియమించడం జరిగిందని, రాత్రి సమయాలలో ఎన్నికల నిబంధనల ఉల్లంఘన ఓటర్లను ప్రలోభ పెట్టే కార్యక్రమాలు జరుగుతాయని వాటిపై నిఘా విభాగాలు ప్రత్యేక దృష్టి పెట్టి అటువంటి వాటిపై తనిఖీలు నిర్వహించి కేసులు పెట్టాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకులు హేమంత్

సమావేశానంతరం సిపిఓ కార్యా లయం మిద్దెపైన ఏర్పాటుచేసిన మీడియా సర్టిఫికేషన్ మరియు మీడియ మానిటరింగ్ కమిటీని ఎన్నికల ప్రచారకులు హేమంత్ బినయ్ మహంత్, నవరాజ్‌సింగ్‌పంగ్తే సందర్శించి ఆ కమిటీ చేస్తున్న విధి విధానాలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ట్రైనీ జాయింట్ కలెక్టర్ ఎ.యం.ఇంతియాజ్ పరిశీలకులకు ఎం.సి.ఎం.సి కమిటీ పనిచేస్తున్న విధానాన్ని సంబంధిత నివేదికలు గురించి వివ రించారు.

ఈ సమావేశంలో సంయుక్త కలెక్టర్ రేఖారాణి, అదనపు సంయుక్త కలెక్టర్ ఆర్.ఎన్.రాజ్‌కుమార్, వివిధ నియోజకవర్గాలకు సంబంధించిన రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

## చోరీకి గురైన ఆర్డీఓ బైక్

అనామకుడైతేనేమి, అధికారిదైతేనేమీ బైక్, బైకేగదా! చోరీ, చోరీయేగదా! దొంగగారికి హస్తలాఘవం వుంటే చాలు ఎవరిదైనా చోరీ చేయడం పరిపాటే. పాపం నెల్లూరు రాంజీనగర్‌లోని నివాసం వుంటున్న ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ అధికారి కోదండ రామిరెడ్డి కూరగాయలు కొనుగోలు చేయడానికి నెల్లూరు మద్రాసుబస్టాండు దగ్గరగల కూరగాయల మార్కెట్ వద్ద బైక్ నిలిపి లోపలికి వెళ్ళి వచ్చేలోగా బైక్ మాయమైపోయింది. ఇంకేముంది చుట్టుప్రక్కల వెతికారు కనిపించలేదు. దాంతో ఆయన 4వ నగర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## తెదేపాలో బిసిలకు గుర్తింపు ఉంటుంది

నెల్లూరులో ఈ నెల 15న తెలుగుదేశం పార్టీ రాష్ట్ర యువ నాయకులు నారా లోకేష్ రోడ్‌షో నిర్వహించగా తెదేపా అధికార ప్రతినిధి నూనె మల్లికార్జున యాదవ్ కార్యకర్తలతో పాటు కలిసారు. ఈ సందర్భంగా నారా లోకేష్ మాట్లాడుతూ బిసిలకు తెలుగుదేశంపార్టీలో ఖచ్చితంగా గుర్తింపు వుంటుందని బి.సి., యస్సీ, యస్టీలతో అందరూ కలసి తెలుగుదేశం పార్టీ గెలుపుకు కృషి చేయాలని పేర్కొన్నారు. చంద్రబాబునాయుదుని ముఖ్యమంత్రిని చేసే లక్ష్యంతో ఇదే ఉత్సాహంతో పనిచేయాలని నూనె మల్లికార్జున యాదవ్‌ని కోరారు. కార్యక్రమంలో ఊరందూరు సురేంద్రబాబు, కిషోర్, సుధీర్, కిరణ్, విజయ్‌దినకర్, మహేష్, రాఘవ్, భాస్కర్, నరసింహ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



నారా లోకేష్‌ను సత్కరిస్తున్న నూనె మల్లికార్జున యాదవ్

## వైభవంగా మహనీయుల జయంతి వేడుకలు

నెల్లూరు దర్గామిట్టలోని బొల్లినేని హాస్పిటల్ ఎదురుగా గల నగరపాలక ప్రాథమికో న్నత పాఠశాలలో ఈ నెల 15న సింహపురి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మహనీ యులు డా॥ బి.ఆర్.అంబే ద్కర్, మహాత్మా జ్యోతిరావ్ ఫూలే, బాబూ జగ్జీవన్ రామ్‌ల జయంతులను ఘనంగా జరిపారు. విద్యార్థు లకు వ్యాసరచన పోటీలు జరిపి, విజేతలకు బహుమతి ప్రదానం చేసారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పల్లం వేణుగోపాల్ సభాధ్యక్షత వహించగా ముఖ్యఅతిథులుగా సహస్రసభాసింహం బి.వి.నరసింహం, డాక్టర్ ఈదూరు సుధాకర్, 'స్టేట్‌లీడర్' పత్రిక సంపాదకులు సర్వేపల్లి రామ్మూర్తి, ఇస్రో కార్యదర్శి కొండాపురం వెంకటేశ్వర్లు, జిల్లా ఆరోగ్య విద్యాశాఖాధికారి ఎల్.జోసఫ్, సృజన సంస్థ అధ్యక్షులు దగ్గుపాటి రాధాకృష్ణ, ట్రస్ట్ అధ్యక్షులు జి.బాబూరావులు, ఉపాధ్యాయసిబ్బంది కందికట్టు వేమయ్య, రవికృష్ణ రాయల్ తదితరులు పాల్గొన్నారు.





సమావేశంలో ప్రసంగిస్తున్న బి.వి.నరసింహం

# కల్యాణ వైభవం...!



రాష్ట్ర మాజీ ఆర్థికశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి -శిరీషల కుమార్తె **లీలాకైవల్య - రితేష్‌కుమార్‌రెడ్డి** (హైదరాబాద్ వాస్తవ్యులు డా॥ కొండ్రెడ్డి రవికుమార్‌రెడ్డి - విజయలక్ష్మిల కుమారుడు)ల వివాహం ఈ నెల 4వ తేదీ హైదరాబాద్‌లోని మాదాపూర్ హైటెక్స్‌లోను, రిసెప్షన్ వేడుకలు నెల్లూరులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్ నందు వైభవంగా జరిగాయి. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.



ఆదాల ప్రభాకర్‌రెడ్డి ముఖ్యఅనుచరుడు వై.వి.రామిరెడ్డి - విజయలక్ష్మిల కుమార్తె **అనూష - హేమంత్‌రెడ్డి** (తిరుపతి వాస్తవ్యులు మబ్బు శ్రీమన్నారాయణరెడ్డి - అరుణమ్మల కుమారుడు)ల కల్యాణం ఈ నెల 13వ తేదీ నెల్లూరులో సిపిఆర్ కల్యాణ మండపంలో వైభవంగా జరిగింది. కొత్తజంటకు 'లాయర్' శుభదీవెనలు.



హైదరాబాద్ వాస్తవ్యులు కొమ్మి భాస్కర్‌రావు - విమలల కుమార్తె **రాగిణి చౌదరి - వినయ్** ల పరిణయం ఈ నెల 13వ తేదీ నెల్లూరులోని స్వర్ణవేదిక కల్యాణ మండపంలో ఘనంగా జరిగింది. నూతన దంపతులకు 'లాయర్' శుభాభినందనలు.

## 'సేవా రత్న' రాచపాళెం రఘు

ఇటీవల కర్నూలు జిల్లా నంద్యాల పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాల ఆవరణంలో జరిగిన మహాత్మా జ్యోతిరావు పూలే 88వ జయంతి కార్యక్రమంలో నెల్లూరుకు చెందిన రాచపాళెం రఘుకు సేవా రత్న అవార్డును ప్రదానం చేసారు. పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరులో కార్మికశాఖ డిప్యూటీ కమీషనర్‌గా పనిచేస్తున్న రాచపాళెం రఘు వృత్తిరీత్యా రచయిత, సామాజిక కార్యకర్త కావడంతో ఈ అవార్డుకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో పీఎస్‌ఎస్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ సొసైటీ కార్యదర్శి బత్తుల సంజీవరాయుడు, సినీ డైరెక్టర్ గోపాలకృష్ణ, బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

## తెదేపాలో చేరిన కావలి ప్రముఖులు

ముసునూరులో వున్న ఏబిఎం సంస్థల అధినేత జి.డి.దివాకర్ నివాసంలో ఈ నెల 16న తెదేపా నెల్లూరు ఎంపి అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, కావలి ఎమ్మెల్యే అభ్యర్థి బీద మస్తాన్‌రావు సమక్షంలో కావలి పట్టణ ప్రముఖులు తెలుగుదేశం పార్టీలో చేరారు. మున్సిపల్ మాజీఛైర్మెన్ డాక్టర్ ఎన్.ప్రభాకర్‌నాయుడు, థామస్, దళిత నాయకుడు అడపాల డేవిడ్ తదితరులు తెదేపాలో చేరారు. ఆదాల ప్రభాకర్‌రెడ్డితో వున్న సత్సంబంధాల దృష్ట్యా వీరందరూ తెదేపాలో చేరినట్టు, తెదేపా అభ్యర్థుల విజయానికి వీరు కృషి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మన్నెమాల గోవిందురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హోరెత్తిన నామినేషన్ల పర్వం



నెల్లూరు లోక్‌సభ టీడీపీ అభ్యర్థిగా ఆదాల ప్రభాకర్‌రెడ్డి



నెల్లూరు లోక్‌సభ వైసీపీ అభ్యర్థిగా మేకపాటి రాజమోహన్‌రెడ్డి



తిరుపతి లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిగా చింతా మోహన్



తిరుపతి లోక్‌సభ వైసీపీ అభ్యర్థిగా వరప్రసాద్

సార్వత్రిక ఎన్నికల తిరునాళ్లకు నామినేషన్లతో అంకురార్పణ జరిగింది. జిల్లాలోని రెండు లోక్‌సభ(నెల్లూరు, తిరుపతి) స్థానాలకు, 10అసెంబ్లీ స్థానాలకు వివిధ పార్టీల అభ్యర్థులు భారీ హంగామా, ర్యాలీలతో నామినేషన్లు వేసారు. నెల్లూరు లోక్‌సభకు ఆదాల ప్రభాకర్‌రెడ్డి (టీడీపీ), మేకపాటి రాజమోహన్‌రెడ్డి (వైసిపి)లు నామినేషన్లు వేసారు. కాంగ్రెస్ అభ్యర్థి వాకాటి నారాయణరెడ్డి ఈ నెల 19న నామినేషన్ వేస్తున్నారు. ఇక నెల్లూరు రూరల్ నుండి ఆనం విజయకుమార్‌రెడ్డి(కాంగ్రెస్), సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి(బీజేపీ), కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి(వైసిపి), మాదాల వెంకటేశ్వర్లు(సీపీఎం)లు నామినేషన్లు వేసారు. నెల్లూరు నగరం నుండి పి.అనిల్‌కుమార్‌యాదవ్(వైసిపి), ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి (టీడీపీ), ఆనం చెంచుసుబ్బారెడ్డి(కాంగ్రెస్), ఆనం జయకుమార్‌రెడ్డి(జైసపా), ఉదయగిరి నుండి బొల్లినేని రామారావు(టీడీపీ), మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి(వైసిపి), పి.చెంచలబాబు యాదవ్(కాంగ్రెస్), ఆత్మకూరు నుండి ఆనం రామనారాయణరెడ్డి(కాంగ్రెస్), గూటూరు కన్నబాబు(టీడీపీ), మేకపాటి గౌతంరెడ్డి (వైసిపి), వెంకటగిరి నుండి కురుగొండ్ల రామకృష్ణ (టీడీపీ), కొమ్మిలక్ష్మయ్యనాయుడు(వైసిపి), నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి(కాంగ్రెస్), సూళ్లూరుపేట నుండి కిలివేటి సంజీవయ్య(వైసిపి), డి.మధుసూదన్‌రావు (కాంగ్రెస్), గూడూరు నుండి పాశం సునీల్‌కుమార్ (వైసిపి), పనబాక కృష్ణయ్య(కాంగ్రెస్), సర్వేపల్లి నుండి కాకాణి గోవర్ధన్‌రెడ్డి(వైసిపి), డాక్టర్ పట్టాభిరామయ్య(కాంగ్రెస్), కోవూరు నుండి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి(వైసిపి), పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి (టీడీపీ), కావలి నుండి బీద మస్తాన్‌రావు(టీడీపీ), రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి (వైసిపి), చింతాల వెంకటరావు(కాంగ్రెస్)లు నామినేషన్లు దాఖలు చేసారు. గురువారం రాత్రి వరకు కూడా సర్వేపల్లి, గూడూరు, సూళ్లూరుపేటలలో తెలుగుదేశం అభ్యర్థులు ఖరారు కాలేదు.



నెల్లూరునగర వైసీపీ అభ్యర్థిగా పి.అనిల్‌కుమార్‌యాదవ్



నెల్లూరురూరల్ వైసీపీ అభ్యర్థిగా కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి



నెల్లూరునగర కాంగ్రెస్ అభ్యర్థిగా ఆనం చెంచుసుబ్బారెడ్డి



సర్వేపల్లి వైసీపీ అభ్యర్థిగా కాకాణి



నెల్లూరునగర జైసపా అభ్యర్థిగా ఆనం జయకుమార్‌రెడ్డి



నెల్లూరు రూరల్ కాంగ్రెస్ అభ్యర్థిగా ఆనం విజయకుమార్‌రెడ్డి



గూడూరు వైసీపీ అభ్యర్థిగా పాశం సునీల్‌కుమార్



నెల్లూరు రూరల్ బీజేపీ అభ్యర్థిగా సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి

# గూడూరు డివిజన్ వార్తలు

## ఘనంగా డా॥బి.ఆర్.అంబేద్కర్ జయంతి వేడుకలు



అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న ఆర్డీవో శ్రీనివాసరావు మరియు నాగిశెట్టి ధర్మయ్య

దళితుల అభివృద్ధికి పాటుపడిన వ్యక్తి డా॥బి.ఆర్.అంబేద్కర్ అని ఆర్డీవో శ్రీనివాసరావు అన్నారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా సోమవారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలు మరువరానివని, దళితులకు ఆయన చేసిన సేవలను అనుసరించాలని ఆయన కోరారు. అంటరానితనాన్ని నిర్మూలించాలని పోరాడిన వ్యక్తి అంబేద్కర్ అని కొనియాడారు. తరువాత టవర్‌క్లాక్ సెంటర్ వద్ద ఏర్పాటుచేసిన అంబేద్కర్ విగ్రహానికి ఆర్డీవో శ్రీనివాసరావు మరియు ఏపి షెడ్యూల కులాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నాగిశెట్టి ధర్మయ్య పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సీడీపివో ఉమా మహేశ్వరీ తదితరులు పాల్గొన్నారు. తరువాత పట్టణంలోని తపాలా కార్యాలయం వద్దనున్న అంబేద్కర్ విగ్రహానికి తపాలా కార్యాలయ సూపరింటెండెంట్ రమణయ్య, పోస్టుమాస్టర్ సుబ్బారావు, గోవిందు నాయక్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివిధ సంఘాల నాయకులు ఆధ్వర్యాన అంబేద్కర్‌కు అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి విజిలెన్స్ మానటరింగ్ సభ్యుడు అరవ పార్వతయ్య, వివిధ సంఘాల నాయకులు మందాకృష్ణ, దాసరి కృష్ణ, రవి, పల్లం క్రిష్ణయ్య, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### పివిఆర్‌లో...
## బీజేపీ కార్యకర్తల సమావేశం

ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై భారతీయ జనతాపార్టీ నాయకులు గూడూరు పివిఆర్ కల్యాణ మండపంలో సోమవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి మాట్లాడుతూ తిరుపతి పార్లమెంటు నియోజకవర్గాన్ని బిజేపీకి కేటాయించారని అభ్యర్థి విజయానికి ప్రతి కార్యకర్త నాయకులు కృషి చేయాలని అన్నారు. నాయకులు రాజారాం, పేర్నేటి రంగారెడ్డి, పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి రంగినేనికృష్ణయ్య, పట్టణ అధ్యక్షులు చెంచురెడ్డి, పనబాక కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాలను నివారించేందుకు అవగాహన సదస్సు



కరపత్రాలను పంపిణీ చేస్తున్న సిబ్బంది

అగ్ని ప్రమాదాలను నివారించేందుకు అవగాహన కలిగివుండడం ముఖ్యమని గూడూరు అగ్నిమాపకాధికారి పెంచలయ్య తెలిపారు. పట్టణంలోని వారి కార్యాలయంలో సోమవారం ప్రజలకు అవగాహన కల్పించారు. అవగాహనారాహిత్యంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన వివరించారు. ప్రమాదం సంభవించగానే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సోమవారం నుండి 20వతేదీ వరకు వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది వీరయ్య, రాజారమణ, గౌస్‌బాషా, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

### వైఎస్సార్ పార్టీ అభ్యర్థుల విజయానికి
## నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలి



విలేకర్లతో మాట్లాడుతున్న సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి

వైఎస్సార్ పార్టీ అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని పార్టీ సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి తెలిపారు. గూడూరులో ఈ మేరకు సోమవారం నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. గూడూరు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా పాశం సునీల్‌కుమార్‌ను పార్టీ అధినాయకత్వం ప్రకటించిందని గోపాల్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో అభ్యర్థి పాశం సునీల్‌కుమార్, నాయకులు, రాధాకృష్ణ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 23కేసులకు పరిష్కారం

గూడూరు కోర్టు ఆవరణంలో శనివారం మండల న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో మెగా లోక్‌అదాలత్ జరిగింది. ఎక్సైజ్ కేసులు 9, సివిల్ 2, మోటారు వాహనాలకేసులు 4, క్రిమినల్ నాలుగు, బీఎస్ఎన్ఎల్ 7 సహా మొత్తం 23కేసులు పరిష్కరించారు. మొత్తం 3,94,000/- రికవరీ చేశారు.

అదాలత్‌లో మండల న్యాయ సేవా అధికార సంస్థ ఛైర్మెన్, ఏడో అదనపు జిల్లా జడ్జి పి.గురప్ప, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి.దివాకర్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కె.పి.సాయిరాం ఏజీపీ యరగుడిపాటి చలపతిరావు వీపీ రజనీకాంత్‌రెడ్డి, బీఎస్ఎన్ఎల్ మేనేజర్ సంపత్‌కుమార్, కక్షదారులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ ఏ.ఎస్.ఐ మాధవరావుకు సన్మానం



మాధవరావును సన్మానిస్తున్న టౌన్ సిఐ భూషణం

గూడూరు పట్టణంలోని ఒకటవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తూ గత నెల 30వతేదీన రిటైర్ అయిన మన్నేపల్లి మాధవరావును ఈ సందర్భంగా ఆదివారం పట్టణ సిఐ భూషణం, ఒకటవ, రెండవ పట్టణ ఎస్ఐలు బాబీ, అజయ్‌కుమార్, నారాయణరెడ్డిలు మరియు పోలీసు సిబ్బంది ఘనంగా శాలువా కప్పి పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా సి.ఐ భూషణం మాట్లాడుతూ 1979లో మాధవరావు గూడూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో చేరాడని తరువాత నెల్లూరు, ఉదయగిరి, వి.సత్రం, ఆత్మకూరు, సోమశిల, ఇందుకూరుపేట తదితర ప్రాంతాలలో చేసి గూడూరు ఒకటవ పట్టణలో రిటైర్డ్ అయినారని ఆయన తెలిపారు.

ఏ వృత్తిలోనైనా సక్రమంగా విధులు నిర్వహించే వారికి గుర్తింపు ఉంటుందని చెప్పారు. ఆయన పోలీసుశాఖకు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### సార్వత్రిక ఎన్నికలకు...
## నిమగ్నమైన రెవెన్యూ సిబ్బంది

వచ్చే నెలలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు ముందస్తుగా రెవెన్యూ సిబ్బంది ఏర్పాట్లుపై నిమగ్నమైనారు. గూడూరు తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం ఆర్డీవో కార్యాలయంలో స్థానిక విఆర్వోలు ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన నియమావళి పుస్తకాలు, వస్తు సామాగ్రిని ముందస్తుగానే సిద్ధం చేస్తున్నారు. గూడూరు నియోజకవర్గానికి ఎన్నికల సామాగ్రిని పంపిణీ చేసేందుకు మండలాల వారీగా రూట్లను విభజించారు. ఈ మేరకు సరఫరాకు చర్యలు తీసుకుంటున్నారు.

# శ్రీకాళహస్తి న్యూస్

## తెలుగుదేశం అభ్యర్థి 'బొజ్జలే'



శ్రీకాళహస్తి తెలుగుదేశంపార్టీ అసెంబ్లీ అభ్యర్థిగా బొజ్జల గోపాలకృష్ణారెడ్డిని ఖరారు చేసారు. బొజ్జల అభ్యర్థిత్వం ఇక్కడ ఊహించిందే! ఆయనను కాదని ఇంకొకరు ఈ సీటును ఆశించే పరిస్థితి లేదు. తండ్రి బొజ్జల గంగసుబ్బరామిరెడ్డి 1967లో స్వతంత్ర అభ్యర్థిగా ఎమ్మెల్యేగా గెలుపొందారు. అనంతరం ఆయన కుమారుడు బొజ్జల గోపాలకృష్ణారెడ్డి 1989లో టిడిపి తరపున రాజకీయ రంగప్రవేశం చేసి నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొందారు. శ్రీకాళహస్తి నియోజకవర్గానికి ఎన్నో సేవలు అందించారు. 20 సంవత్సరాలపాటు నాలుగు పర్యాయాలు శాసనసభ్యులుగా గెలుపొంది రెండు పర్యాయాలు మంత్రిగా కొనసాగారు. 2004లో ఓటమి చవిచూచారు. 2009లో మళ్ళీ ఎమ్మెల్యేగా గెలుపొందారు. బొజ్జల శ్రీకాళహస్తీశ్వరాలయాల ట్రస్టుబోర్డు ఛైర్మన్‌గా కూడా వ్యవహరించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో త్రాగునీటి కోసం, అలాగే తెలుగుగంగ నీరు కోసం కృషి చేశారు. వంద పడకల ప్రభుత్వాసుపత్రిని నిర్మించారు. శ్రీకాళహస్తీశ్వరాలయ అభివృద్ధి , ఒక ఇంజనీరింగ్ కళాశాల కూడా నిర్మించి మూడు సంవత్సరాల పాటు 1200 మంది విద్యార్థులకు విద్యాబోధన అందించిన ఘనత బొజ్జలకే దక్కింది. 16వ తేది బుధవారం శ్రీరామనగర్ కాలనీనుంచి భారీ ఎత్తున ర్యాలీలు, ప్రదర్శనలతో నామినేషన్ వేయడానికి తహశీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. నామినేషన్ ఫారమును శ్రీకాళహస్తి తహశీల్దార్ మధుసూదన్‌రెడ్డికి అందచేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు భారీ ఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు. వాడవాడలా ప్రజలు ఆయనకు స్వాగతం పలికారు.

## వైసిపి అభ్యర్థిగా బియ్యపు మధుసూదన్‌రెడ్డి



శ్రీకాళహస్తి వైసిపి అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఈ నెల 16న నామినేషన్ దాఖలు చేసారు. నెల్లూరు జిల్లా పెళ్లకూరు మండలం నెలబల్లి మధు స్వగ్రామం. బాల్యం నుంచి శ్రీకాళహస్తి మండలం అమ్మపాళెంలోనే పెరిగారు. ప్రస్తుతం శ్రీకాళహస్తిలో స్థిరపడ్డారు. 1992 నుంచి 1999 వరకు యువజన కాంగ్రెస్ నాయకుడిగా ఉన్న ఈయన 2004లో జగన్ ఛారిటబుల్ ట్రస్టు స్థాపించి అనేక సేవా కార్యక్రమాలు చేశారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుటుంబంతో సన్నిహిత సంబంధాలున్నాయి. 2004, 2009 ఎన్నికల్లో శ్రీకాళహస్తి కాంగ్రెస్ టిక్కెటు కోసం ప్రయత్నించినా రాజకీయ సమీకరణల్లో భాగంగా దక్కలేదు. జగన్ వైసిపిని స్థాపించడంతో కాంగ్రెస్‌పార్టీకి రాజీనామా చేసి పార్టీలో చేరారు. అప్పట్నుంచి శ్రీకాళహస్తి నియోజకవర్గ పార్టీ బాధ్యతలను బియ్యపు మధుసూదన్‌రెడ్డి చూస్తున్నారు. మన్నవరం ప్రాజెక్టు, ఎస్.ఎస్ కెనాల్ పనులు త్వరితగతిన పూర్తి చేయించడానికి కృషి చేస్తానన్నారు. ఈయన 16వ తేదీన వైసిపి అభ్యర్థిగా నామినేషన్ వేశారు. కార్యకర్తలతో భారీ ఎత్తున ర్యాలీలు, ప్రదర్శనలతో తహశీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం నామినేషన్‌ను తహశీల్దార్‌కు అందచేశారు.

## జై సమైక్యాంధ్ర అభ్యర్థి సి.ఆర్.రాజన్

చిత్తూరు జిల్లాలోనే ప్రముఖ ఆలయాల్లో తిరుచానూరు ఆలయం కూడా చాలా ముఖ్యమైనది. అలాగే మూడుపర్యాయాలు సర్పంచుగా గెలుపొంది తిరుచానూరు ఆలయం ఆస్తులను రాబట్టడంలో కాని, కాపాడడం కాని, అభివృద్ధి చెందడానికి సి.ఆర్.రాజన్ ఎంతో కృషి చేసారు. సి.ఆర్.రాజన్ శ్రీకాళహస్తి నియోజకవర్గం నుండి జైసమైక్యాంధ్ర పార్టీ అభ్యర్థిగా ఈనెల 17వతేది నామినేషన్ వేశారు. భారీఎత్తున ర్యాలీలు, ప్రదర్శనలతో నామినేషన్ వేయడానికి తహశీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. నామినేషన్ ఫారమును శ్రీకాళహస్తి తహశీల్దార్ మధుసూదన్‌రెడ్డికి అందచేశారు. ఈ కార్యక్రమంలో జై సమైక్యాంధ్ర కార్యకర్తలు భారీ ఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు. వాడవాడలా ప్రజలు ఆయనకు స్వాగతం పలికారు.

## జై సమైక్యాంధ్ర కార్యాలయం ప్రారంభం



మాట్లాడుతున్న దందోలు చక్రధర్

గూడూరు పట్టణంలోని ఎన్‌జివో భవనం ఎదురుగా శనివారం జై సమైక్యాంధ్ర పార్టీ కార్యాలయాన్ని ఆ పార్టీ నాయకులు ప్రారంభించారు. దందోలు చక్రధర్ మాట్లాడుతూ రాష్ట్ర విభజనతో ఉద్యోగులు, విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారని దీన్ని వ్యతిరేకిస్తూ మాజీ సి.ఎం కిరణ్‌కుమార్‌రెడ్డి పదవిని వదులుకున్నారన్నారు. అంతకు ముందు జై.స.పా నాయకులు పట్టణంలో ర్యాలీ చేశారు. పార్టీ రాష్ట్ర పరిశీలకుడు పి.సునీల్ కుమార్‌రెడ్డి, సభ్యుడు పి.కుమార్, కృష్ణా తదితరులు పాల్గొన్నారు.

శ్రీరస్తు శ్రీ గణేశాయ నమః శుభమస్తు

నెల్లూరు జిల్లా, ఇందుకూరుపేట మండలం, కొత్తూరు

# శ్రీ షిర్డి సాయిబాబా మరియు శ్రీ యోగాంజనేయస్వామి వార్ల

# "5" రోజుల ప్రథమ వార్షిక బ్రహ్మోత్సవ ఆహ్వానము





స్వస్తిశ్రీ! జయనామ సంవత్సరం
ఉత్తరాయణం చైత్రమాసం కృష్ణపక్షం సప్తమి
సోమవారము నుండి ఏకాదశి శుక్రవారం వరకు
అనగా సరియగు తేది 21-04-2014 నుండి
25-04-2014 వరకు నెల్లూరు జిల్లా
ఇందుకూరుపేట మండలం కొత్తూరు గ్రామం
నందు వెలసిన

**శ్రీ షిర్డిసాయిబాబా మరియు శ్రీ యోగాంజనేయ స్వామి వార్ల**

"5" రోజుల ప్రథమ వార్షిక బ్రహ్మోత్సవ కార్యక్రమములు నెరవేర్చుటకు భగవంతుని అనుగ్రహంతో నిశ్చయించడమైనది.

## శ్రీ సాయిబాబా మందిర కార్యక్రమ వివరములు

**తేది 21-04-2014 సోమవారం ఉదయం గం॥ 8.00 లకు ప్రారంభం**

దేవతా ప్రార్థన, గణపతిపూజ, పుణ్యాహవాచనం, దేవానాంది, దీక్షాకంకణ ధారణం, మహా సంకల్పం, కృచ్ఛాచరణ, ఋత్విక్ వరణ, అష్టమూర్తి ప్రార్థన, బ్రహ్మకూర్చహోమం, అష్టద్రవ్యగణపతి హోమం, పూర్ణాహుతి, మంగళహారతి

**సాయంత్రం గం॥ 6.00ల నుండి రాత్రి గం॥ 9.00ల వరకు**

గణపతిపూజ, మండలదర్శన, మండలారాధన, రాక్షోఘ్న పారాయణము, రాక్షోఘ్నహోమము, వాస్తుపూజ, స్వప్నకలశస్థాపన, మహాపూజ, పూర్ణాహుతి, దిక్‌బలి, మహా మంగళ హారతి

**తేది 22-04-2014 మంగళవారము ఉదయం గం॥ 8.00ల నుండి గం॥ 12.30ల వరకు**

గణపతిపూజ, స్వస్తిపుణ్యాహం, నవగ్రహ హోమము, శాంతిప్రాయశ్చిత్తహోమము, అధివాస హోమము, గణపతిమూల మంత్ర హోమము, దత్తాత్రేయ హోమము, అయ్యప్పహోమము, శ్రీ సాయిబాబా మూలమంత్రహోమము, కాలవృద్ధి హోమము, వసోధారహోమము, మహాహుతి, పూర్ణకలశనిధ్య, కుంభాభిషేకము, మహామంగళహారతి.

**సాయంత్రం గం॥ 6.00 నుండి గం॥ 8.30 ల వరకు**

శ్రీ షిర్డి సాయిబాబా వారి మహాపూజ, పల్లకీసేవ, అష్టావధానసేవ, మహా మంగళ హారతి.

## శ్రీ యోగాంజనేయ మందిర కార్యక్రమ వివరములు

**తేది 23-04-2014 బుధవారం ఉదయం గం॥ 8.30 ల నుండి గం॥12.00ల వరకు**

దేవతా ప్రార్థన, గణపతిపూజ, స్వస్తిపుణ్యాహం, మహాసంకల్పము, కృచ్ఛాచరణ, అష్టమూర్తి ప్రార్థన, బ్రహ్మ కూర్చహోమము అష్టద్రవ్య గణపతి హోమము, పూర్ణాహుతి, మంగళహారతి.

**సాయంత్రం గం॥ 6.00ల నుండి రాత్రి గం॥ 9.30ల వరకు**

గణపతిపూజ, రాక్షోఘ్నహోమము, సుదర్శన సహస్ర మంత్ర హోమము, వాస్తుపూజ, సర్వతోభద్ర యంత్రారాధన పూజ, కలశస్థాపన పూజ, పూర్ణాహుతి, దిక్‌బలి, మంగళహారతి.

**తేది 24-04-2014 గురువారము ఉదయం గం॥ 8.30ల నుండి గం॥ 12.30ల వరకు**

గణపతిపూజ,పుణ్యస్థానశుద్ధి హోమము, బింబశుద్ధిహోమము, ప్రాసాదశుద్ధి హోమము, తత్త్వహోమము, అధివాసహోమము, స్నపనమండలపూజ, బ్రహ్మకలశస్థాపన, బ్రహ్మకలశ స్థాపన పూజ, దిశ హోమము, పూర్ణాహుతి

**సాయంత్రం గం॥ 4.30 నుండి గం॥ 10.00 ల వరకు**

గణపతిపూజ, ప్రాయశ్చిత్తహోమము, అష్టావధానసేవ, మంగళహారతి
శ్రీరామ, ఆంజనేయ పరివారదేవతామూర్తుల ప్రాకారోత్సవం, **గ్రామోత్సవం** వైభవంగా జరుగును.

**తేది 25-04-2014 శుక్రవారము ఉదయం గం॥ 8.00ల నుండి**

గణపతిపూజ, పుణ్యాహం, స్నపనహోమము, శ్రీ యోగాంజనేయ మూలమంత్ర హోమము, కాలవృద్ధి హోమము,వసోర్ధారము ఉ॥ గం॥11.00లకు "మహా పూర్ణాహుతి" పూర్ణకలశ నిధ్య, బ్రహ్మకలశాభిషేకము, మహాపూజ, మహా మంగళహారతి సామూహిక ప్రార్థన, ఆశీర్వాద గ్రహణము.

ఈ విధముగా 5 దినములు జరుగు కార్యక్రమములకు బంధుమిత్ర సమేతంగా విచ్చేసి
**శ్రీ షిర్డిసాయిబాబా** మరియు **శ్రీ యోగాంజనేయస్వామి** వార్ల తీర్థప్రసాదములు స్వీకరించి
స్వామి వార్ల కృపాకటాక్షములకు పాత్రులు కావలసినదిగా కోరడమైనది.

**గమనిక :** అన్నప్రసాద వితరణ 21-4-2014 నుండి
25-04-2014 వరకు ప్రతి రోజూ మధ్యాహ్నం
12.00 గంటల నుండి ప్రారంభం

శ్రీమతి **కలికి శ్రీలత**
శ్రీ **కలికి కోదండరామిరెడ్డి**, ధర్మకర్తలు
శ్రీ షిర్డి సాయిబాబా మందిరం ట్రస్ట్, కొత్తూరు గ్రామం
ఇందుకూరుపేట మండలం, నెల్లూరు జిల్లా.

Edited, Published, Printed & owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**.